# వెండితెర సాక్షిగా

-కథలు

- జీడిగుంట రామచంద్రమూర్తి



శ్రీ
కౌముది
మీ మునివేళ్లలో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 208

కౌముది మాసపత్రికలో

జనవరి 2016 సంచిక నుంచి నవంబర్ 2016 సంచిక వరకూ వచ్చిన

కథలు

# (ప్రారంభం)

**మనుషులు రెండు రకాలు.**

"డబ్బు సంపాదించుటెట్లు?" అని రాత్రింబగళ్ళు జుట్టు పీక్కుంటూ ఆలోచించే టైపు మనుషులు మొదటిరకం.

"సంపాదించిన డబ్బు ఖర్చు చేయుటెట్లు?" - అని అల్లాడిపోయే అదృష్టవంతులు రెండోరకం.

మొదటి రకం మనుషులు ఈ దేశం నిండా ఉండచ్చు.. కానీ రెండో టైపు వాళ్ళు మాత్రం హైదరాబాదు, మదరాసు, బొంబాయి వంటి మహానగరాల్లోనే ఉన్నారు, ఉంటారు. ఈ బాపతు మనుషులు పరిశ్రమలు స్థాపించో, వ్యాపారాలు సాగించో రెండుచేతులా సంపాదించి పోస్తుంటారు. వాటిలో నాలుగురాళ్ళు లాభం వస్తే ఆ లాభాలతో మళ్ళీ మరో ఇండస్ట్రీయో, బిజినెస్సో ప్రారంభిస్తారు. అలా అలా అల్లుకుపోయి బిర్లా టాటాల లెవెల్లోకి ఎదిగిపోతారు.

అయితే పెట్టుబడి లేకుండా పెద్దపెట్టున డబ్బు సంపాదించే మార్గాలు కూడా కొన్ని ఉన్నాయి. 'సినీ నటజీవితం' ఈ కోవలోకే వస్తుంది. ఎటొచ్చీ 'టాలెంటు'ండాలి. ఈ టాలెంటు కూడా అనేకరకాలు. ఆడవారికో రకం. మగవారికో రకం. ఎవరికివారు ఆయా రకాల 'టాలెంటు'ను ప్రదర్శించి హీరోకానీ హీరోయిన్ కానీ అయిపోతే ఇక డబ్బే డబ్బు.

దూరం నుంచి చూస్తే కొండలన్నీ నున్నగా కనిపిస్తాయి. అట్లాగే బయటనుంచి చూసేవారికి సినీనటుల జీవితం స్వర్గసీమలా కనిపిస్తుంది. రంగుల హరివిల్లనిపిస్తుంది.

కానీ అందరి జీవితాలూ అక్కడ వడ్డించిన విస్తళ్ళు కావు. అదృష్టదేవత కొందర్నే వరిస్తుంది. వాళ్ళు బస్సు కండక్టర్లే కావచ్చు. టైలర్లే కావచ్చు. సినిమా హీరోలై లక్షలు సంపాదించగలుగుతారు. ఒకప్పుడెప్పుడో కొంతమంది ఆ బాపతు హీరోలు లక్షలు సంపాదించినా లక్ష్యం లేకుండా ఖర్చుపెట్టి తమ చివరి రోజుల్ని లక్షణంగా గడపలేకపోయారు. వదిలెయ్యండి... కానీ వాళ్ళ చరిత్రలు చదివిన ఈనాటి హీరోలు 'ముందు జాగ్రత్త చర్యలు' తీసుకుని మందుక్కూడా 'కానీ' ఖర్చుపెట్టకుండా - అన్నింటికీ 'ప్రొడ్యూసర్'కే వేస్తారు. వాళ్ళ భోజనానికి వాళ్ళు ఖర్చు పెట్టరు. వాళ్ళ బట్టలకి వాళ్ళు ఖర్చు చేయరు. వాళ్ళ దారిఖర్చులకు వాళ్ళు జేబులో చెయ్యి పెట్టరు. అట్లా పొదుపు చర్యలు పాటించి సంపాదించుకుంటున్న డబ్బంతా రకరకాలుగా 'మంచి' పనులకోసం ఇన్వెస్ట్ చేస్తూంటారు. వాళ్ళ సంగతి మనకొద్దు. హీరోయిన్ల సంగతి చూద్దాం. అసలు హీరోయిన్ కావాలంటే అదృష్టం ఉండాలి. టాలెంటు ఉండాలి. ఆ పైన ఇంకా 'చాలా' ఉండాలి. హీరోయిన్ ముద్ర వేయించుకుంటే 'పదేళ్ళ బిజీ' గ్యారంటీ.

ఒక నటి 'మహానటి'గా ఎదగాలంటే - ఎంతో తాపత్రయపడాలి. కొందరైతే ఈ తాపత్రయంలో భాగంగా 'దేని'కైనా రెడీ అయిపోతారు. మనసుని చంపుకుంటారు. శరీరాన్ని అంకితం చేస్తారు. వెండి తెరమీద వెలగాలనే క్రేజు, కీర్తీ, డబ్బు కాంక్షా వారిచేత ఎలాంటి పనైనా చేయిస్తుంది. ఒక్కసారి మెట్లన్నీ ఎక్కేసి పై అంతస్తు చేరిపోతే గొడవ ఉండదు. అపుడు ఎలాంటివాళ్ళనైనా - తామే 'డిక్టే'ట్ చేయగలిగే పరిస్థితిని అందుకోవచ్చు.

కానీ అందరికీ ఈ అవకాశం దొరకదు కాక దొరకదు. ఇదొక మత్తు. ఇదొక కలల ప్రపంచం. ఈ కలల ప్రపంచంలో కాలుపెట్టి - జారిపోయి - కరిగిపోయి - తమ జీవితాన్ని నాశనం చేసుకునే సోదరీమణులు ఎందరో ఉన్నారు.

అలాంటి వారి జీవిత గాథల్ని కొన్ని ఆ నోటా ఈ నోటా విన్నవే అయినా - వాటిని పరిశోధించి ఆయా తారల్ని స్వయంగా కలుసుకుని - వారి అనుభవాల్ని ముఖతః తెలుసుకుని, వాటిని యథాతథంగా మీ ముందుంచుతున్నాను.

*అయితే అలాంటి వారి బ్రతుకుల్ని బట్టబయలు చేసి - వారిని అవమానాలకు గురిచేయాలని నా ఉద్దేశ్యం కాదు. వెండితెర మీదకు ఎక్కి వెలలేని సంపాదననీ, వేనోళ్ళ పొగడ్తల్నీ పొందాలని ఆశపడే అమ్మాయిలకు - ఆ వెండితెర వెలుగు జిలుగుల వెనుక ఎంతటి గాడాంధకారం వ్యాపించి ఉంటుందో తెలియ చెప్పాలనే ఈ చిన్న ప్రయత్నం. అందుకే ఈ యధాతథ గాథల్లో అసలు పేర్లు మాత్రం ఇవ్వకుండా - అలాంటి వారి బాధామయ జీవితాలకు సానుభూతిగా ఈ కథలు మీకందించటం జరిగింది.*

*ఇదిలా రూపుదిద్దుకోడానికి కారకులు 'సితార' పత్రిక అసోసియేట్ సంపాదకులు శ్రీ శ్రీకంఠమూర్తిగారు. తమ పత్రిక కోసం ఈ పరిశోధనాత్మక రచనలు చేయమని, కోరటంతోబాటు అందుకు తగిన సహాయ సహకారాన్ని కూడా అందించారు. అందుకు వారికీ, వారి సిబ్బందికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.*

*'సితార'లో ప్రచురించబడుతున్న సమయంలోనే ఈ 'కథలు' చదివి వీటిని 'పుస్తకరూపం'లో తీసుకురమ్మంటూ - భుజం తట్టి ప్రోత్సహించిన ప్రముఖ పాత్రికేయులు, నిర్మాత శ్రీ వాసిరాజు ప్రకాశంగారి సహృదయతను ఎప్పటికీ మర్చిపోలేను.*

*అలాగే ఈ రచనలన్నీ చదివి తన అమూల్యమైన అభిప్రాయాన్ని అందించిన మిత్రులు శ్రీ జంధ్యాలగారికి నా హృదయపూర్వకమైన కృతజ్ఞతలు అందచేస్తున్నాను.*

*ఈ రచనలు సితారలో 20 వారాలపాటు ధారావాహికంగా ప్రచురణయిన సందర్భంగా ఎందరో పాఠకులు అభిమాన పురస్సరంగా - శీర్షికను మెచ్చుకుంటూ, ఉత్తరాలు రాశారు. వారికి కూడా ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుకోవటం నా కర్తవ్యంగా భావిస్తున్నాను.*

**జీడిగుంట రామచంద్రమూర్తి.** *(నవంబర్ 1993)*

## మోసపోయిన మంజులత

***జనవరి 1...***

కొత్త సంవత్సర శుభారంభం.

సందడే సందడి.

"అయ్యా! కొత్త సంవత్సరం వచ్చిందని మురిసిపోకండి. మీ జీవిత పరిమాణంలో ఓ ఏడాది తరిగిపోయిందని ఆలోచించండి" అని వేదాంతులు చెప్పే సత్యాన్ని ఆఫ్టరాల్ కింద తీసిపారేస్తారు.

'జానేదేవ్ - పోతేపోనీ' అనుకుంటారు.

ప్రతి మనిషీ తన ముఖంలో కొత్త ఉత్సాహాన్ని పూసుకుంటాడు. మనసులో సరికొత్త కోరికల్ని రాసుకుంటాడు.

కొత్త సంవత్సరం తనకు శుభప్రదంగా శోభాయమానంగా గడిచిపోవాలని కోరుకుంటాడు.

కొత్త సంవత్సరంలో చాలామంది ప్రతిజ్ఞలూ, ప్రమాణాలూ కూడా చేసుకుంటారు.

"రేపటి నుంచీ సిగరెట్టు కాల్చనుగాక కాల్చను" అంటూ డిసెంబర్ ముప్పయ్యొకటోతేదో అర్ధరాత్రివేళ - సిగరెట్టు పెట్టెలో ఉన్న ఆఖరి సిగరెట్టును ఆఖరిదాకా కాలుస్తూ పక్కనున్న అర్ధాంగికి ప్రమాణం చేస్తాడు ఓ మొగుడు.

'అంటే రోజుకి ముప్పయ్ రూపాయలు మిగుల్తాయి. నెలకు తొమ్మిదివందలు.. ఏడాదికి ఎంతలేదన్నా పదివేల రూపాయలన్నమాట. ఆ లెఖ్ఖన ఏటా నీకో నాలుగు కాసుల బంగారం వస్తుంది' - అంటూ అర్ధాంగిని దగ్గరకు తీసుకుని - గుండెలకు హత్తుకుని చెవిలో చెప్తాడు. ఆ ఇల్లాలికి చెవిలో మాటలు అమృత ప్రాయమవుతాయి. 'ఫ్లాష్ ఫార్వర్డ్'కి వెళ్ళిపోతుది. తనను తాను వంటినిండా బంగారు నగలతో ఊహించుకుని భర్త కౌగిట్లో కరిగిపోతుంది.

డిశంబరు ముప్పయ్యొకటో తేదీ అర్ధరాత్రి పన్నెండింటిదాకా ఫ్రెండ్సుతో తాగి - అందరికీ 'హేపీ న్యూయిర్' చెపి - అర్ధరాత్రి దాటాక తూలుతూ ఇంటికొచ్చి - భార్యామణికి కూడా 'విష్‌యూ హ్యాపీ న్యూయియర్' అని మొగుడుగారు చెప్పినప్పుడు - 'ఏవండీ! ఈ కొత్త సంవత్సరంలో నైనా మీరీపాడు అలవాటు మానేయండీ' అని అర్ధిస్తుంది. ఆ మైకంలో 'ఆల్‌రైట్' - అని వరం ఇచ్చేస్తాడు. తన జీవితంలో కొత్త వెలుగులు ప్రసరించబోతున్నాయని ఆ మహా ఇల్లాలు మురిసిపోతుంది. సరిగ్గా గత సంవత్సరం డిసెంబరు ముప్ఫయ్యొకటోతేదో అర్ధరాత్రి వేళ కూడా 'ఆయనగారు' అలాంటి ప్రతిజ్ఞ చేశారన్న విషయం మరిచిపోతుంది.

మర్నాడు పొద్దున్నే డైరీలో - తన భర్త తనకు ప్రసాదించిన వరం గురించి ఓ లైను రాసుకుంటుంది.

అసలు డైరీలకీ - కొత్త సంవత్సరానికీ లింకుంటుంది. కొత్త సంవత్సరం ఇంకా వారం పదిరోజుల్లో వస్తుందనగానే కొత్త డైరీల కోసం చాలామంది తహతహలాడిపోతారు. అదృష్టవంతులు కొంతమందికి చాలా డైరీలు ఉచితంగా వస్తాయి. వాటినన్నింటినీ ఏం చేసుకోవాలో తెలియక చాకలిపద్దులు రాసుకోటానికీ, పిల్లల హోం వర్కు లెఖ్ఖలు చేసుకోటానికి ఉపయోగించేస్తుంటారు.

ఆ బాపతు అదృష్టానికి నోచుకోని వాళ్ళు - పాతికో ముప్పయ్యో పోసి మార్కెట్టులో కొనుక్కోవాల్సిందే. డైరీలు దైనందిన జీవితంలో చాలా ముఖ్యపాత్రను వహిస్తుంటాయి. వాటిని ప్రజెంట్ చేసి - తమ తమ పనుల్ని సానుకూల పరుచుకునే ప్రబుద్ధులు ఈ సీజన్‌లో చాలామంది తారసపడతారు. ఎదుటివాడి దగ్గర కప్పు కాఫీ తాగినా అది 'లంచం' అయిపోతుందని భావించే గొప్ప స్ట్రిక్టు ఆఫీసరు కూడా 'డైరీ' అనేసరికి పడిపోతాడు. ఎదుటివాడిచ్చిన డైరీని చిరునవ్వుతో తీసుకుని 'థాంక్స్' చెప్తాడు. ఆనక ఆ డైరీ ఇచ్చిన పెద్దమనిషి - "అయ్యా! మా కాంట్రాక్టు సంగతి తమరు చూడలేదు" అనగానే "అలాగా! అయామ్ వెరీ వెరీ సారీ!" అంటూ నొచ్చుకుని, సదరు ఫైలు అర్జెంటుగా తెప్పించి, అతని ముందే సంతకం చేసి, ఆర్డరు చేతికిస్తాడు.. సాక్షాత్తూ నిలువెత్తు వెంకటేశ్వర స్వామి అభయహస్తంతో చూస్తున్న రంగుల కాలెండరుకు లేని పవరు - చిన్న 'డైరీ'కుంటుంది.

'డైరీ రాయటం ఒక ఆర్టు' అన్నారు వెనకటికెవరో. ఆ మాట చెప్పిన అనుభవజ్ఞుడికి చెయ్యెత్తి దణ్ణం పెట్టాలి. ఎందుకని అడగండి - మనవి చేస్తాను.

డైరీల్లో చాలా సందర్భాల్లో ఉన్నదున్నట్టు రాసుకుంటే కొంపకొల్లేరైపోతుంది. శ్రీవారికెప్పుడైనా మూడ్ వచ్చి - ఆఫీసు పనిమీద టూర్ వెడుతూ - వెంట ఆడ సెక్రెటీ అంబుజాక్షిని - 'కంపెనీ కోసం' తీసుకెళ్ళాడనుకోండి. ఆ విషయాన్ని విపులంగా డైరీలో రాసుకుంటే ఏదో ఒకనాడు వారి కాపురం కూలిపోవటం ఖాయం. కనక సదరు విషయాన్ని వేరే పద్ధతిలో కేవలం తమకు మాత్రమే అర్ధమయ్యే 'కోడ్'లో రాసుకోవాలి. ఎప్పుడైనా పాత డైరీలు తిరగేసినపుడు - ఆ 'కోడ్' భాషని - 'డీకోడ్' చేసుకుని - పాత జ్ఞాపకాల్ని నెమరు వేసుకోవచ్చు.

డైరీకి - కొత్త సంవత్సరానికీ ఎలాంటి దగ్గర సంబంధం ఉందో, సినిమా తారకీ డైరీలకీ అంతటి అవినాభావ సంబంధం ఉంది.

బిజీ ఆర్టిస్టులు - తమ డైరీలు చూసే 'డేట్స్' ఇస్తూంటారు నిర్మాతలకి. అందులో కూడా కొన్ని గమ్మత్తులు చేస్తూంటారు. ముందుగా పేజీలన్నీ - సరదాగా నింపేసుకుంటారు. ఆ పిమ్మట ఎవరైనా ప్రొడ్యూసర్ సదరు ఆర్టిస్టు దగ్గరకొచ్చి 'డేట్స్' కావాలంటే - "అయ్యో! వేరే ప్రొడ్యూసర్‌కి ఇచ్చేశానే?" అంటూ ఓ 'పోజ్' వేస్తారు. పాపం ఆ ప్రొడ్యూసర్ అలవాటు కొద్దీ బిక్కమొహం పెడతాడు. "ఎలాగైనా ఎడ్జెస్ట్ చెయ్యాలి. ఆ వేషం మీరు వేస్తేనే బావుంటుంది" అంటూ బ్రతిమాలుకుంటాడు. "ఆల్‌రైట్! మీరు మరీ బలవంతం

చేస్తున్నారు కనుక ఎలాగో అలా ఎడ్జెస్ట్ చేస్తాన్లెండి'' అంటూ ఫోజు పెడతారు. తద్వారా రెమ్యునరేషన్ పెంచుకుంటారు. ఇవన్నీ నిర్మాతలకు అనుభవైకవేద్యాలే.

ఎగురగలిగే సామర్థ్యాన్ని కలుగచేసే రెక్కలు జ్ఞాపకాలైతే ఆ జ్ఞాపకాల్ని ఆ జ్ఞాపకాల్ని మనసు తెరపై ప్రతిబింబించేవి డైరీలు. కొన్ని జ్ఞాపకాలు గులాబీ పువ్వులై గుండెల్ని తాకితే మరికొన్ని జ్ఞాపకాలు ముళ్ళల్లా కళ్ళల్లో గుచ్చుకుంటాయి. కన్నీళ్ళు పెల్లుబికి వస్తాయి.

మూత ఊడిపోయిన ట్రంకు పెట్టెల్లో భద్రంగా ఉన్న డైరీని అప్పుడప్పుడు తెరిచి చూసుకుని - అలాగే కన్నీళ్ళు పెట్టుకుంటూంటుంది మంజులత.

ఆ డైరీ కొత్తదికాదు. మహాపాతది. సుమారు ఇరవై సంవత్సరాల క్రితం నాటిది.

మదరాసు మీనంబాకం దగ్గర్లో ఉన్న ఓ మురికివాడలో మంజులత నివాసం. ఆమె తండ్రి ముత్తుస్వామి అప్పట్లో - అంటే ఇరవై ఏళ్ళ క్రితం ఓ ప్రముఖ నటి దగ్గర కారు డ్రైవరుగా పనిచేసేవాడు. ఓసారి ఆ ప్రముఖనటి నటిస్తున్న చిత్రం తాలుకు షూటింగ్ జరుగుతోంది.

''నేనూ షూటింగ్ చూస్తాను. తీసుకెళ్ళవా?'' అని అడిగింది మంజులత తన తండ్రిని.

ఆమె ముచ్చట తీర్చాలనుకున్నాడు ముత్తుస్వామి. కూతుర్ని షూటింగ్‌కి తీసుకెళ్ళాడు. ఆ చిత్రంలో హీరోయిన్ వేషం వేస్తున్న ప్రముఖ నటికి తన కూతుర్ని పరిచయం చేశాడు.

''ఏం చదువుతున్నావ్?'' అడిగింది హీరోయిన్.

చెప్పింది మంజులత. ఆ తర్వాత మంజులత కూడా హీరోయిన్‌ని ఎన్నో ప్రశ్నలడిగింది. ఆవిడగారు విసుక్కోకుండా అన్నింటికీ సమాధానాలు చెప్పింది.. ఆ ఒక్కరోజులోనే వాళ్ళిద్దరి మధ్యా అభిమానం పెరిగింది.

''అప్పుడప్పుడు వస్తూండు'' అని చెప్పింది హీరోయిన్. మంజులతకు అపరిమిత ఆనందాన్ని కలిగించింది.

స్కూలుకి శలవులున్నప్పుడల్లా ఆ హీరోయిన్ ఇంటికి వెళుతూండేది మంజులత. కొన్ని నెలల వ్యవధిలోనే ఆ ఇంట్లో ఒక మనిషిగా మారిపోయింది. పుట్టింది పేదకుటుంబంలో అయినా, పెరిగింది అర్ధాకలితోనైనా హీరోయిన్‌తో పరిచయం పెరిగాక నెమ్మది నెమ్మదిగా విలాసవంతమైన జీవితానికి అలవాటు పడసాగింది. దాంతో చదువు వెనకపడింది. స్కూలు ఫైనలు పరీక్ష ఫెయిలయింది.

పరీక్ష తప్పినందుకు మంజులత కంటే, ఆమె తండ్రి ఎక్కువ బాధపడ్డాడు. ఓరోజు హీరోయిన్ షూటింగ్ పూర్తిచేసుకుని కార్లో ఇంటికి తిరిగివస్తున్నప్పుడు యధాలాపంగా ముత్తుస్వామి తన కూతురి ప్రస్తావన తెచ్చాడు.

''పరీక్ష పోయింది. ఇక ఎలాగూ కాలేజీలో చదివే అవకాశం లేదు. ఏదైనా మంచి సంబంధం చూసి పెళ్ళిచేయాలనుకుంటున్నానమ్మా!'' అన్నాడు. అతని ఆలోచన హీరోయిన్‌కి అంతగా నచ్చలేదు.

''ఈ రోజుల్లో ఆడపిల్లలు కూడా బాగా చదువుకోవాలయ్యా! ఒక్కసారి పరీక్ష పోయిందని నిరుత్సాహ పడితే ఎలా? ప్రయివేట్‌గా చదివించు. ఇంట్లో ఖాళీగా కూర్చోపెట్టక నా దగ్గరకు పంపించు. నేనెలాగూ ఓ అసిస్టెంట్‌ని పెట్టుకోవాలనుకుంటున్నాను. నాతో ఉంటుందిలే. నెలకో రెండువందలిస్తాను'' చెప్పిందామె.

ఆమె సలహా ముత్తుస్వామికి నచ్చింది. ఆ మర్నాటి నుంచీ మంజులత ఆ హీరోయిన్‌కి అసిస్టెంట్‌గా మారిపోయింది. ఆవిడగారు షూటింగ్‌కి వెళ్ళేటప్పుడు భుజాన వాటర్ బాటిల్, చేతిలో మేకప్ బాక్స్ పట్టుకుని మంజులత కూడా వెడుతూండేది. రోజులు సాగిపోతున్నాయి.

అది డిసెంబర్ నెల ఇరవైనాలుగో తేదీ. షూటింగ్ జరుగుతున్న సమయంలో ఓ అభిమాని వచ్చి ఆ హీరోయిన్‌కి కొత్త డైరీ ప్రజెంట్ చేశాడు. పక్కనున్న మంజులతకు ఆ డైరీ ఇచ్చేసింది హీరోయిన్. "ఇందులో నువ్వు రాసుకో. నాకు ఇంకా వేరే డైరీలు వస్తాయిలే" అంది.

ఆ మర్నాటినుంచీ మంజులత డైరీ రాయటం ప్రారంభించింది.

ఆ డైరీయే ఇప్పటికీ ఇరవైఏళ్ళు దాటిపోయినా - ఆ పాత ట్రంకుపెట్టెలో భద్రంగా ఉంది.

అప్పుడప్పుడు ఆ పెట్టెలోంచి డైరీ తీసి అందులో తను రాసుకున్న విషయాలు మనసులోనే చదువుకుంటుంది. క్షణంసేపు ఆమె కళ్ళల్లో కాంతి కనిపించినా వెంటనే ఏవో జ్ఞాపకాలు ఆమెను వెంటాడి కన్నీళ్ళు కురిపిస్తాయి.

"మీ కథ తెలుసుకోవచ్చునా?" అని నేను అడిగినప్పుడు ఆమె క్షణంసేపు నా వైపు పరిశీలనగా చూసింది.

"మీకు ఇబ్బందైతే చెప్పద్దు" అన్నాను.

వెంటనే ఆమె జవాబివ్వలేదు. కాసేపు శూన్యంలోకి చూసింది. పెట్టెలోంచి డైరీ తీసింది.

"నా కథ ఇప్పుడు ఎవరికి చెప్పినా తప్పులేదు. అసలు నమ్ముతారన్న నమ్మకం కూడా నాకు లేదు" అంటూ తన పాత డైరీని నా చేతిలో పెట్టింది.

"అందులో నేను రాసుకున్న విషయాలు చదివితే నీకే తెలుస్తుంది" అంది తలవంచుకుని.

పదిహేను నిమిషాలపాటు ఆ డైరీ చదివాను. కొన్ని విషయాలు ఆశ్చర్యాలు కలిగించాయి. మరికొన్ని బాధ కలిగించాయి.

"మీకు అభ్యంతరం లేకపోతే - వీటిని పదిమందికీ తెలియజేయవచ్చునా?" అడిగాను.

ఆమె అంగీకరించింది.

"డైరీ చూస్తూండండి. కాఫీ చేసి తెస్తాను" అంటూ మంజులత పక్కగదిలోకి వెళ్ళింది.

డైరీలోని ఒక్కొక్క పేజీ తీసి చదవటం ప్రారంభించాను. మంజులత హ్యాండ్‌రైటింగ్ బాగుంది. కొన్ని తేదీల్లో చాలా విషయాలు రాసుకుంది. మరికొన్ని పేజీలను ఖాళీగా వదిలేసింది. అక్కడ తన ఇంటి ఖర్చులకోసం ఎంత డబ్బు వినియోగించింది వివరాలు కూడా ఉన్నాయి.

***జనవరి...13...రాత్రి 8...***

"సంక్రాంతి పండగ. ఇవాళ మేడంకి షూటింగ్ లేదు. నన్ను పెందరాళే వెళ్ళిపొమ్మన్నారు. ఇంటికొచ్చి భోంచేసి మేట్నీకి వెళ్ళాను. వచ్చేటప్పటికి 'అప్పా' తాగుతూ కనిపించాడు. తాగుడు మానెయ్యమని చెప్పాను. అప్పా పట్టించుకోలేదు."

***జనవరి...19... రాత్రి 2..***

"పదింటికి ఊటీ చేరుకున్నాం. మేడం పదకొండు గంటల్నించీ షూటింగ్‌లోనే ఉన్నారు. పాట ఒక్క చరణం షూటింగ్ అయ్యేసరికి బాగా పొద్దువాలిపోయింది. మళ్ళీ లొకేషన్ మారింది. హీరో మేడంని లెంపకాయ కొట్టేసీను పెద్ద బంగళాలో తీశారు. షూటింగ్ పూర్తయ్యేసరికి పన్నెండైంది. మధ్యలో క్యారియర్ భోజనం వచ్చింది. అమ్మగారు, డైరెక్టరు, కెమేరామెన్ కలిసి ఎక్కడికో కార్లో వెళ్ళి భోంచేసి వచ్చారు. నేను ప్రొడక్షన్ వాళ్ళతో భోజనం చేశాను."

***జనవరి 20.... రాత్రి 12...***

"పొద్దున్నుంచీ వర్షం కురుస్తోంది. డైరెక్టర్‌గారు మేం ఉంటున్న కాటేజ్‌కి ఫోన్ చేసి షూటింగ్‌లేదని చెప్పారు. కాటేజీలోనే ఉండిపోయాం. మధ్యాహ్నం రావుగారొచ్చారు. మేడం డ్రైవర్ని పంపించి కాఫీ తెప్పించారు. నేను వీక్లీ చదువుకుంటూ వేరే గదిలో ఉండిపోయాను. ఒంటిగంటైనా కారియర్ రాలేదు. ఆకలి బాగా వేసింది. రావుగారు త్వరగా వెళ్ళిపోతే మేడం చేత ప్రొడక్షన్ మేనేజర్‌కి

ఫోన్ చేయించాలని అనుకున్నాను. రావుగారు వెళ్ళలేదు. ఇద్దరూ ఒకటే కబుర్లు. రెండింటికి మేడం పిల్చారు. బయటకు వెళ్ళి ఏదైనా హోటల్లో భోంచేసి రమ్మన్నారు. రావుగారు నా చేతికి వందరూపాయల నోటు ఇచ్చారు. డ్రైవర్ని పిలిచి అతని చేతిలో కూడా వందనోటు పెట్టారు. కార్లో హోటల్‌కి వెళ్ళి భోంచేశాం. నాకు, డ్రైవర్‌కి కలిపి పన్నెండు రూపాయల బిల్లయింది. బిల్లు నేనే ఇచ్చాను. డ్రైవరు మాటవరసకైనా బిల్లు ఇస్తాననలేదు. వట్టి కక్కుర్తి మనిషిలా కనిపించాడు. కాటేజికి వెళ్ళిపోదాం అన్నాను.

"అప్పుడే వెడితే ఎలా? అయ్యగారూ, అమ్మగారూ భోంచేయాలిగా" అన్నాడు.

ఆ వర్షంలోనే రెండుగంటలపాటు కార్లో ఊటీ అంతా తిప్పాడు. కాటేజికి వచ్చేసరికి చీకటి పడిపోయింది. రావుగారు సోఫాలో నిద్రపోతున్నారు. బల్లమీద డ్రింకు బాటిలు, గ్లాసులూ ఉన్నాయి. లోపల గదిలోకి వచ్చాను. మేడం మంచం మీద నిద్రపోతూ కనిపించారు.

ఏడింటికి రావుగారు లేచారు. ఓసారి మేడంని చూసి "మంచి నిద్రలో ఉన్నారు లేపకు" అని నాతో చెప్పి వెళ్ళిపోయారు. మేడం తొమ్మిదింటికి నిద్రలేచారు. "రావుగారు వెళ్ళిపోయారా?" అని అడిగారు. మేడం దగ్గరకూడా డ్రింక్ వాసన వచ్చింది. అప్పా దగ్గర కూడా అపుడప్పుడు సరిగ్గా ఇలాంటి వాసనే వస్తుంది. వెళ్ళిపోయి చాలాసేపైందని చెప్పాను. అప్పా అయితే అమ్మ చచ్చిపోయిందన్న దిగుల్తో తాగుతున్నానని చెప్పేవాడు. మేడం ఎందుకు తాగాలి? మేడంకి కూడా దిగులుందా?"

***జనవరి ...24.రాత్రి 9...***

"ఇవాళ్టితో షూటింగ్ పూర్తయిపోయింది. మూడుగంటలకే డైరెక్టరుగారు 'పేకప్' చెప్పారు. అందరూ షూటింగ్ తొందరగా పూర్తయినందుకు హుషారుగా ఉన్నారు. నన్ను కాటేజికి వెళ్ళిపొమ్మన్నారు మేడం. మేడం షాపింగ్‌కి వెళ్ళి వస్తానన్నారు. నేను కాటేజికి వచ్చేశాను. సోఫాలో నడుం వాల్చగానే నిద్రపట్టేసింది. మళ్ళీ తలుపు చప్పుడైతే హఠాత్తుగా మెలుకువ వచ్చేసింది. 'అమ్మగారు వచ్చేశారు' అనుకుంటూ తలుపు తీశాను. గుమ్మంలో రావుగారి డ్రైవరున్నాడు.

"ఒక్కత్తివే ఉన్నావా?" అడిగాడు. నాకు భయం వేసింది.

"మేడం వచ్చేస్తారు" అని చెప్పాను. అతను నవ్వేశాడు.

"నువ్వు పిచ్చిదానివి. అమ్మగారు ఇపుడపుడే రారు. రావుగారి కాటేజీలో ఉన్నారు. ఇపుడేగా మందు మొదలెట్టారు. నేనే అన్నీ సప్లయ్ చేసొచ్చాను. నన్ను రెండు గంటలదాకా రావద్దన్నార్లే. పాపం.... నువ్వొక్కత్తివే ఉన్నావ్ కదా.. సాయంగా ఉందామని వచ్చాను" అన్నాడు.

అతని చూపులు చాలా అసహ్యమనిపించాయి. కక్కుర్తి మనిషే అనుకున్నాను. ఇలాంటి వెధవ లక్షణాలు కూడా ఉన్నాయన్నమాట.

"నాకేం సాయం అక్కర్లేదు. నేను ఒక్కత్తినీ ఉండగలను" అని గట్టిగా చెప్పాను. నేనంటే చాలా ఇష్టమని చెప్పాడు.

"అయ్యగారికి చెప్పి నీకు సినిమాల్లో వేషం ఇప్పిస్తాను వేస్తావా?" అడిగాడు.

"నాకు వేషం వెయ్యాలని ఉంటే మేడంని అడిగినా ఇప్పిస్తారు" అని చెప్పాను. అతను వినలేదు. పిచ్చివాగుడూ మొదలెట్టాడు.

"మర్యాదగా వెడతావా? ఫోన్ చేసి రావుగారికి చెప్పమంటావా?" అని బెదిరించాను. వెళ్ళిపోయాడు.

మేడం ఎనిమిదింటికి వచ్చారు. నాతో ఏమీ మాట్లాడకుండా గదిలోకి వెళ్ళి పడుకున్నారు. నేను ఫ్లాస్కులో కాఫీ తీసుకెళ్ళాను.

"ఇప్పుడేం వద్దు. నన్ను లేపకు. పొద్దున్నే మన ప్రయాణం" అని నాతో చెప్పి నిద్రపోయారు. ఆ తర్వాత డైరీలోని చాలా పేజీల్లో హీరోయిన్‌తో పాటు తను ఏయే లొకేషన్లకి, షూటింగ్‌కి వెళ్ళిందీ, అక్కడ షూటింగ్ ఎలా జరిగిందీ మొదలైన విషయాలే చోటు చేసుకున్నాయి.

ఇంకో పేజీలో తన తండ్రి తాగి డ్రైవ్ చేస్తూ యాక్సిడెంట్ చేసిన వైనం రాసుంది.

***జూన్...9...11***

ఇవ్వాళ పొద్దున్న మేడం చాలా కోప్పడ్డారు. "నీ బాబు చేసిన వెధవ పనికి నేను పేపర్లకి ఎక్కాల్సి వచ్చింది" అంటూ పేపరు నా మొహం మీద గిరాటు వేసారు.

అప్పా చేసింది తప్పే. తాగి ఎందుకు డ్రైవింగ్ చెయ్యాలి? కింద పడినవాడికి తలమీద పెద్ద దెబ్బ తగిలిందట. మాంబళం నర్సింగ్ హోంలో చేర్చారంట. మేడం చెప్పారు.

"వాడు చచ్చిపోతే పెద్ద గొడవవుతుంది. నీ బాబుకి జైలుశిక్ష పడుతుంది. అసలు తాగటమే తప్పు. కేసు పెడతారు" అంటూ మేడం విసుక్కున్నారు.

"అప్పా ఎక్కడున్నాడు?" అని అడిగాను.

"ఎక్కడుంటాడు? పోలీస్ లాకప్‌లో ఉన్నాడు. వాడు చేసిన పాడుపనికి ఇవాళ నేను అడ్డమైన వాళ్ళ కాళ్ళూ పట్టుకోవాల్సి వచ్చింది. అప్పుడే పదివేలు ఖర్చయ్యాయి. ఛీ....ఛీ" అనుకుంటూ మేడం షూటింగ్‌కు వెళ్ళిపోయారు.

నన్ను రమ్మనలేదు.

'భగవాన్! నర్సింగ్ హోమ్‌లో ఉన్నవాడికి ఏమీ జరక్కుండా కాపాడు..'

***జూన్..16.. రాత్రి 9...***

అప్పాని ఉద్యోగంలోంచి తీసేసారు మేడం. అప్పామీద కేసు ఇంకా నడుస్తోంది. అదృష్టం బాగుండి నర్సింగ్ హోమ్‌లో మనిషి బతికాడు. మూడువేలిస్తే పోలీస్ స్టేషన్ నుంచి కేసు వెనక్కి తీసుకుంటామని నర్సింగ్ హోమ్‌లో ఉన్న అతని తండ్రి చెప్పాడు. మేడంని అడిగితే ఇంకొక్క రాగి దమ్మిడీ కూడా ఇచ్చేది లేదన్నారు. ఇప్పటికే పోలీసులకీ, పేపరువాళ్ళకీ బోలెడంత డబ్బు ఖర్చుచేసినట్టు చెప్పారు. ఈ వారం రోజుల్నుంచీ మేడం నన్నసలు షూటింగ్‌కి రమ్మనటంలేదు.

అప్పాతో చెప్పాను. మేడం దగ్గర పని మానెయ్యమన్నాడు. "నీకు రావాల్సిన డబ్బు తీసుకో" అన్నాడు.

***జూన్.. 17.... రాత్రి 11...***

పొద్దున్నే మేడం దగ్గరకు వెళ్ళాను. అప్పటికే మేడం మేకప్‌తో రెడీగా ఉన్నారు. కారుకోసం చూస్తున్నారు. "నేను కూడా రానా మేడం?" అడిగాను.

"అవసరం లేదు" అన్నారు.

ఇంకా కోపం పోలేదు మేడంకి. నేను ఏ తప్పూ చేయలేదు. నామీద మేడంకి ఎందుకుండాలి కోపం? రావుగారికీ, మేడంకీ సంబంధం ఉంది. ఎన్నోసార్లు రావుగారితో కలసి మేడం డ్రింక్ చేశారు. అయినా నేను ఆ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. మేడంకి తలనొప్పిగా ఉన్నప్పుడు ఎన్నోసార్లు నాచేత అమృతాంజనం రాయించుకున్నారు. కాళ్ళు తొక్కించుకున్నారు. ఇంత చేసినా నా మీద ఆవిడగారికి కోపం ఎందుకుండాలి?

"వారం రోజుల్నించీ నన్ను మీరు పిలవటంలేదు. అక్కర్లేకపోతే చెప్పండి. ఇంక మీ ఇంటికి రాను" అని చెప్పాను.

"నేనే వద్దని చెప్పాలనుకుంటున్నాను. ఇకనుంచి నువ్వు రానక్కర్లేదు" అంటూ హేండ్ బ్యాగ్ లోంచి డబ్బు తీసి విసురుగా నా చేతిలో పెట్టారు.

మేడం వెళ్ళిపోయేదాకా అక్కడే నిలబడ్డాను. మనసు మార్చుకుంటారేమోనని ఎదురుచూశాను. అసలు నావైపు ఆవిడ చూడనే చూడలేదు. కారు వచ్చింది మేడం వెళ్ళిపోయారు. వెళ్ళేముందు వంటమనిషిని పిలిచి 'తలుపు జాగ్రత్తగా వేసుకో - రోజులు బాగోలేవు' అన్నారు. నాకు ఏడుపొచ్చింది. అప్పా మీద కోపం కూడా వచ్చింది. ఇదంతా అప్పా వల్లనే జరిగింది. మూడువేలుంటేనే కానీ అప్పామీద

కేసు పోదు. మేడం ఇచ్చిన డబ్బు లెక్కపెట్టాను. తొంభై రూపాయలున్నాయి. ఈ అయిదు నెలలనుంచీ నేను దాచుకున్న డబ్బు మొత్తం మరో ఏడెనిమిది వందలుంటుంది.

ఈ మాటే అప్పాకి చెప్పాను.

అప్పా తన జేబులో ఉన్న చిన్న పుస్తకం తిరగేసి అందులో ఉన్న ఓ కాగితం చింపి ఇచ్చాడు.

"వెంటనే వెళ్ళి ఈయన్ని కలుసుకో. రెండువేలు అప్పుగా నేను ఇమ్మన్నానని చెప్పు" అన్నాడు. భోజనం చెయ్యకుండానే తిన్నగా ఆయన దగ్గరకి వెళ్ళాను.

"కవిగారితో మాట్లాడుతున్నారు. కాసేపు కూర్చో" అన్నాడు బయట ఉన్న నౌకరు. అలా రెండు గంటలు కూర్చున్నాను. తర్వాత నన్ను రమ్మన్నారు.

నేను చెప్పిన విషయాలన్నీ ఆయన శ్రద్ధగా విన్నారు. అంతా విన్న తర్వాత....

"నువ్వు సినిమాల్లో యాక్ట్ చేస్తావా?" అని అడిగారు. ఆశ్చర్యం కలిగింది. కాసేపు ఆయనవైపు అలాగే చూస్తూ ఉండిపోయాను.

"అప్పాని అడిగి చెప్తాను సార్" అన్నాను.

"మీ అప్పాకి నేను చెప్తాన్లే. డబ్బిస్తాను తీసుకెళ్ళు. రేపు మధ్యాహ్నం వస్తే మా డైరెక్టర్ చూస్తాడు" అన్నారాయన. రెండువేలిచ్చాడు.

"అప్పామీద ఇంక కేసుండదు."

డైరీలో మరో పేజీ తిప్పాను. ఇంతలో మంజులత కాఫీ కప్పుతో వచ్చింది. "ముందు కాఫీ తాగండి. తర్వాత చదువుదురుగాని" అంది కప్పు నా చేతికి అందిస్తూ. డైరీ మూసేసి పక్కన పెట్టాను.

"ఊటీలో ఎవరో రావుగారు మీ హీరోయిన్ దగ్గరకు వచ్చినట్టు రాశారు డైరీలో.. ఆయన ప్రొడ్యూసరా?" కాఫీ తాగుతూ అడిగాను.

"ఔను. చాలా పెద్ద ప్రొడ్యూసర్ అప్పట్లో.. ఇప్పుడు లేరు. పోయి పదేళ్ళయింది" చెప్పింది మంజులత.

"అయితే మీకు వేషం ఇస్తానన్న పెద్దమనిషి - అప్పట్లో మంచి వేషం ఇవ్వలేదా?"

"మీరు డైరీ పూర్తిగా చూడలేదన్నమాట!" అంది నవ్వుతూ.

నా ప్రశ్నకు అది సమాధానం కాదని నాకు తెలుసు. "ఇప్పుడు అప్పా లేరు కదూ?" లేడని తెలిసినా అడిగాను.

"లేరు.. నా పెళ్ళి అయిన మూడు నెల్లకే పోయాడు" మంజులత చెప్పింది.

"మీ ఆయన కూడా మీతో ఉండటం లేదుకదూ?"

"లేదు ఎవత్తెనో పెట్టుకున్నాడు.. అప్పుడప్పుడు వస్తూంటాడు. "

"మీకు పిల్లలెంతమంది?" అడిగాను కాఫీ పూర్తయ్యాక.

"ఒక్కడే.. పెట్రోలు బంకులో పనిచేస్తూంటాడు. పెళ్ళి చేయాలి"

"మరి మీ ఆదాయం మీకు బాగా సరిపోతుందా?"

"ప్రస్తుతం ఫరవాలేదు. నెలకు రెండు మూడు సినిమాలు వస్తూంటాయి. ఎక్కువ ఔట్‌డోరే. భోజనం ఖర్చుండదు. పైన రోజుకి వందరూపాయల దాకా వస్తాయి. షూటింగుంటే."

"ఇంతకీ మీకు సినిమాలో వేషం ఇస్తానన్న ఆ ప్రొడ్యూసర్ ఎవరో చెప్పలేదు" మళ్ళీ అడిగాను డైరీ తీసుకుంటూ.

"ఆయన పేరు డైరీలో నేను రాయలేదు. రాయవలసిన అవసరం కూడా కలగలేదు"

"అంటే ఆయన వేషం ఇవ్వలేదా?"

''ఇచ్చాడు. ముందు మంచి వేషం అన్నాడు. దాదాపు హీరోయిన్‌తో సమానంగా ఉండే వేషం అన్నాడు. దానికోసం నన్ను తన చుట్టూ తిప్పుకున్నాడు. నన్ను యూనిట్‌లో వాళ్ళకి పరిచయం చేశాడు. ఆ పిక్చర్ హిట్టవుతే తర్వాత పిక్చర్లో నన్ను హీరోయిన్‌ని చేస్తానని ఆశపెట్టాడు. నేను మనస్ఫూర్తిగా నమ్మేశాను. ఆయనకి పూర్తిగా లొంగిపోయాను.''

ఆమె చెప్పటం ఆపి నావైపు చూసింది. ఆమె కళ్ళల్లో కన్నీరు మెరుస్తూ కనిపించింది. కొన్ని క్షణాల తర్వాత మళ్ళీ చెప్పటం ఆరంభించింది.

''షూటింగ్ ప్రారంభమైంది. ఎన్నిరోజులైనా నా వేషం రాలేదు. నా సీన్స్ ఎప్పుడొస్తాయని అడిగాను. కథ మార్చటం వల్ల నా వేషం బొత్తిగా తగ్గిపోయిందన్నారు. చివర్లో ఏదో రెండు డైలాగ్స్ ఉన్న సీన్లో వేషం ఇచ్చారు. అంతే... అడపాదడపా అలాంటి వేషాలే వెయ్యాల్సి వచ్చింది. ఇప్పుడు 'గుంపులో గోవిందా' అన్నట్టు డ్యాన్స్ గ్రూపుల్లో చేస్తున్నాను. రోజులు వెళ్ళిపోతున్నాయి'' ఆమె గొంతులో నిరాశ ధ్వనించింది.

ఆమె చెప్పినదంతా విన్నాక - ఇక ఆమె పాత డైరీలోని తక్కిన పేజీలు చూడవలసిన అవసరం లేదనిపించింది.

పాపం..

మంజులత దారుణంగా మోసపోయింది. ఇది జరిగింది ఇవాళా నిన్నా కాదు. ఇరవై ఏళ్ళ క్రితం ఏనాడో జరిగింది.

అయితే ఇది పాత కథ కాదు. జరిగిపోయినది మాత్రమే కాదు.

జరుగుతున్న కథ. ఈ కథలో ఒకనాటి పాత్రధారిణి మంజులత. కానీ ఇప్పుడు అలాంటివారు ఇంకా ఎందరో. వెండితెర జిలుగు వెలుగుల్లో ప్రకాశించాలని పడరాని పాట్లు పడ్డ ఎందరో సోదరీమణులు - చీకటి జీవితాలు గడుపుతున్నారు. అంతమాత్రం చేత సినీమా జీవితం అపవిత్రమైనదని అనుకోటానికి వీల్లేదు. అలా అనుకుంటే ప్రతిభ గల ఏ ఆడపిల్లా ఈ ప్రపంచంలో అడుగు పెట్టడానికి సాహసం చేయదు.

కానీ అడుగు పెట్టేముందు ఆలోచించటం - ఆపై ఆచితూచి ముందడుగు వేయడం అవసరం.

## ''సినీమా అవకాశాలు రావాలంటే ఫ్రీగా వుండాలి!''

**ప్రతి మనిషికి కొన్ని ఫ్లాష్‌బాక్‌లుంటాయి.**

ఏదో ఒక సందర్భంలో అవి గుండెలకు తాకి గొప్ప కిక్కిస్తాయి. ఎదురుగా ఎవరైనా ఓ ఫ్రెండుంటే ఆ ఫ్లాష్‌బాక్ తాలూకు కథాకమామీషూ అతగాడికి చెప్పుకోవాలనిపిస్తుంది.

అట్లా అని అన్ని ఫ్లాష్‌బాక్‌లూ ఎదుటివారికి చెప్పుకుంటే చెడ్డగొడవైపోయే ప్రమాదం కూడా ఉంది.

కొన్ని ఫ్లాష్‌బాక్‌లు గుండెల్లో దాచుకోటానికి మాత్రమే పరిమితమై ఉంటాయి.

పెళ్ళికాకముందు అమ్మాయిగారికి ఏ ప్రేమ్‌కుమార్‌తోనో కొంత వ్యవహారం నడిచిందనుకోండి. పాత డైరీలు తిరగేస్తున్నప్పుడో తెలుగు సినీమాల్లో లవ్‌సీన్లు చూస్తున్నప్పుడో ఆ బాపతు ఫ్లాష్‌బాక్ ఒక్కసారిగా అమ్మాయిగారి మనసులో మెదులుతుంది. పరవశం కలుగుతుంది.

అప్పుడు ఆవిడ పక్కనే ఉన్న మొగుడుగారు ''ఏమిటోయ్ అలా పరవశించిపోతున్నావ్?'' అని పొరపాటున అడిగితే ఒళ్ళు మరచిపోయి, ఆ 'గత రొమాన్స్' గురించి గొప్పగా చెప్పుకుంటే ఇక అంతే సంగతులు. అమ్మాయిగారు పుట్టింట్లోనూ మొగుడుగారు బార్‌లోనూ మకాం పెటాల్సి వస్తుంది.

ఈ రూలు ఆడవారికే కాదు. మగవాళ్ళకీ వర్తిస్తుంది. కనుక కొన్ని ఫ్లాష్‌బాక్‌లను మనసు పొరలలోనే భద్రంగా దాచుకోవాలి.

ఏ పుట్టలో ఏ పాముంటుందో ఎవరికీ తెలీదు. అట్లాగే ఏ ఫ్లాష్‌బాక్ ఎవరికి చెబితే కొంపమునుగుతుందో ఊహించటం కష్టం.

కనుకనే తన ఫ్లాష్‌బాక్‌ని తనలోనే దాచుకుంది పద్మిని.

ఆమె అసలు పేరు పద్మిని కాదు. సినీమా ప్రపంచంలోకి అడుగు పెట్టాక ఆమెకు ఆమె తండ్రే ఆ పేరు పెట్టాడు.

ఆమె తండ్రి ఆర్ముగానికి చిత్తూరు దగ్గర ఓ పల్లెటూళ్ళో చిన్న ఫాన్సీషాపు ఉండేది. ఆ షాపులో అతను మాత్రం ఉండేవాడు కాదు. తన దూరపు బంధువుల కుర్రాణ్ణి అందులో జీతానికి పెట్టి అతనెప్పుడూ మదరాసులో మకాం పెట్టేవాడు. ఆ రోజుల్లో ఆర్ముగానికి తెలిసిన ఓ సినిమా ప్రొడ్యూసరు మదరాసులో సినీమాలు తీస్తూండేవాడు. అతని దగ్గర ప్రొడక్షన్ మేనేజరుగా పనిచేసేవాడు ఆర్ముగం.

ముఖ్యంగా హీరోయిన్‌ని ఇంటి దగ్గర్నించి స్టూడియోకి తీసుకురావటం, షూటింగ్ సమయంలో ఆమెకు కావలసినవన్నీ సమకూర్చటం, మళ్ళీ షూటింగ్ పూర్తయ్యాక ఆమెను ఇంటి దగ్గర డ్రాప్ చేయటం మొదలైన వ్యవహారాలన్నీ ఆర్ముగం చూసుకునేవాడు.

హీరోయిన్ల జీవితం ఎంత విలాసవంతంగా ఉంటుందో ఆర్ముగం అప్పుడే గ్రహించాడు.

"తన కూతురు కూడా హీరోయిన్ అయితే?" అనే ఆలోచన కూడా సరిగ్గా ఆ సమయంలోనే వచ్చిందతనికి. పైగా అప్పట్లో హీరోయిన్లకు పరిశ్రమలో కొరత ఏర్పడింది. సినీమా హీరోయిన్ కావాలంటే అందచందాలు మాత్రం ఉంటే సరిపోదన్న విషయం చాలాకాలంగా ప్రొడక్షన్ మేనేజరుగిరీ వెలగబెడుతున్న ఆర్ముగానికి తెలుసు. ప్రొడక్షన్ ఆఫీసుల చుట్టూ తిరగాలి. నిర్మాతల్నీ దర్శకుల్నీ కూడా కలవాలి. అమ్మాయి వివిధ భంగిమల్లో దిగిన ఫోటోలు - ముఖ్యంగా అర్ధనగ్నంగా కనిపించే ఫోటోలు వారికి చూపించాలి.

ఆ ప్రయత్నంలో భాగంగా ముందు ఓ స్టిల్ ఫోటోగ్రాఫర్ని ఆశ్రయించాడు ఆర్ముగం. తన మనసులోని కోరిక చెప్పాడు. ఆర్ముగం ప్రొడక్షన్ మేనేజరుగా పనిచేసిన చాలా చిత్రాలకు అతనే స్టిల్ ఫోటోగ్రాఫర్‌గా ఉండేవాడు. ఆ చనువుతోనే ఆర్ముగం అతన్ని ఆశ్రయించటం, ప్రతి సినీమాకూ తననే పిలుస్తున్నాడన్న అభిమానంతో అతను ఓకే అనటం జరిగాయి. ఓ మంచిరోజు చూసి ఆర్ముగం తన కూతుర్ని మదరాసు తీసుకొచ్చాడు. పాండీబజార్ సెంటర్లో ఉన్న ఓ ఇంటర్నేషనల్ హోటల్లో మకాం పెట్టాడు.

సాయంత్రం ఆరుగంటల వేళ స్టిల్ ఫోటోగ్రాఫర్ వచ్చాడు. తన కూతుర్ని పరిచయం చేశాడు ఆర్ముగం.

"అమ్మాయి ఫీచర్స్ బాగున్నాయి. తప్పకుండా షైనవుతుంది" అని చిరునవ్వుతో ఆశీర్వదించాడు ఫోటోగ్రాఫరు.

"అదంతా నీ చేతిలో ఉన్న కెమేరాలో ఉంది బ్రదర్. ఫోటోలు అద్భుతంగా రావాలి. నాకు తెలిసిన డైరెక్టరొకాయన ఈ నెలలో రెండు పిక్చర్స్ స్టార్ట్ చేస్తున్నాడు. ఈ ఫోటోలు పట్టుకెళ్ళి ఆయనకు చూపిస్తాను. వాటిని చూసి ఆయన అదిరిపోవాలి. నీ పనితనం ఎలా చూపిస్తావో మరి" ఆశగా చూశాడు ఆర్ముగం.

"ఇక ఆ సంగతి నువ్ నాకొదిలేయ్ గురూ!" అన్నాడు ఉత్సాహంగా ఫోటోగ్రాఫర్.

"చూడమ్మా! నీ పేరేమిటి?" అడిగాడు అమ్మాయిని.

"మంగతాయారు" ఆ పిల్ల ఉత్సాహంగా చెప్పింది. "పేరు బాగా లేదయ్యా ఆర్ముగం" అన్నాడు వెంటనే.

"దాందేముంది? మార్చేద్దాం"

"అమ్మాయి ఎంత అందంగా ఉందో పేరు కూడా అంత అందంగా ఉండాలి"

"కరెక్టే! చెప్పు. ఏం పేరు పెడితే బాగుంటుందో నువ్వే చెప్పు" అడిగాడు ఆర్ముగం.

"ఆలోచిద్దాం" అంటూనే ఆలోచనలో పడ్డాడు ఫోటోగ్రాఫరు. అంతలో హోటల్ బోయ్ అక్కడకు వచ్చాడు.

"కాఫీ తాగుదామా?" అడిగాడు ఆర్ముగం.

ఓ సారి రిస్ట్‌వాచ్‌లో టైం కేసి చూశాడు ఫోటోగ్రాఫరు.

"అబ్బే.. ఈ టైంలో మనం ఇంక కాఫీ టీలు ముట్టుకోం. నీ కభ్యంతరం లేకపోతే మందు తెప్పిస్తాను" చొరవగా అన్నాడతను.

మందు మాటెత్తగానే ఆర్ముగం నరాలు జివ్వుమన్నాయి.

దొంగతనంగా దొరికే ముద్దూ, తేరగా వచ్చేమందూ మంచి రుచిగా ఉంటాయని శాస్త్రకారులు చెప్పారు. అందుకే ఆర్ముగం పడిపోయాడు.

"నువ్వెందుకు? నేనే తెప్పిస్తాను" అన్నాడు మొహమాటానికి. కానీ అతనికి ఫోటోగ్రాఫరు ఆ ఛాన్సివ్వలేదు.

"భలేవాడివి గురూ! నువ్వు ఎన్నో పిక్చర్స్‌కి ఫోటోగ్రాఫర్‌గా నన్ను పెట్టుకున్నావ్. ఇవాల్టికి నాకు ఛాన్స్ వచ్చింది నీ రుణం తీర్చుకోవటానికి" సినీమా డైలాగ్ లెవెల్లో చెప్పాడతను. ఆర్ముగం మరేం మాట్లాడలేకపోయాడు.

"మంగా! నేనూ మీ డాడీ కాసేపు కబుర్లలో పడతాం. నీకేం ఇబ్బందుండదుగా?" అడిగాడు ఫొటోగ్రాఫర్. ఆ పిల్లకి ఏం జవాబు చెప్పాలో తెలియలేదు.

"చిన్నపిల్ల. అదేం చెబుతుంది బ్రదర్?" అన్నాడు ఆర్ముగం. ఒకవేళ మంగ ఏదైనా ఇబ్బందిగా మాట్లాడితే తేరగా దొరికే మందు ఛాన్స్ పోతుందేమోనన్న భయంతో.

అక్కడే నిలబడి ఉన్న బోయ్‌ని పిలిచి వందనోటు అతని చేతిలో పెట్టి "బీర్‌బాటిల్స్ ఎన్ని వస్తే అన్ని పట్టుకురా. పాపకి ఓ గోల్డ్‌స్పాట్" ఆర్డరిచ్చాడు ఫోటోగ్రాఫరు.

ఆ తర్వాత అరగంటకే పార్టీ ప్రారంభమైంది. ఇద్దరూ చెరో బాటిలూ పూర్తిచేశారు. అప్పటికి మంగ గోల్డ్‌స్పాట్ తాగటం కూడా పూర్తయింది.

"పాపా! మేం ఇలా మందుకొట్టడం నీకేమైనా ఇబ్బందిగా ఉందా?" ఆమె వైపు చూస్తూ అడిగాడు ఫోటోగ్రాఫరు. లేదన్నట్టు తల అడ్డంగా తిప్పింది.

"నీకు తెలియదులే. మందుకొడితే మంచి మంచి ఆలోచనలు వస్తాయి. నేను ఇందాకట్నించీ మీ నాన్నతో మాట్లాడుతున్నానన్న మాటేగానీ నీ గురించి ఆలోచిస్తున్నాను. నిన్ను ఎలా బంధించాలో నా కెమేరాలో, ఏ యాంగిల్‌లో నువ్వు అప్సరసలా ఉంటావో అని పరిశీలిస్తున్నాను." అతని మాటలు బ్యాలెన్స్ తప్పుతున్నాయి.

"నీ ఇష్టం గురూ! నీకు ఎలాంటి యాంగిల్ కావాలన్నా తీసుకో అది రెడీ. ఫోటోలు చూసి ప్రొడ్యూసర్లు మాత్రం అదిరిపోవాలి. హీరోయిన్ కాకపోతే సెకండ్ హీరోయిన్ ఛాన్స్ అయినా ఇచ్చెయ్యాలి?" ఆర్ముగానికి కూడా మందు తలకెక్కింది.

"ఛ...ఛ! అదేం మాట గురూ! మనం ఫోటోలు తీస్తే హీరోయిన్ కావాల్సిందే హిందీస్టార్ రేఖకి ముందు నేనే ఫోటోలు తీశాను. గుర్తుపెట్టుకో" ఫోటోగ్రాఫరు అలా అంటూంటే మంగ అతనివైపు ఆశగా చూసింది. తాను కూడా అంతటి తార అయిపోయినట్టు ఊహించుకుందేమో - క్షణంసేపు ఆమె కళ్ళల్లో మెరుపు కనిపించింది.

రెండో బీరుబాటిల్ తాగటం కూడా పూర్తయింది. ఇంక ఒక్కటే మిగిలింది.

"అది నువ్ లాగించెయ్" అన్నాడు ఆర్ముగం.

"భోజనంతో అయితే బాగుంటుంది"

"బిరియానీ తెప్పించనా?" అడిగాడు.

"చికెన్ బిరియానీ నవయుగలో బావుంటుంది. కానీ బోయ్‌ని వెళ్ళమంటే అంత దూరం వెళ్ళడు. ఎలా?"

"పోనీ మనం పోయివద్దామా?" అడిగాడు ఆర్ముగం. రెండు క్షణాలు ఆలోచించాడు ఫోటోగ్రాఫరు.

"ఇక అంతదూరం పోతే మళ్ళీ ఇక్కడకు రాలేను గురూ! అట్నించి అటు మా ఇంటికి దగ్గర. ఓ పనిచేద్దాం?"

"ఏమిటి?" అడిగాడు.

"నువ్వెళ్ళి బిరియానీ తీసుకురా! నేనీలోగా మంగకి ఫోటోలు తీస్తాను"

ఆర్ముగం ఆలోచనలో పడ్డాడు.

"నువ్వేం డౌటు పడకు గురూ. నువ్వుంటే నాకూ మంగకీ కూడా ఇబ్బందే మంచి మంచి యాంగిల్స్ తియ్యాలంటే కష్టం. నేను అడగలేను. తను ఇవ్వలేదు" చెప్పాడు ఫోటోగ్రాఫరు.

"సరే.. కానియ్.. నేవెళ్ళొస్తా" గ్లాసులో మిగిలివున్న కాస్త బీరూ పూర్తిచేసి బయటకు వెళ్ళిపోయాడు ఆర్ముగం.

వెంటనే ఆఖరి బీరు బాటిల్ ఓపెన్ చేశాడు ఫోటోగ్రాఫరు. గ్లాసు నిండా పోశాడు.

మంచం మీదినుంచి లేచి తన కెమేరాను సరిచేసుకున్నాడు.

"ఏది ఇలా నిలబడు" మంగను తన దగ్గరకు పిలిచాడు. మంగ వచ్చి నిలబడింది. కెమేరాలోంచి ఆమెను చూశాడు.

అప్పుడప్పుడే వంటిమీదకు వస్తున్న వయసు. సోగకళ్ళు. లేలేత నడుం. అన్నీ అతనికి కనిపించి వివశుణ్ణి చేశాయి.

కెమేరా క్లిక్ మనిపించాడు.

"ఇప్పుడు మంచి యాంగిల్స్‌లో తియ్యాలి. నువ్ 'ఓకె' అంటే తీస్తాను" అన్నాడు.

ఆమె 'అలాగే' అన్నట్టు తల ఊపింది.

"జస్టేమినిట్" అంటూ గళాసులో ఉన్న బీర్ ఆమెకు ఇచ్చాడు.

మంగకి అర్థంకాలేదు.

"నువ్ తాగు. అలా తాగుతుంటే తీస్తాను."

అర్థం కానట్టు చూసింది.

"ఫరవాలేదు ఫోటోలో అది కూల్‌డ్రింక్ లాగే కనిపిస్తుంది కమాన్" అంటూ ఆమె భుజంపై చెయ్యివేసి బీరు తాగించే ప్రయత్నం చేశాడు. కొంచెం పుచ్చుకుంది మంగ.

అలా ఆమె తాగుతూంటే కెమేరా మళ్ళీ క్లిక్ మంది. సగం తాగిన గ్లాసు బల్లమీద పెట్టేసింది.

"ఇది ఎంగిలిగ్లాసు. తక్కిందికూడా నువ్వే తాగాలి" అంటూ బలవంతంగా మరికాస్త తాగించాడు.

"సినిమాల్లో అవకాశాలు రావాలంటే నువ్వలా బిగదీసుకుని కూర్చోకూడదు. ఫ్రీగా ఉండాలి. ఫ్రీగా మాట్లాడాలి" కెమేరాలోంచి ఆమెను చూస్తూ చెప్పాడు ఫోటోగ్రాఫరు.

"ఫ్రీగా అంటే?" అర్థంకాలేదామెకు.

"ఫ్రీగా అంటే ఇలా" అంటూనే ఆమె పైటలాగేశాడతను. ఆమె ఉలిక్కిపడింది.

"ఖంగారు పడకు. అలాగే ఉండు. ఈ యాంగిల్ బావుంది. " అంటూ కెమేరాలోంచి ఆమె వంపుసొంపుల్ని తనివితీరా చూశాడు. అతనికి పిచ్చెక్కిపోయింది.

"చేతులు ఇలా పెట్టాలి?" ఆమె చేతుల్ని సవరించాడు.

"కొంచెం మత్తుగా చూడాలి" కెమేరాలోంచి చూస్తూనే చెప్పాడు.

ఆమె అలాగే చూసింది. "వండ్రఫుల్" అంటూ కెమేరాను మరోసారి క్లిక్ మనిపించాడతను.

ఫోటోలు తీయటం పూర్తిచేసి మంచం మీద కూర్చున్నాడు. బాటిల్లో ఉన్న బీర్‌ని మళ్ళీ గ్లాసులో పోశాడు.

"మన ఫ్రెండ్‌షిప్‌కి చిహ్నంగా ఇప్పుడు ఈ బీరు ఇద్దరం కలిసి తాగాలి." చిరునవ్వుతో చెప్పాడు. తను కొంచెం సిప్ చేసి గ్లాసు ఆమెకు ఇచ్చాడు.

"వాసన వస్తుందా?" అడిగిందామె.

"రాదు. నేను ఇంత తాగాను. నా దగ్గర వస్తుందా?"

లేదన్నట్టు తల అడ్డంగా తిప్పింది.

"మరింకనేం? భయం లేదు. అయినా నువ్ హీరోయిన్‌వి కావాలంటే ఇలాంటి భయాలు బొత్తిగా పెట్టుకోకూడదు. దేనికీ సిగ్గుపడకూడదు. ఇప్పుడు నేనిలా నిన్ను గుండెలకు హత్తుకున్నాననుకో. నువ్వు ఫీలయిపోకూడదు. ఎందుకంటే రేపు నువ్వు హీరోయిన్ వయ్యావంటే హీరోలంతా ఇలాగే హత్తుకుంటారుకదా!" అంటూనే ఆమెను తన గుండెలకు హత్తుకున్నాడు. చిగురుటాకుల్లా వణికిపోతున్న ఆమె పెదవులపై ముద్దు పెట్టుకున్నాడు. ఆమె వివశురాలైంది. ఫోటోగ్రాఫరు లేచి తలుపు గడియపెట్టాడు.

అరగంట తర్వాత ఆర్ముగం బిరియానీ ప్యాకెట్‌తో తిరిగి వచ్చాడు.

"నువ్ వచ్చేసరికి బీరు వేడెక్కిపోతుందని తాగేశాను" సంజాయిషీ ఇచ్చినట్టుగా అన్నాడు ఫోటోగ్రాఫరు.

"ఫరవాలేదులే.. భోంచెయ్!" ప్యాకెట్ విప్పి అతని ముందు పెట్టాడు ఆర్ముగం.

"మరి మీరు?"

"కాసేపాగి బైటికి వెళ్ళి తింటాం"

ఫోటోగ్రాఫరు బిరియానీ ప్యాకెట్‌ని ముందుకి లాక్కున్నాడు.

"ఇంతకీ అమ్మాయి ఫోటోలు తీశావాలేదా?" అతను ఆత్రంగా బిరియానీ తింటూంటే గ్లాసులో మంచినీళ్ళు పోస్తూ అడిగాడు ఆర్ముగం.

"తియ్యకుండా ఉంటానా? మంగ బాగా కోపరేట్ చేసింది. అద్భుతమైన యాంగిల్స్ ఇచ్చిందనుకో. కొన్ని యాంగిల్స్‌లో చూస్తే 'జిస్‌దేశ్ మే గంగా బహతీ హై'లో పద్మిని గుర్తుకొచ్చింది" చెప్పాడతను. ఆ మాట వినగానే ఆర్ముగం పొంగిపోయాడు. అతని కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"అలా అయితే ఈ క్షణం నుంచీ అమ్మాయి పేరు పద్మినీ అని పెట్టేస్తా! ఆ పద్మినీ ఇప్పుడు ఎలాగా మన ఫీల్డులో లేదుగా?" అన్నాడు.

"వెరీగుడ్ ఆ పేరే ఖాయం చేద్దాం. చూశావా మందు కొడితేనేగానీ మంచి పేరు తట్టలేదు. ఇకనుంచీ మంగతాయారమ్మ పద్మినిగా మారిపోతుంది. గొప్ప స్టారై పద్మినీ అంతటి పేరు తెచ్చుకుని ఉత్తర, దక్షిణాల్ని ఊపేస్తుంది". అంటూ చెయ్యెత్తి ఆశీర్వదించాడు ఫోటోగ్రాఫరు.

"ఫోటోలు రేపు కావాలి!" అతని భోజనం అయిన తర్వాత చెప్పాడు ఆర్ముగం.

"తప్పకుండా రెండేసి ప్రింట్లు వేయిస్తాను. మంచి ఆల్బం కూడా కొని ప్రజెంట్ చేస్తా" చేయికడుక్కుంటూ చెప్పాడు.

"అమ్మాయికి సినీమాలో మంచి వేషం దొరకాలేగానీ నీ రుణం ఉంచుకోను" ఫోటోగ్రాఫర్ వెళ్ళిపోతుంటే అతన్ని రోడ్డువరకూ సాగనంపి ఆఖర్న కృతజ్ఞతా పూర్వకంగా చెప్పాడు ఆర్ముగం.

"దాందేముంది బ్రదర్" అంటూనే అతను వెళ్ళిపోయాడు.

అతనితో తమకు ఎలాంటి సంబంధ బాంధవ్యం లేకపోయినా, అతని వల్ల ఆ క్షణం వరకూ తమకు ఎటువంటి ఉపకారం జరక్కపోయినా విలువైన తన శీలాన్ని అతనికి తన కూతురు ధారపోసిందన్న నిజం ఆర్ముగానికి తెలియదో, తెలిసినా పట్టించుకోలేదో తెలుసుకోవాల్సిన అవసరం ఎవరికీ లేకపోయింది.

ఇదొక విచిత్రమైన ప్రపంచం. వెండి తెర వేల్పులై ప్రేక్షకుల అభిమానాన్ని అందుకోవాలన్న ఆర్తితో ఈ ప్రపంచంలో అడుగు పెట్టే సోదరీమణులు ఎందరో ఇట్టే మోసపోతారు. చివరకు ఇక్కడ నిలబడేందుకు చోటు దొరక్క, వెనకడుగు వెయ్యలేక వ్యభిచారపు ఊబిలో ఇరుక్కుపోతారు. మగవాళ్ళయితే ఖరీదైన కాఫీ హోటళ్ళలో సర్వర్లుగా చేరిపోతారు. అసలు ఈ విచిత్ర ప్రపంచంలో కన్నతల్లే కూతురికి సెక్స్ పాఠాలు నేర్పుతుందంటే ఆశ్చర్యం ఉండదు.

ఆ మర్నాడు తన కూతురుని ఓ బ్యూటీ పార్లర్‌కి తీసుకువెళ్ళి అందంగా తయారు చేయించాడు. ఆ తర్వాత మళ్ళీ హోటల్ రూంకి వచ్చి తనకు పరిచయం వున్న ఓ సుప్రసిద్ధ నిర్మాతకు ఫోన్ చేశాడు ఆర్ముగం.

అతి త్వరలోనే ఆయన రెండు చిత్రాలు ప్లాన్ చేస్తున్న సంగతి అంతకుముందే ఓ సినీమా పత్రికలో చదివాడు ఆర్ముగం. అందుకే ఆయనను కలుసుకుని, తన కూతుర్ని పరిచయం చేయాలని అతని ఉద్దేశ్యం.

"మీరు కొత్త పిక్చర్స్ ఏవో ప్లాన్ చేస్తున్నారనీ, హీరోయిన్‌గా కొత్తవాళ్ళను తీసుకోబోతున్నారనీ పేపర్లో చదివాను. చాలా సంతోషం మిమ్మలి ఓసారి కలవాలనుకుంటున్నాను" అని చెప్పాడు ఫోన్లో. 'ఈరోజు కవిగారితో బిజీగా వున్నానప్పా. రేపు సాయంత్రం ఫ్రీ.. వచ్చి కలుసుకో' అని చెప్పాడు ఆ నిర్మాత.

చేసేదేం లేక ఇక ఆ రోజు రూములోనే ఉండిపోయాడు ఆర్ముగం.

సాయంత్రం ఆరుగంటలవేళ కలర్ ఫోటోలతో ప్రత్యక్షమయ్యాడు స్టిల్ ఫోటోగ్రాఫరు.

ఫోటోలన్నీ బాగా వచ్చినందుకు అతన్ని అభినందించాడు ఆర్ముగం. అందమైన ఆల్బంలో రంగు రంగుల తన ఫోటోలు చూసుకుని మంగకూడా మురిసిపోయింది.

"నీకో శుభవార్త గురూ!" అన్నాడు ఫోటోగ్రాఫరు అతి చనువుగా మంచం మీద కూర్చుని.

తన కూతురి ఫోటోలు అప్పుడే ఎవరైనా చూసి సినీమాలో అవకాశం ఇస్తున్నారేమోనని ఆశగా చూశాడు ఆర్ముగం.

"మరి కాసేపట్లో ఇక్కడికి మహతిగారు వస్తారు" చెప్పాడతను.

ఆ పేరు ఎక్కడో విన్నట్టే అనిపించింది ఆర్ముగానికి. "ఆయన నిర్మాతా? దర్శకుడా?" సందేహనివృత్తి కోసం అడిగాడు.

"అదేమిటి గురూ? మహతిగారు తెలీదా? 'సినీలోకం' పత్రిక సంపాదకులు" చెప్పాడు ఫోటోగ్రాఫరు. అర్థంకానట్టు చూశాడు ఆర్ముగం.

"ఆయన మన పద్మినిని చూస్తారు. కవరు పేజీ వెయ్యమన్నాన్లే. ముందు తను చూడాలన్నారు. ఇప్పుడు రమ్మన్నాను. ఈలోగా ఓ బాటిల్ తెప్పించు" ఇబ్బందిగా చూశాడు ఆర్ముగం.

"నీ తెలీదుగురూ! ఇదంతా పబ్లిసిటీ యుగం. 'నూతన తార పద్మిని.. చిత్ర పరిశ్రమకు మరో పద్మిని' అంటూ తన పత్రిక కవరు పేజీ వేశాడంటే నిర్మాతలు, దర్శకులూ చూసి వెర్రెత్తిపోతారు. మన పద్మినికి ఇక బుకింగులే బుకింగులు."

ఆర్ముగం ఫాస్ట్ ఫార్వర్డ్‌కి వెళ్ళిపోయాడు. పాలరాతి మేడలో, ఏసీ గదిలో ఫోం పరుపుల మీద పడుకున్నట్టూ, ఖరీదైన కారులో తిరుగుతున్నట్టు ఊహించుకున్నాడు. అతనలా ఊహల్లో తేలిపోతూండగానే ఫోటోగ్రాఫరు అతని బలహీనత మీద మరో దెబ్బ వేశాడు.

"ఖర్చుకోసం చూడద్దు గురూ! ఇవాళ అమ్మాయి కోసం వందల్లో నువ్వు ఖర్చు చేస్తే రేపు తను హీరోయిన్ అయ్యాక నీకు లక్షల్లో సంపాదించిపోస్తుంది. అప్పుడు ఆ డబ్బు ఎలా ఖర్చు పెట్టాలో కూడా తెలియక వర్రీ అయిపోతావ్"

ఆ దెబ్బతో ఆర్ముగం పూర్తిగా పడిపోయాడు. తన కూతురు వైపు గొప్పగా చూశాడు. క్షణం సేపు ఆమె కళ్ళు గర్వంతో మెరిశాయి. సరిగ్గా అదే సమయంలో ఓ నలభై సంవత్సరాల వ్యక్తి ఆ రూములో అడుగుపెట్టాడు. తెల్లటి లుంగీ దానిపై ఖద్దరు లాల్చీ. కళ్ళకు రిమ్‌లెస్ అద్దాలు. చేతిలో సిగిరెట్టు పెట్టె.

అతన్ని చూసి మంచం మీదనుంచి క్రిందకు దిగాడు ఫోటోగ్రాఫరు.

"రండి గురువుగారూ!" అంటూ సాదరంగా ఆహ్వానించాడు.

అతనే మహతి అన్న విషయం ఆర్ముగానికి అర్థమైంది. అయినా ఫోటోగ్రాఫరు చెప్పనే చెప్పాడు. "ఈయనే మహతిగారు 'సినీలోకం ఎడిటర్'" అని.

"ఇప్పుడే మనవాడు చెప్పాడు మీరొస్తున్నట్టు. చాలా సంతోషం" అంటూ చేతులు జోడించి నమస్కరించాడు ఆర్ముగం.

ఆ తర్వాత మంగను పరిచయం చేసే పుణ్యం కూడా ఫోటోగ్రాఫరే కట్టుకున్నాడు. కళ్ళద్దాలలోంచే మంగను పరిశీలనగా చూశాడు మహతి.

"అమ్మాయి బావుంది. అవకాశం రావాలే కానీ తర్వాత తిరుగుండదు" అన్నాడు.

"మీ ఆశీర్వాదం" వినయంగా అన్నాడు ఆర్ముగం.

"నీ వయసెంత?" మహతి అడిగాడు మంగని.

"మొన్ననే పదిహేడు నిండిది సార్" ఆర్ముగమే చెప్పాడు.

"గుడ్ కానీ ఒక్క విషయం ఎప్పుడు ఎవరడిగినా వయస్సు చెప్పకూడదు. ఒకవేళ తప్పనిసరై చెప్పాల్సి వస్తే 'జస్ట్ సిక్టీన్' అని చెప్పాలి" నవ్వుతూ అన్నాడు మహతి. అతనివైపు రెప్పార్చకుండా చూస్తూ అతని మాటలు ఆసక్తిగా వింటోంది మంగ.

"కబుర్లు తీరుబడిగా చెప్పుకోవచ్చుకానీ, ముందు మీ ఛాయిస్ ఏమిటో చెప్పండి. ఏం తీసుకుంటారు?" మధ్యలో కల్పించుకుంటూ అడిగాడు ఫోటోగ్రాఫరు. "మీ ఇష్టం మీరు ఏది తీసుకుంటే నేనూ అదే" శ్రీకృష్ణపరమాత్మ చిరునవ్వుతో కనిపించే ఫోజులో అన్నాడు మహతి.

బోయ్‌ని పంపించి బాటిల్ తెప్పించాడు ఆర్ముగం. మందు కొడుతూ తన గురించీ తన పత్రిక గురించీ చాలా విషయాలు చెప్పాడు మహతి.

ఎంతమంది కొత్త అమ్మాయిల ఫోటోల్ని తన పత్రికకు కవర్ పేజీగా వేశాడో, వాళ్ళల్లో ఎంతమంది ఇప్పుడు వెండి తెరను ఏలుతున్నారో, అలా ఏలుతున్న తారలు తనకు అప్పుడప్పుడు ఎలాంటి కానుకలు సమర్పించుకుంటున్నారో అన్నీ వివరంగా చెప్పాడు. ఓ గంటలో బాటిల్ పూర్తయింది.

"ఇంకో క్వార్టరు వుంటే బావుంటుందేమో" అన్నాడు మహతి.

ఆర్ముగం బయలుదేరాడు.

"నేనూ వస్తానుండు గురూ! ఫోన్ చేసుకోవాలి" అంటూ ఫోటోగ్రాఫరు కూడా అతని వెంట నడిచాడు. మళ్ళీ అంతలోనే ఏదో గుర్తుకొచ్చినవాడిలా రూంలోకి వచ్చి మంగతో అన్నాడు.

"చూడూ! మహతిగారు చాలా మంచిమనిషి. నువ్ నిన్న నాతో ఎంత చనువుగా వున్నావో ఈయనతో కూడా అలాగే ఫ్రీగా ఉండాలి" అని.

"నువ్వేం చదివావ్?" ఫోటోగ్రాఫర్ వెళ్ళిపోయాక మంచం మీది తలగడ మీద జారగిలబడుతూ అడిగాడు మంగని.

"తొమ్మిది పోయింది. మానేశాను" చెప్పిందామె.

"అయ్యో!" నొచ్చుకున్నాడు.

"కానీ నువ్వు ఎవరికీ అలా చెప్పకూడదు. ఇంగ్లీషు మీడియంలో డిగ్రీ చదువుతున్నట్టు నేను పేపర్లో రాస్తాను. నువ్వూ అలాగే చెప్పాలి."

ఆమె సరేనన్నట్టు తలూపింది.

"నీ చెయ్యి చూపించు"

ఆమె సందేహిస్తూనే చెయ్యి ముందుకు చాపింది.

"నాకు జాతకాలు చూడటం వచ్చులే" అంటూ ఆమె అరచేతిని దగ్గరకు తీసుకుని చూశాడు.

"ఉండు. ఎవరైనా చూస్తే బావుండదు" అని లేచివెళ్ళి తలుపు గడియపెట్టాడు.

"నీ చేతిలో ఇది అదృష్టరేఖ. చాలా బలంగా వుంది. అంటే నువ్ స్టార్‌వి కావటం ఖాయం. అప్పుడు నన్ను మరచిపోకూడదు సుమా!" అంటూ ఆమె అరచేతిని ముద్దుపెట్టుకున్నాడు.

ఆ తర్వాత అతను ఏం చేసినా ఆమె వారించలేకపోయింది.

మరో పావుగంట తరువాత ఆర్ముగం, ఫోటోగ్రాఫరూ తిరిగి వచ్చారు.

"మంగని ఇంటర్వ్యూ చేశారా?" అడిగాడు ఫోటోగ్రాఫరు.

"ఆహా! వచ్చే ఇష్యూకి కవర్ పేజీ వేసి ఇంటర్వ్యూ పబ్లిష్ చేస్తా" చెప్పాడు మహతి.

అలా ఆశల వలలో రెండో రోజు కూడా గడిపేసింది మంగ. ఆ రాత్రి ఆమె సినీతారయినట్టు బంగారు కలలు కూడా కన్నది.

మర్నాడు సాయంత్రం కూతుర్ని వెంటబెట్టుకుని నిర్మాత దగ్గరకు వెళ్ళాడు ఆర్ముగం.

తన కూతుర్ని ఆయనకు పరిచయం చేశాడు. నిర్మాత కళ్ళల్లో ఆశ్చర్యం తొణికిసలాడింది.

"ఇంత అందమైన కూతురు నీకుందని ఎప్పుడూ చెప్పలేదేమిటయ్యా బాబూ?" అన్నాడాయన చుట్టపొగ గాలిలోకి వదుల్తూ.

ఆ మాటకే సగం పడిపోయాడు ఆర్ముగం.

"అమ్మాయి ఫేస్‌లో మంచి స్పార్క్ వుంది. కళ్ళు చాలా బావున్నాయి. రేపు సాయంత్రం కారు పంపిస్తాను. అమ్మాయిని పంపించు. మా కెమేరామన్‌ని పిలిచి స్క్రీన్ టెస్ట్ చేయిస్తాను" అన్నాడు మళ్ళీ ఆయనే.

ఆ దెబ్బతో పూర్తిగా పడిపోయాడు ఆర్ముగం.

"రేపు తప్పకుండా అమ్మాయిని పంపిస్తాను" అని చెప్పి ఆయనకు పదే పదే నమస్కారాలు చేసి కూతురితో బయటపడ్డాడు.

రూముకి తిరిగి వచ్చిన తర్వాత, ఆ ప్రొడ్యూసరు లోగడ ఎన్నిగొప్ప సినిమాలు తీశాడో, ఎంతమంది కొత్త తారల్ని పరిచయం చేశాడో కూతురికి బోధ చేశాడు ఆర్ముగం.

చెప్పినట్టుగా మర్నాడు సాయంత్రం ఆ ప్రొడ్యూసరు ఆర్ముగం హోటల్‌కి కారు పంపించాడు.

"మీ అమ్మాయిగార్ని పంపించమన్నారు అయ్యగారు" అన్నాడు డ్రైవరు. అంటే తను వెళ్ళకూడదన్న విషయం ప్రొడక్షన్ మేనేజరుగా అనుభవం గడించిన ఆర్ముగానికి ఇట్టే బోధపడింది.

మంగకు ఎన్నో జాగ్రత్తలు చెప్పి కార్లో పంపించాడు. మరో పదినిమిషాలకు టీ నగర్‌లో వున్న ఆ ప్రొడ్యూసర్‌గారి ఆఫీసు ముందు కారాగింది. ఆమెను లోపలకు తీసుకెళ్ళాడు డ్రైవరు.

ఆ గదిలో చల్లగా ఉంది.

గది మధ్య సోఫా సెట్టు. దాని మధ్యన టీపాయ్. ఒక మూల టేబులు. దానిపైన టీవి. మరో మూల రిఫ్రిజిరేటరు.

గదిలో అడుగుపెట్టగానే మనసుకు హాయిగొలిపే సుగంధ పరిమళం ఆమెను ముప్పిరిగొంది.

స్వర్గంలో అడుగు పెట్టిన అనుభూతికి లోనైంది కొన్ని క్షణాలు ఎదురుగా సోఫాలో కూర్చుని పేపరు చదువుతున్న నిర్మాతను చూసి - "నమస్తే సార్" అంటూ చేతులు జోడించి నమస్కరించింది.

పేపరు మడిచి టీపాయ్ మీద పెడుతూ ఆమె వేపు చూశాడు నిర్మాత. "రా కూచో! " పక్కనే వున్న సోఫా చూపించాడు.

బెదురు బెదురుగా అడుగులు వేస్తూ నెమ్మదిగా వచ్చి సోఫాలో కూర్చుంది మంగ. "ఆయన చాలా పెద్ద నిర్మాత. ఎంతోమంది కొత్తవాళ్ళని పరిచయం చేశాడు. నిన్ను కనుక ఆయన మెచ్చుకుంటే - నువ్వు హీరోయిన్ అయిపోవటం ఖాయం. ఆయన దగ్గర జాగ్రత్తగా మసలుకో" అంటూ గత రాత్రినించే తన తండ్రి చేస్తూ వచ్చిన బోధలు ఆమె చెవుల్లో మారు మ్రోగుతున్నాయి.

"ఇప్పుడే మీ నాన్న ఫోన్ చేశాడు - నిన్ను నా దగ్గరకి పంపినట్టు" లాల్చీ జేబులోంచి సిగరెట్టు పెట్టె తీస్తూ చెప్పాడు.

"నీ హైటెంత?" అడిగాడాయన తర్వాత.

"రెండేళ్ళ క్రితం కాలేజీలో చూశారు. అప్పుడు అయిదూ నాలుగుండేదాన్ని."

"ఇప్పుడు అంతే వుంటావులే. ఎంత వరకూ చదివావ్?" మళ్ళీ ప్రశ్నించాడు. 'బి.ఎ' అని చెప్పాలనుకుంది. అలా చెప్పమని అంతక్రితం రోజు సాయంత్రం మహతి సలహా కూడా ఇచ్చాడు.

కానీ ఎందుకో అబద్ధం చెప్పాలనిపించలేదు ఆమెకు. నిజం చెప్పేసింది.

"నీ పేరు పద్మిని కదూ! మీ నాన్న చెప్పాడు ఇందాక" సిగరెట్టు వెలిగించుకున్నాక అన్నాడు నిర్మాత.

"అసలు పేరు మంగతాయారు సార్. సినీమాల్లో చేరితే 'పద్మిని' అని పెడతానన్నాడు నాన్న"

"గుడ్! చేరిపోయినట్టే! అసలు నన్నడిగితే మీ నాన్న వట్టి ఫూల్ అంటాను."

మంగకి అర్థంకాలేదు. కొంచెం దిగ్భ్రాంతిగా అతని వైపు చూసింది. "నాకు దాదాపు అయిదేళ్ళనుంచీ తెలుసు. ఈ మధ్య కాలంలో నాలుగు పిక్చర్స్ తీశాను. ఒక్కసారీ నీ అంత అందమైన కూతురుందని మీనాన్న చెప్పాడు కాదు."

ఆ మాట విన్న మంగకి ధైర్యం వచ్చింది.

"మీరు ఇప్పుడు రెండు సినీమాలు తీస్తున్నారటగా?" అమాయకంగా అడిగింది.

"అవును. ఒకటి వచ్చే నెలలోనే 'స్టార్ట్' అవుతుంది. అందులో వేషాలన్నీ ఫిక్సయిపోయాయి. అయితే విలన్ చెల్లి వేషానికి ఇంకా ఎవర్నీ అనుకోలేదు. అది నీకు ఖాయం. ముందు అన్నయ్యంటే ఆ చెల్లెలికి ప్రాణం. కానీ అన్నయ్య చేసే దుర్మార్గాల గురించి తెలుసుకున్నాక అతనిపై ద్వేషం కలుగుతుంది. నచ్చచెప్పుతుంది. అన్నగారు వినడు. చివరకు ఓ పరిస్థితిలో అన్న కోసం తను ప్రాణత్యాగం చేస్తుంది. అప్పుడు అన్నలో మార్పు వస్తుందన్నమాట. మంచి వేషం" సగం కాలిన సిగరెట్టును యాష్ ట్రేలో నలిపేస్తూ చెప్పాడు. ఆ వేషంలో అప్పుడే తనను ఊహించేసుకుంది మంగ.

అంతలో నిర్మాత సోఫాలోంచి లేచి విస్కీబాటిలూ, గ్లాసులూ తెచ్చి టీపాయ్ మీద పెట్టాడు. ఫ్రిజ్‌లోంచి ఐస్ వాటర్ బాటిల్స్ కూడా తీశాడు.

"విస్కీ తాగుతావా?" గ్లాసులో పోస్తూ అడిగాడు.

"నాకు అలవాటు లేదు. మీరు తాగమంటే తాగుతాను సార్" భయంగా నేల చూపులు చూస్తూ చెప్పింది.

"గుడ్! అయినా సినీతారవు కావాలంటే ఇలాంటి అలవాట్లు తప్పవ్. ఫ్రీగా వుండాలి!" ఐస్ వాటర్ విస్కీగ్లాసులో నిండా పోసి ఆమెకు అందించాడు. తాను సినీమా ఫీల్డులోకి ఎలా వచ్చాడో, ఎవరెవర్ని సినీమా తారలుగా చేశాడో ఆమెకు చెప్పాడు నిర్మాత. కళ్ళార్పకుండా ఆయన్నే చూస్తూ - శ్రద్ధగా వింటోంది మంగ.

మూడు రౌండ్లు పూర్తయ్యాయి.

"ఇప్పుడు నీకో ఫిలిం చూపిస్తాను. అందులో అమ్మాయి చేసినట్లుగా నువ్వు చెయ్యాలి." అంటూ లేచాడు నిర్మాత. టేబుల్ సొరుగులోంచి ఓ కేసెట్ తీసి వీసీపీలో పెట్టి ఆన్ చేశాడు.

మంగ టీవీలోకి శ్రద్ధగా చూడసాగింది.

అది బ్లూఫిలిం.

అందులో వస్తున్న దృశ్యాలు చూసి మంగ కొంచెం ఖంగారు పడింది.

"ఆ యాక్టర్లు ఎవరు?" అని అడిగింది ఇంకేం అడగాలో తెలియక.

"హాలీవుడ్ యాక్టర్లు. వాళ్ళెవరైతే మనకెందుకూ? మనం కూడా వాళ్ళలాగే...." అంటూ ఆమెను కౌగిట్లోకి తీసుకున్నాడు.

రాత్రి పదయ్యాక డ్రైవరు క్యారియర్ పట్టుకొచ్చాడు. ఇద్దరూ భోజనం చేశారు.

"షూటింగ్ ఎప్పుడుంటుంది?" భోజనం ముగించాక జడ అల్లుకుంటూ అడిగింది మంగ.

"చెప్పానుగా.. వచ్చే నెలలో వుంటుంది"

"అంతవరకూ నువ్వు 'టచ్'లో వుండాలి. నాకు ఖాళీ దొరికినప్పుడల్లా నీకు ఫోన్ చేస్తాను. వస్తుండాలి. రెండో పిక్చర్‌లో హీరోయిన్ వేషం ఇస్తాను" చెప్పాడు నిర్మాత.

ఆ తర్వాత - కార్లో 'రూమ్'కి పంపించాడు.

'ఏమన్నాడు? వేషం ఇస్తానన్నాడా?" రూములో అడుగుపెట్టగానే ఆమెను ప్రశ్నించాడు ఆర్ముగం.

"ఓ! చాలామంచివాడు. ముందు చెల్లెలు వేషం ఇస్తానన్నాడు. కథ కూడా చెప్పాడు. అది బాగా చేస్తే - వచ్చే పిక్చర్‌లో హీరోయిన్ వేషం కూడా ఇస్తానన్నాడు" సంబరపడిపోతూ చెప్పిందామె.

ఆర్ముగం సంతృప్తిగా నిట్టూర్చాడు.

మంగకి - ఆ రాత్రి నిద్ర సరిగ్గా పట్టలేదు. తెల్లవార్లూ ఏవేవో కలలొచ్చాయి. ఆ మర్నాడు ఆర్ముగం ఆ నిర్మాతను కలుసుకున్నాడు.

"మళ్ళీ ఎప్పుడు రమ్మంటారు?" అని అడిగాడు.

షూటింగ్ మరో నెలదాకా ప్రారంభం కాదు కనుక తమ ఊరు వెళ్ళిపోయి మళ్ళీ ఆ సమయానికి వస్తామని చెప్పాడు.

నిర్మాతగారు అందుకు ఒప్పుకోలేదు. ఆ నెలరోజులూ తమ ఆఫీసులోనే వుండమన్నాడు. ఇద్దరికీ రెండుపూటలా క్యారియర్ వచ్చే ఏర్పాటు చేస్తానన్నాడు. ప్రతిరోజూ మంగని షూటింగ్‌లకి తీసుకెళ్ళమని సలహాకూడా ఇచ్చాడు. కెమేరా ముందు ఎలా 'యాక్ట్' చేయాలో నేర్చుకుంటుందనీ, భయం పోతుందనీ చెప్పాడు.

ఆయన 'సలహాల్ని' వేదవాక్కులుగా భావించాడు ఆర్ముగం. ఆ సాయంత్రమే హోటల్ రూం ఖాళీ చేసి ప్రొడక్షన్ ఆఫీస్ రూములోకి కూతురుతో సహా మకాం మార్చాడు.

ఆ తర్వాత రెండు నెలలకు షూటింగ్ ప్రారంభమైంది. ఆ రెండు నెలలూ - నటనలో అనుభవం సంగతి అలా వుంచి ఆ నిర్మాత ధర్మమా అని శృంగారంలో అనుభవాన్ని సంపాదించుకుంది మంగ.

అప్పట్లో తమ చిత్రానికి దర్శకుడిగా పనిచేస్తున్న 'రావు'కి ఆమెను పరిచయం చేసి 'వేరే పిక్చర్స్'లో కూడా అవకాశాలుంటే చూడమని కోరాడు నిర్మాత. అలా నిర్మాత చేతిలోంచి 'రావు' చేతిలోకి మారింది. మంగ. అతని మాట సాయంతో రెండు సినిమాల్లో ఆమెకు వేషాలు వచ్చాయి.

అయితే ఏ వేషమూ ఆమెకు పేరు తెచ్చి పెట్టలేదు సరిగదా తగిన గుర్తింపు కూడా రాలేదు.

మొదటి చిత్రం ఆర్థికంగా దెబ్బతింది. దాంతో ఆమెను ముందుగా 'బుక్' చేసుకున్న నిర్మాత రెండవ చిత్రనిర్మాణాన్ని వాయిదా వేసుకున్నాడు. ఆ విధంగా ఆమెకు హీరోయిన్ ఛాన్స్ మిస్సయిపోయింది.

అయితే ఆశ అనేది మనిషికి ఓ బలవర్ధక టానిక్‌లాంటిది. ఆ ఆశే ఆర్ముగంలో తన కూతురు ఎప్పటికైనా వెండి తెరమీద ఓ వెలుగు వెలుగుతుందన్న నమ్మకాన్ని కలిగించింది.

తనకు తెలిసిన నిర్మాతల దగ్గరికీ, దర్శకుల దగ్గరికీ తన కూతుర్ని తీసుకు వెళ్ళి వేషాలకోసం ప్రాధేయపడేవాడు. ఒకరిద్దరు శ్రీ రామచంద్రుళ్ళా నిక్కచ్చిగా మాట్లాడినప్పటికీ తక్కినవాళ్ళు చాలామంది మంగ (పద్మిని)ను తమ చుట్టూ తిప్పుకునేవారు. 'అవసరం' తీర్చుకునేవారు. ఆ తర్వాత వీలుంటే ఓ చిన్న వేషం ఇచ్చేవారు. కాదంటే 'అవసరం' తీర్చుకున్నందుకు దానికి విలువకట్టి వెయ్యో, రెండువేలో చేతిలో పెట్టేవారు. మొత్తం ఈ పన్నెండేళ్ళ వ్యవధిలో సుమారు పన్నెండు తెలుగు చిత్రాల్లోనూ, పద్దెనిమిది తమిళ చిత్రాల్లోనూ చిన్న చిన్న వేషాలు ధరించింది పద్మిని. ఇంకా ధరిస్తూనే వుంది.

ప్రతిరోజూ స్టూడియోల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూంటుంది. ఏ స్టూడియోలోనూ ఎవరూ ఆమెకు అభ్యంతరం చెప్పరు. అందరూ ఆమెకు పరిచయం వున్నవాళ్ళే. హైలెవల్ దర్శకులు కొందరైతే, లో లెవెల్ ప్రొడక్షన్ బోయ్‌లు మరికొందరు. అందర్నీ పలకరిస్తూనే వుంటుంది. ఈ మధ్య 'వేషం' కావాలని అడగటం మానేసింది. ఎవరైనా 'వేషం వుంది వేస్తావా?' అంటే ఆనందంతో తలమునకలు కావటం మానేసింది. తనకిచ్చే 'వేషం' ఏమిటో, ఎలాంటిదో ముందుగానే ఊహించుకునే స్థాయికి చేరుకుంది. మేనేజర్ ఇచ్చే ఆ అయిదు వందలపైనే ఆమెకు ఆశ. ఆ అయిదు వందలూ ఆమె చేతిలో పెడుతూ ఆమె వైపు ఆశగా చూస్తాడు ప్రొడక్షన్ మేనేజరు.

ఆ చూపుల్లోని అంతరార్థాన్ని గ్రహించుకోగల శక్తిని సంపాదించుకుంది పద్మిని. అలా మరికొంత సంపాదన.

ఇప్పుడు మదరాసు మహానగరంలోని ఓ మారుమూల ప్రాంతంలో అయిదు వందలు 'ఇంటద్దె' చెల్లిస్తూ తన ముసలి తండ్రితో జీవిస్తోంది పద్మిని.

ఇప్పుడు 'హీరోయిన్' కావాలని ఆమె కోరుకోవటం లేదు. కనీసం 'వేషం'కోసం కూడా అంతగా తాపత్రయపడటంలేదు.

రోజు గడిచిపోతే చాలు అనారోగ్యంతో మంచం ఎక్కిన తండ్రికి అవసరమైన మందులు కొనివ్వగలిగితే చాలు. నెలనెలా ఇంటద్దె కట్టగలిగితే చాలు. రెండు పూటలా భోజనం చేయగలిగితే చాలు.

పద్మిని జీవితం గురించి ఇంత తెలుసుకున్నాక ఒకరెప్పుడో ఓ పత్రికలో చదివిన వాక్యాలు గుర్తుకొచ్చాయి.

"వెండి తెరమీద జిలుగు వెలుగుల వెనుక ఎంతో అంధకారం వుంది. బాధామయ జీవితాల ఆక్రందనలున్నాయి. వ్యభిచారం కంటే అధ్వాన్నమైన జీవితం గడిపే తారలున్నారు. అనంతమైన మోసం అభేద్యమైన ఉచ్చు పన్నే కుట్రదారులు 'ఓహో' అంటూనే కాళ్ళకింద గోతులు తవ్వే నక్క వినయాల నయవంచకులు వేషం పేరు చెప్పి భవిష్యత్తుపై ఆశలు చూపించి చెరుకుగడ రసం పీల్చినట్టు యవ్వన మకరందాన్ని జుర్రుకునే మహామహులు ఎందరో ఇక్కడ వున్నారు."

అందుకే ఈ పరిశ్రమలో ఓ కాలు పెట్టాలనుకునే అందమైన అమ్మాయిలు అడుగడుక్కీ ఆలోచించటం అవసరమంటున్నాను.

*"నాకు వేషం ఇస్తే - మీరు కోరుకున్నది ఇస్తాను"*

"కనిపించుటలేదు..

ఈ ఫోటోలో వున్న సీతామహాలక్ష్మి అనే అమ్మాయి ఈనెల 6వతేదీ నుంచీ కనిపించటం లేదు. వయస్సు 18 సంవత్సరాలు. తెల్లగా, నాజూగ్గా వుంటుంది."

ఇలా టీవీలోగానీ, పేపర్లోగానీ ప్రకటన వచ్చిందంటే, సదరు సీతామహాలక్ష్మి ఎందుకు కనిపించకుండా పోయిందో తెలివైన ప్రేక్షకులు, పాఠకులు అతి సులువుగా అంచనా వేసుకోగలుగుతారు.

తెల్లగా, నాజూగ్గా అందంగా వుండే 'టీనేజ్ గర్ల్' ఇంట్లోంచి వెళ్ళిపోయిందంటే 'డెఫినెట్'గా అది ప్రేమ కేసయ్యుంటుంది. అంటే ఆ సీతమ్మవారు ఏ శ్రీరామచంద్రుడితోటో లేచిపోయుంటుందని తాత్పర్యం చెప్పుకోవాలి. ఆ వయసుకున్న పవరలాంటిది. మనవేం చెయ్యలేం.

'ప్రేమయాత్రలకు బృందావనాలు - నందనవనాలూ అక్కర్లేదని' అలనాడే ఓ కవిగారు చెప్పివున్నారు కనుక - అలా లేచిపోయిన ఆ సీతమ్మతల్లి మైసూరు, ఊటీ వెళ్ళకుండా రాములవారితో ఏ మామూలు సిటీయో చేరుకుని - అక్కడి 'హోటల్ రూమ్'లో ప్రేమ మత్తు దిగిపోయేదాకా గడుపుతుంది.

తర్వాత కథ ముగింపు నేను చెప్పను.

ఎందుకంటే ఈ బాపతు కథల ముగింపులన్నీ ఒక్కలా వుండవు కనక.

ఆ రాముడు నిజంగా రాముడిలాంటివాడే అయితే ఆ పిల్ల మెడలో మూడు ముళ్ళూ వేస్తాడు.

కానీ రావణుడైతే మాత్రం అవసరం తీర్చుకుని ఆఫ్టాలంటాడు. ఆ దెబ్బతో సీతామాలక్ష్మి భవిష్యత్తు అంధకారబంధురమవుతుంది. ఆత్మాభిమానం కలదైతే ఆత్మహత్య చేసుకుంటుంది. అది కాకపోతే ఆత్మను చంపుకుని బజార్లో పడుతుంది. వదిలేయండి.

ఇలా కనిపించకుండా పోయే అమ్మాయిల్లోనూ, అబ్బాయిల్లోనూ మరో తెగవారుకూడా వున్నారు. సినీమాల్లో చేరి హీరోయిన్లుగానూ, హీరోలుగానూ అయిపోవాలనుకుంటూ రంగురంగుల కలలు కని అవకాశం దొరికినప్పుడు అంతో ఇంతో మూటకట్టుకుని మదరాసు మెయిలెక్కేవారు కూడా ఈ కోవలోకే వస్తారు. ఇప్పుడిప్పుడు గోదావరి ఎక్స్‌ప్రెస్ ఎక్కి హైదరాబాద్ చేరుకుంటున్నారలెండి.

అయితే ఇపుడు నేను చెప్పబోయే కథ ఆ విధంగా అప్పట్లో మదరాసు మెయిలు ఎక్కిన ఓ ఆడపడచుకథ.

ఈకథ - కట్టుకథ కాదు. వెండితెర సాక్షిగా జరిగిన సంఘటన. ఓ ప్రముఖ దర్శకుడు నాకు చెప్పగా ఆ సంఘటనకి కథారూపం ఇచ్చి మీ ముందుంచుతున్నాను చిత్తగించండి.

**అమలాపురం దగ్గర అదో మారుమూల పల్లెటూరు.**

ఆ ఊరి జిల్లా పరిషత్ హైస్కూల్లో శేషాచలపతిరావుగారు అప్పట్లో తెలుగుపండితుడుగా పనిచేస్తూండేవారు. ఆయనకు ఇద్దరు పిల్లలు. ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. అబ్బాయి స్కూలు ఫైనలు పాసవగానే మిలటరీలో చేరిపోయాడు. అమ్మాయి ఆ ఊరి హైస్కూల్లో స్కూలు ఫైనలు పాసయ్యాక అమలాపురం కాలేజీలో ఇంటర్మీడియట్‌లో చేరింది. రోజూ తోటి స్నేహితురాండ్రతో బస్సెక్కి అమలాపురం వెళ్ళి వస్తూండేది. ఆ అమ్మాయి పేరు అనురాధ. (ఇప్పటి 'డేన్సర్' కాదని మనవి). కాలేజీలో చదువుతున్న ఆడపిల్లలందరిలోకి అనురాధ బహుతెలివైనదీ, చురుకైనదీ, ఆపై అందమైనదీ కూడా. అప్పుడప్పుడు మధ్యాహ్నం పూట క్లాసులు లేకపోతే స్నేహితురాండ్రతో మేట్నీ సినిమాలు చూసేది అనురాధ. అద్దెపుస్తకాల షాపులోంచి సినీమా పత్రికలు తెచ్చుకుని చదువుతూ వుండేది. అలా చదివి, చదివి 'సినీతారల జీవితం స్వర్గధామంగా ఉంటుంద'ని ఆమె ఊహించుకోసాగింది.

ఓసారి అమలాపురంలో ఓ సినీమా శతదినోత్సవ వేడుకలు జరుపుకున్న సందర్భంగా, అందులో నటించిన నటీనటులూ, దర్శకుడూ అక్కడకు వచ్చారు.

ఆర్రాత్రి ఫంక్షను.

అయితే ఆ ఉదయం అమలాపురం చేరుకోగానే, దర్శకుడు కార్లో శేషాచలపతిరావు ఇంటికి వెళ్ళాడు. ఆ దర్శకుడిపేరు రావు. చదువుకునే రోజుల్లో రావు ఓసారి జీతం కట్టలేకపోతే మేష్టారు ఆదుకున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయనకు రావు – ప్రియ శిష్యుడు.

అందుకే ఆరోజున ఫంక్షన్‌కి వచ్చిన రావు 'మేష్టార్ని' ఓసారి చూద్దామని వెళ్ళాడు. మధ్యాహ్నం మూడుగంటలదాకా వారింట్లో గడిపాడు.

రావు సినీమా పరిశ్రమలో అంత గొప్ప పేరు తెచ్చుకుని బాగా సంపాదిస్తున్నందుకు మేష్టారు చాలా ఆనందించారు. ఇంట్లో వారందరికీ అతన్ని గర్వంగా పరిచయం చేశారు.

"ఇవాళ ఫంక్షన్‌కి మీరు కూడా రావాలి మేష్టారూ!" అని ఆహ్వానించాడు రావు.

సినీమాల పట్ల అంతగా ఆసక్తిలేని మేష్టారు – "నన్నొదిలేయవయ్యా! అలాంటివి నాకు అంతగా పట్టవు. నువ్వు నన్ను చూడటానికి వచ్చావ్.. అంతేచాలు" అన్నారు.

"పోనీ మీ వాళ్ళను పంపించండి" అన్నాడు రావు. అనురాధ ముచ్చటపడటం చూసి ఆమెనీ, భార్యనీ అతని వెంట పంపించారు మేష్టారు.

అమలాపురం చేరేలోగా దారిలో రావుని సినీతారలగురించీ వాళ్ళ జీవితాల గురించీ పుంఖానుపుంఖంగా ప్రశ్నలడిగింది అనురాధ.

ఫంక్షను పూర్తయ్యాక మళ్ళీ తన కార్లో వాళ్ళను ఇంటికి పంపించాడు రావు.

ఈ సంఘటన తర్వాత రావు మరో రెండు మూడు చిత్రాలకు దర్శకత్వం వహించటం, అవికూడా విజయవంతం కావటం జరిగింది.

ఓరోజు పొద్దున్న రావు ఇంటిముందు టాక్సీ దిగింది అనురాధ.

బెడ్డింగు చేత్తో పట్టుకుని ఇంట్లోకి అడుగుపెట్టిన ఆ పిల్లను చూసి రావు ఆశ్చర్యపోయాడు.

"నేను చలపతిరావు మేష్టారి అమ్మాయిని సార్" అంది బెడ్డింగ్ గోడపక్కన పెట్టి.

"అవును. గుర్తుపట్టాను. ఏమిటి విశేషం? అందరూ కులాసాగా వున్నారా?" అంటూ ఆదరపూర్వకంగా ప్రశ్నలవర్షం కురిపించాడు రావు. అన్నింటికీ తీరుబడిగా సమాధానాలు చెప్పినతర్వాత –

"నేను సినీమాల్లో యాక్ట్ చేయాలని వచ్చాను సార్. మీరెలాగైనా నాకు సహాయం చేయాలి" అంది అనురాధ,

రావు తెల్లబోయాడు.

"మీ నాన్నగారికి చెప్పేవచ్చావా?" అని అడిగాడు. ఆమె తప్పు చేసినదానిలా తలవంచుకుంది.

విషయం సులువుగానే బోధపడింది రావుకి. సంప్రదాయమైన కుటుంబంలో పెరిగి కాలేజీలో చదువుకుంటున్న పిల్లను (ఆ రోజుల్లో) ఏ తండ్రీ సినీమాల్లో చేర్చాలని అనుకోడు. అందునా శేషాచలపతిరావుగారు అస్సలు అనుకోరని రావుకి తెలుసు.

"ఊఁ అయితే మీనాన్నగారికి చెప్పకుండా ఇంట్లోనుంచి పారిపోయి వచ్చేశావన్నమాట!" అన్నాడు.

"ప్లీజ్ సార్! మా నాన్నగారికి నేనిలా వచ్చినట్టు తెలియచేయవద్దు సార్. మీరంటే నాకెంతో అభిమానం కనుక చొరవచేసి వచ్చాను. మా నాన్నగారంటే మీకెంతో గౌరవం కనుక నాకు తప్పక సహాయం చేస్తారన్న ఆశతో వచ్చాను" గబగబా చెప్పేసింది అనురాధ,

ఎందుచేతనో ఆమెను ప్రోత్సహించాలని రావుకి అనిపించలేదు. ఆ రాత్రి అమలాపురం ఫోన్ చేసి ఓ సినిమా థియేటర్ యజమాని ద్వారా శేషాచలపతి రావుకి కబురుపంపించాడు. అనురాధ తనదగ్గర క్షేమంగా వుందనీ వీలుచూసుకుని వచ్చి తీసుకెళ్ళమనీ చెప్పాడు.

మూడోరోజుకల్లా మేష్టారి దగ్గర్నించి టెలిగ్రాం వచ్చింది. "నేను త్వరలో వస్తాను. అనురాధ జాగ్రత్త." అని ఆ టెలిగ్రాం సారాంశం.

ఈలోగా ఒకరోజు సాయంత్రం రావు భార్యా పిల్లలు షాపింగ్‌కి వెళ్ళారు. ఏదో స్క్రిప్టు చూసుకుంటూ రావు ఒక్కడే తనగదిలో కూర్చుని వున్నాడు.

ఆ సమయంలో అనురాధ గదిలోకి వచ్చింది. రావు తన తండ్రికి కబురు చేసిన విషయం, తనను తీసుకు వెళ్ళేందుకు తండ్రి వస్తున్న విషయం ఆమెకు తెలియదు.

నెమ్మదిగా రావుని సమీపించింది అనురాధ.

"నా సంగతేం చేశారు సార్?" అడిగింది ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంటూ.

"సినీమాలో వేషమేకదా! చూద్దాం. ఇప్పటికిప్పుడు కావాలంటే ఎలా? టైం పడుతుంది అన్నాడు రావు.

"నాకు మీరు వేషం ఇప్పిస్తే మీరు ఏం కోరుకుంటే అది ఇస్తాను" అని చెప్పింది.

వింతగా ఆమెవైపు చూశాడు రావు.

"మీ మిసెస్ ఇంట్లో లేదుగా. మీరు రమ్మంటే 'బెడ్‌రూం'లోకి వస్తాను" ఏమాత్రం తొణక్కుండా అంటూన్న ఆ పిల్లవైపు అలాగే చూస్తూండిపోయాడు. అతను బదులు చెప్పకపోవటంతో, ఆ మౌనాన్ని అంగీకారంగా తీసుకున్న అనురాధ –

"త్వరగా రండి సార్ మళ్ళీ మీ మిసెస్ వచ్చేస్తుంది." అంటూ అతని చేయి పట్టుకుంది. ఆ చేయి విడిపించుకుని, దాంతోటే ఆమె చెంప చెళ్ళుమనిపించాడు రావు.

"నువ్ మేష్టారి కూతురువైపోయావ్ కనక ఇంతటితో ఊరుకున్నాను. లేకపోతే మెడపట్టి బయటకు గెంటేవాణ్ణి. సినీమాల్లో ఉన్న వాళ్ళకు నీతినియమాలుండవనుకుంటున్నావా? పిచ్చి పిచ్చి ఆలోచనలు కట్టి పెట్టి శ్రద్ధగా చదువుకో. మీనాన్నగారు చూపిన సంబంధానికి ఒప్పుకుని పెళ్ళిచేసుకో" అన్నాడు ఆవేశంగా.

అలాంటి సమాధానం ఆశించని అనురాధ ఏం చెప్పాలో, ఏం చేయాలో తెలియక కళ్ళనీళ్ళతో అలాగే చూస్తూండిపోయింది.

ఆ మర్నాడే శేషాచలపతిరావు వచ్చి కూతుర్ని ముఖం వాచేలా చివాట్లు పెట్టి సాయంత్రం బండిలో తీసుకు వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత ఓ ఏడాది గడిచిపోయింది.

ఓరోజు ఏదో పనిమీద రావు ఒక ప్రొడ్యూసర్ దగ్గరకు వెళ్ళాడు.

ఆ సమయంలో అక్కడకు ఓ అందమైన అమ్మాయి వచ్చింది.

"ఈ పిల్లెవరో తెలుసా? అనురాధనీ మీ సైడే అమలాపురం దగ్గర అదేదో ఊరట. సినీమాల్లో చేరాలని వచ్చింది" అంటూ ఆమెను రావుకి పరిచయం చేశాడు.

రావు ఆమెవైపు తీవ్రంగా చూశాడు.

ఆమె తలవంచుకుంది.

*సినీ హీరో కావాలనుకుని కాఫీ హోటల్లో సర్వర్‌నయాను!*



కౌముది

'అనుకున్నామని జరగవు అన్నీ -

అనుకోలేదని ఆగవు కొన్ని!'

అన్నారు ఆత్రేయగారు. ఈ సూక్తి అందరికీ అన్నివేళలా అనుభవంలోకి వస్తున్నా, వేరే నోటవింటే మాత్రం, "ఆహా! ఎంత విలువైన మాట శలవిచ్చారు మహాశయా?" అంటూ వారిని మెచ్చుకుంటాం.

పెళ్ళీడొచ్చిన ఓ అబ్బాయిగారు శ్రీదేవి లెవెల్లో వుండే అందమైన అప్సరసను అర్ధాంగిగా పొందాలని కలలు కంటాడు. ఆఖరికి కట్నం కోసం కాంప్రమైజ్ అయిపోయి మెల్లపిల్లనో, నల్లపిల్లనో కట్టుకుంటాడు. అనుకున్నది అనుకున్నట్టుగా జరక్కపోవటం అంటే అదే.

అదే విధంగా కాలేజీ బ్యూటీగా పేరు తెచ్చుకున్న ఓ కాంచనమాల చిరంజీవిలాంటి హీమాన్‌ని భర్తగా పొందాలని కోరుకుంటుంది. అయితే వాళ్ళ నాన్న ఘనంగా కట్నకానుకలు చదివించుకోలేని కారణం చేత పరిస్థితులకు లొంగిపోయి, జీవితంతో రాజీపడి సోడాగ్లాసు కళ్ళద్దాలూ బట్టతలా తలిగిన ఓ ఆర్డినరీ గుమస్తాకి ఇల్లాలిగా సెటిలైపోతుంది. ఒక్క పెళ్ళి విషయమే కాదు, ఏ సంగతైనా అంతే. జీవితంలో ఏదీ అనుకున్నది అనుకున్నట్టు జరగదు.

చాలామంది సినీమా తారలు తమను ఎవరైనా ఇంటర్వ్యూ చేస్తే "నేను డాక్టర్నవుదామనుకున్నాను, కానీ యాక్టర్నయ్యాను" అని చెప్తూంటారు.

అలాగే కొంతమంది మెడిసిన్ చదివి డాక్టర్లయి కూడా ఆ వృత్తిని డోంట్‌కేర్ అని ఎడం కాలితో తన్ని సినీపరిశ్రమలో కుడికాలు పెడతారు. యాక్టర్‌గా లేబిల్ తగిలించుకుంటారు.

"నేను సినీమా యాక్టర్ని అయ్యుండకపోతే మా వూరి సినీమా హాల్లో వేరుసెనక్కాయలు అమ్ముకుంటూ వుండేవాణ్ణి" అని నిజాయితీగా చెప్పేవారు కూడా వున్నారు. కనుక ఏతావాతా చెప్పేదేమిటంటే అన్నింటి వెనుకా అదృష్టం అనే అదృశ్య శక్తి కలిసిరావాలి.

అదే కనుక కలిసొస్తే అంట్లు తోముకునే ఆడపిల్ల అగ్రశేణి హీరోయిన్ అయిపోవచ్చు. బస్సులో టిక్కెట్లు ఇచ్చే కండక్టరు నంబర్ వన్ హీరోగా తారాపథంలో ఓ వెలుగు వెలగవచ్చు. అలాంటి వారిని మనం ఇంటర్వ్యూ చేస్తే 'నేను సినీమా హీరోనవుతానని కలలో కూడా అనుకోలేదు' అని చెప్తారు. అతను అనుకోలేదు కదా అని జరిగేది జరక్కమానదన్నమాట.

అలా అట్టడుగు స్థాయినుంచి సినీ తెరమీదకు వచ్చి హీరోగా స్థిరపడి ఏసీ కారుల్లో తిరుగుతూ నక్షత్రాల హోటళ్ళలో గడుపుతూ విదేశీమందులు తాగుతూ విదేశీ బ్యాంకుల్లోనే ఎక్కౌంట్లు నిర్వహిస్తూ విలాసవంతమైన జీవితాన్ని కొనసాగించగలిగే స్థాయికి ఎదిగిన హీరోలు లేకపోలేదు.

అలాంటి ఏ ఒకరిద్దర్నో ఆదర్శంగా తీసుకుని తాము కూడా అలాగే పేరు ప్రఖ్యాతలూ, పెన్నిధులూ సమకూర్చుకోవాలని ఉవ్విళ్ళూరేవారు మాత్రం చాలామంది వుంటారు. ఉన్నారు.

సాధారణంగా టీనేజీలో ఉండే అమ్మాయిల్లోనూ అబ్బాయిల్లోనూ ఈ రకం ఆలోచనలు రాజ్యమేలుతుంటాయి. కానీ అనుకున్నది అనుకున్నట్టుగా జరగదు కదా మరి.

ఆ మధ్య కొత్తగూడెంలో జరిగిన ఓ సంఘటన గురించి మీరు తెలుసుకుంటే నా పాయింటు సెంటు పర్సంట్ కరెక్టంటారు.

అనగనగా ముగ్గురు దోస్తులు.

వాళ్ళు ముగ్గురూ సినీమాలపై మోజుతో ఫాషన్లపై ఆసక్తితో చదువు సంధ్యల్ని నిర్లక్ష్యం చేశారు. ఫలితంగా పదో తరగతి ఫెయిలయ్యారు. ఇంట్లో ఆదరణ సన్నగిల్లింది. చదువుపట్ల శ్రద్ధ లేకుండా అల్లరి చిల్లరిగా తిరిగే పిల్లల్ని ఏ తల్లితండ్రులు ఆదరిస్తారు చెప్పండి?

ఎప్పుడైతే ఇంట్లో ఆదరణ తగ్గిపోయి జేబుల్లో డబ్బులు లేకుండా పోయాయో అప్పట్నించీ చిన్న చిన్న దొంగతనాలు చేయటం ప్రారంబించారు. ముందుగా ఇంట్లోనే ట్రయిల్ వేశారు. అది సక్సెస్ కావటంతో వీధిన పడ్డారు.

చదువు పట్ల ఆసక్తి, శ్రద్ధా పూర్తిగా సన్నగిల్లి విచ్చలవిడి జీవితానికి అలవాటు పడ్డ ఈ ముగ్గురు కుర్రాళ్ళూ క్రమేపీ తాగుడికి బానిసలయ్యారు. ఆ బాపతు అవసరాలు పెరగటంతో పెద్ద పెద్ద దొంగతనాలు ప్రారంభించారు. ఆ విధంగా ఎక్కడైనా అయిదారు లక్షలు దొరికితే ఓ సినిమా తీసి అందులో తామే హీరోలుగా నటించాలనుకున్నారు.

ఈలోగా అనుకున్నది అనుకున్నట్లు జరగదనే రూలు ప్రకారం వాళ్ళు ముగ్గురూ పోలీసుల కంట్లో పడ్డారు. ఈ ఇంట్లో దొంగతనం చేసి పారిపోతున్న వాళ్ళను పట్టుకుని పోలీసులు లాకప్‌లో వేశారు. ఆ తర్వాత తల్లిదండ్రులకు కబురు చేశారు. వాళ్ళొచ్చి తమ పిల్లల పక్షాన సారీ చెప్పారు. ఇకనుంచీ తమ పిల్లల్ని దారిలో పెట్టుకుంటామని ప్రామిస్ చేశారు. వదిలెయ్యండి.

కానీ తల్లిదండ్రులే పట్టించుకోకుండా వదిలేస్తే ఏమవుతుంది? ఏమవుతుందో ప్రభు జీవితాన్ని తరచి చూస్తే మనకు బోధపడుతుంది.

మెదక్ జిల్లా కౌడిపల్లి గ్రామానికి చెందిన ప్రభు వయస్సు పాతికేళ్ళు. పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ చేతిలో ఉన్నా ఉద్యోగం రాలేదు. రాలేదో, అందుకోసం సిన్సియర్‌గా ప్రయత్నం చేయలేదో మనకు తెలీదు. అయితే అతనికి సినిమాలంటే చిన్నప్పట్నించీ పిచ్చి. క్రమేపీ అతనిలో నటన పట్ల ఆసక్తి పెరిగింది. సినీమా హీరో కావాలని కలలు కన్నాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ నిర్వహించే 'థియేటర్ ఆర్ట్స్ డిప్లొమా కోర్స్'లో కూడా చేరాడు. ఆకాశవాణి నాటక విభాగంలో ఆడిషన్ పాసయ్యాడు. ఇన్ని అర్హతల్ని చేతిలో పెట్టుకుని మళ్ళీ సినిమా అవకాశాలకోసం ప్రయత్నం చేశాడు. ఎంత ప్రయత్నించినా అవకాశం లభించలేదు. నిరాశకు గురయ్యాడు. కొంత మతిస్థిమితం కూడా కోల్పోయాడు. ఓరోజు రాత్రి పదిగంటలకు తన రూములోంచి బయటకు వచ్చి సనత్‌నగర్ రైల్వే బ్రిడ్జి దగ్గరకు చేరుకుని రైలు పట్టాలపై తలపెట్టి పడుకున్నాడు. అదే సమయంలో ఓ రైలు అతని మీదనించి వెళ్ళిపోయింది. అతను దారుణంగా మృతి చెందాడు. అతని ఆత్మశాంతికి భగవంతుణ్ణి ప్రార్ధించడం తప్ప ఎవరు మాత్రం ఏం చేయగలుగుతారు?

అయినా నిరాశ చెందిన వాళ్ళంతా ఆత్మహత్య చేసుకోవాలని రూలేం లేదుకదా! అందుకే యాక్టరవుదామని మద్రాసు మహానగరం చేరుకున్న 'శీను' కాఫీ హోటల్లో సర్వరయ్యాడు. ఆ కథాక్రమాన్ని కూడా మీ ముందుంచుతున్నాను.

శ్రీకాళహస్తిలో తిరువేంగళం అని ఓ ప్రభుత్వోద్యోగి వుండేవాడు. ఆయనకు ఇద్దరే పిల్లలు. ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. వచ్చే జీతంతో కుటుంబాన్ని చక్కగా పోషించుకుంటూ పిల్లలిద్దర్నీ శ్రద్ధగా చదివిస్తున్నాడు తిరువేంగళం. అబ్బాయి ఇంటర్లోకి, అమ్మాయి టెన్త్‌లోకి వచ్చారు. పదోతరగతి పూర్తవుతుండగా అమ్మాయికి సంబంధాలు చూడటం ప్రారంభించారు. ఉన్నంతలో మంచి సంబంధం చూసి అమ్మాయి పెళ్ళి చేసేయాలనీ, అబ్బాయికి డిగ్రీ చెప్పించి మంచి ఉద్యోగస్థుణ్ణి చేయాలని తిరువేంగలం అనుకున్నాడు.

అనుకున్నది అనుకున్నట్టుగా జరగలేదు. అలా అని జరిగేది జరక్కమానలేదు. అదే సమయంలో తిరువేంగళానికి లంగ్ కేన్సర్ వచ్చింది. వైద్య చికిత్సకోసం ఉన్నదంతా ఖర్చుపెట్టుకున్నాడు. అయినా ఫలితం కనిపించలేదు. ఏడాది తిరక్కుండానే మృత్యువాతపడ్డాడు.

పాపం అతని కుటుంబం వీధిన పడింది. ఎలాగో అలా సంసారాన్ని నెట్టుకు రావాలన్న తపనతో తిరువేంగళం భార్య ఓ కాన్వెంటు స్కూల్లో అన్‌ట్రైన్డ్ టీచరుగా చేరింది. ఆమె సంపాదన ఇంటి ఖర్చులకే సరిపొయేదికాదు. ఇక పిల్లల చదువెట్లా సాగుతుంది? ఇద్దరూ చదువు మానేశారు. శీనుకి ఏదో ఒక ఉద్యోగం చేసుకోవలసిన అవసరం ఏర్పడింది.

ఎక్కడా అతని చదువుకి తగిన పని దొరకలేదు. సినీమాల్లో చేరితే బాగా సంపాదించవచ్చునన్న ఆలోచన కలిగింది అతనికి. స్కూల్లోనూ కాలేజీలోనూ చదివే రోజుల్లో అతను కొన్ని నాటకాలు వేశాడు. బహుమతులు కూడా వచ్చాయి.

ఆ ధైర్యంతోనే అతను మద్రాసు వెళ్ళి సినిమాల్లో వేషాలు కోసం ప్రయత్నించాలనుకున్నాడు. తన మనసులో మాట తల్లికి చెప్పాడు. కానీ ఆవిడ అందుకు ఒప్పుకోలేదు. శీనులో నిరాశ చోటు చేసుకుంది. ఇంటి ఆర్థిక పరిస్థితులు క్రమేపీ దిగజారుతున్నాయి. మరోవైపు తన చెల్లెలికి పెళ్ళి చెయ్యాలి. రాత్రింబగళ్ళు ఆలోచించాడు. చివరకు ఓ నిర్ణయానికి వచ్చాడు.

ఓ రోజు రాత్రి తల్లీ, చెల్లెలూ మంచి నిద్రలో ఉండగా వాళ్ళ మెడలో వున్న బంగారు గొలుసులు రెండూ తస్కరించి లారీలో మద్రాసు చేరుకున్నాడు. పాండీ బజార్లో వున్న ఓ చిన్న హోటల్లో గది అద్దెకు తీసుకున్నాడు. ఆరోజు నించే సినిమాల్లో అవకాశాల కోసం హోరాహోరీగా ప్రయత్నాలు ప్రారంభించాడు. ఎమ్జీఆర్, శివాజీగణేశన్ వంటి పెద్ద హీరోల్ని కలుసుకుని ఏదో ఒక చిన్న వేషమైనా ఇప్పించమని ప్రాధేయపడ్డాడు. అప్పటికప్పుడు వేషం కావాలంటే ఎవరు మాత్రం ఏం సాయం చేయగలుగుతారు? అక్కడికీ ఒకరిద్దరు నిర్మాతలకు శీనుని రికమెండ్ చేశారు.

ఫలితం కనిపించలేదు. బంగారం అమ్మగా వచ్చిన డబ్బంతా ఖర్చయిపోయింది. హోటల్ రూం ఖాళీ చేసి రోడ్డున పడ్డాడు. ఇంటికి తిరిగి వెళ్ళేందుకు అతనికి మనసొప్పలేదు.

రైల్వేస్టేషన్‌లో ఎవరైనా తెలిసిన ముఖాలు కనిపిస్తే నాలుగు రూపాయలు అడిగి తీసుకోవచ్చునన్న ఆశతో ప్రతిరోజూ స్టేషన్‌కి వెళ్ళేవాడు.

ఎప్పుడైనా ఎవరైనా దయతలచి నాలుగు రూపాయలిస్తే ఓరోజు గడిచిపోయేది. కానీ ఇలా ఎంతకాలం?

సినీమాల్లో అవకాశం దొరికే ముందు ప్రాణం నిలవాలి కదా! ప్రాణాలు నిలవాలంటే తిండి కావాలి. తిండి కావాలంటే డబ్బుండాలి.

పనికోసం అతను ప్రతిచోటా తిరిగాడు. చివరకు ఓ కాఫీ హోటల్లో చిన్న పని దొరికింది. ఇక కడుపు కాల్చుకోనవసరం లేదన్న సంతృప్తి లభించింది. తక్కిన కుర్రాళ్ళతో అతనూ ఆ హోటల్లోనే ఎక్కడో అక్కడ తలదాచుకునే నీడ దొరికింది.

రోజులు, వారాలు, నెలలు గడిచిపోయాయి. నిర్విరామమైన దైనందిన జీవితంలో సినీమాల్లో నటించాలన్న అతని కోరిక మసకబారిపోయింది. హోటల్లో మాత్రం అతని కృషికి ఫలితం లభిస్తూ వచ్చింది. క్లీనరుగా చేరిన వాడు ఇప్పుడు సర్వరుగా ప్రమోషన్ పొందాడు. రెండు పూటలా భోజనం, ఉండటానికి వసతి, ఏడాదికో యూనిఫాం, నెలకు వెయ్యిరూపాయల జీతం.

ప్రతినెలా తన జీతంలోంచి ఇంటికి ఆరువందలు పంపుతున్నాడు శీను.

'సినిమాస్టార్' కావాలనుకుని ఇరవై ఏళ్ళక్రితం ఎప్పుడో మద్రాసు చేరుకున్న శ్రీను అక్కడికి ఓ స్టార్ హోటల్లో సీనియర్ సర్వర్‌గా ఇప్పటికీ జీవితాన్ని గడుపుతున్నాడు.

అందుకే అంటారు.

అనుకున్నామని జరగవు అన్నీ - అనుకోలేదని ఆగవు కొన్నీ.

## *"జీవితనాటకంలో అన్ని పాత్రలూ పవిత్రంగా ఉండవ్!"*

**మీరు 'రాజా - పేద'** సినీమా చూశారో లేదో నాకు తెలీదు. అందులో ఒక పాట వుంది. ఆ 'పాట'ని మాత్రం ఎప్పుడో ఒకప్పుడు మీరు రేడియోలో విని వుంటారని ఈ పరిశోధకుడి నమ్మకం. 'జిక్కీ' పాడిన ఆ పాట పల్లవి ఇలా వుంటుంది -

'కళ్ళు తెరచి కనరా -

సత్యం ఒళ్ళు మరచి వినరా!

సర్వం నీకే బోధపడురా!"

ఆ పాట పల్లవి సంగతి పక్కనెట్టి - అందులోని ఓ చరణం యొక్క తాత్పర్యాన్ని తమరికి మనవి చేస్తాను.. చిత్తగించండి.

అదృష్టం వక్రిస్తే రాజ్యాలు ఏలే రాజాధిరాజు నిరుపేదగా మారిపోయి, "అమ్మా దానం - అయ్యా దానం" అంటూ అన్నవరం గుడి మెట్ల మీద కూర్చుని అడుక్కునే స్థాయికి దిగిపోవచ్చు. అలాకాక అదృష్టం కలిసొస్తే, అమలాపురం ఆనంద్ భవన్‌లో కాఫీకప్పులు కడుక్కునే ఓ నిరుపేద - కనకపు సింహాసనాన్ని అధిష్టించగలిగే మహరాజు పదవికి ఎదిగిపోవచ్చు."

కానీ -

సదరు అదృష్ట దేవత ఎప్పుడు ఎవర్ని కుడిచేత్తో ఆశీర్వదిస్తుందో ఎవర్ని ఏ సమయంలో ఎడం కాలితో తంతుందో ఎవరూ చెప్పలేరుగాక చెప్పలేరు. ఆ అదృష్టదేవత కృపారస కరుణాకటాక్ష వీక్షణాలను అనుసరించే మనుషుల బతుకులు అఘోరిస్తూ వుంటాయి. పూలమ్మిన చోట కట్టెలమ్ముకునే విధంగా కొందరి బతుకులు పడిపోతే "సింగిల్ బాయిల్డ్ ఎగ్' తినే లెవెల్ నుంచి 'ఫుల్ ప్లేటు చికెన్ సిక్స్టీఫైవ్' తినగలిగే లెవెల్‌కి మరికొందరి బతుకులు టర్నవుతాయి. ఒకనాడు కేవలం అరవై రూపాయలిచ్చే మగవాడికి ఒక రాత్రి తన శరీరాన్ని అమ్ముకునే 'బజారుపిల్ల' రోజుకి అరవైవేలు 'వైట్‌మనీ' సంపాదించగలిగే స్థాయికి చేరుకుందంటే అదంతా అదృష్టదేవత చూపించిన చలవేనని చెప్పక తప్పదు. ఆ అరవై వేలు పగటిపూట సంపాదించే 'వైట్‌మనీ' మాత్రమే..! అదికాక రాత్రిపూట సంపాదించే 'నల్లధనం' లెక్కపెట్టడం మనవల్లకాదు. అది ఎట్లా అంటారా.?

ఈ కథ చదవండి. మీకే సర్వం బోధపడుతుంది.

అనగనగా ఓ అమ్మాయి పేరు ఆశాలత. శ్రీకాకుళం దగ్గర పల్లెటూరు. అక్కడి సింగిల్ టీచర్ స్కూల్లో మూడో తరగతి చదువుతూండగా ఆ పిల్లను 'రంగరాజు' అనే బజారు రౌడీ ఎత్తుకొచ్చి ఏలూరులో వుండే 'గంగాబాయి'కి అమ్మేశాడు. ఎంతకి అమ్మేడో - ఆ వివరాలు తెలియవు.

అప్పటికి ఆశాలత వయస్సు కేవలం తొమ్మిది సంవత్సరాలు. రెండు మూడు రోజులు 'అమ్మ'కావాలంటూ ఏడ్చింది ఆశాలత. మిఠాయిలు కొనిపెట్టి - బొమ్మలు కొనిపెట్టి మరిపించింది గంగాబాయి. వాళ్ళ అమ్మా నాన్న ప్రమాదంలో చనిపోయారనీ, అందుకే అక్కడకు తీసుకొచ్చారనీ ఆశాలతను నమ్మించింది. కొన్ని నెలలకు ఆశాలత తన తల్లిదండ్రుల్ని పూర్తిగా మరిచిపోయింది. గంగాబాయిని 'పిన్నమ్మా' అంటూ పిలిచేది. అస్తమానూ ఆమె వెనకాలే తిరిగేది. రాత్రి సమయాల్లో ఆమె పక్కలోనే పడుకునేది.

సాధారణంగా పిల్లలకి తల్లితండ్రులు నీతి కథలూ - జాతి కథలూ చెప్తారు. కానీ గంగాబాయి మాత్రం ఆశాలతకి అన్నీ 'అవినీతి' కథలు చెప్పేది. డబ్బుంటే ఎలాంటి సుఖాలు పొందవచ్చునో, ఆ డబ్బుని ఎలా సంపాదించవచ్చునో విడమరచి చెప్పేది.

ఆశాలతకి వయసు వస్తున్న కొద్దీ గంగాబాయి ఆలోచనలు అర్థమవసాగాయి. గంగాబాయి దగ్గర అప్పట్లో మరో ముగ్గురమ్మాయిలు ఉండేవారు. వాళ్ళను అడ్డం పెట్టుకుని అడ్డదారిలో చేసే వ్యాపారం గురించి పూర్తిగా అవగాహన చేసుకుంది ఆశాలత.

తన ఇంటికొచ్చే విటులకు ఆశాలతను పరిచయం చేసేది గంగాబాయి. వాళ్ళు 'ఆశా' బుగ్గగిల్లి, ముద్దు పెట్టుకుని - "నీ పెంపుడు కూతురికి నేనే బోణీ చేస్తాను సుమా?" అంటూ పోటీపడేవారు. చివరకు ఆ రోజు రానేవచ్చింది.

'ఆశా' కోసం అప్పటివరకు ఆశపడుతున్న 'మగరాయుళ్ళ'నందర్నీ ఆ రాత్రి ఆహ్వానించింది. ఆశాకి తెల్లచీర కట్టి, మల్లెపూలతో జడకుట్టి పట్టెమంచం మీద కూర్చోబెట్టింది.

"ఇన్నాళ్ళూ నా సొంతబిడ్డలా పెంచుకొచ్చాను. ఇవాళ మీ సొంతం చేస్తున్నను. ఇవాళ మా 'ఆశా'కి తొలిరాత్రి కనుక మీలో ఎవరు ఎక్కువ పలికితే వారి పక్కలోకి వస్తుంది" అంటూ 'అనౌన్స్' చేసింది గంగాబాయి.

వేలం పాట మొదలైంది. దేవుడిపాట పది రూపాయలతో మొదలై నాయుడి పాట నాలుగు వందలతో ఆగింది. ఆ రాత్రికి నాయుణ్ణే 'ఆశా' దేవుడిగా భావించింది. అతని 'చేతలకీ,' 'చేష్ట'లకీ నిస్సహాయంగా తలవంచింది.

ఆ విధంగా ప్రారంభించిన 'అవినీతి' బ్రతుకుని, అవిచ్ఛిన్నంగా కొనసాగించింది ఆశా.

గంగాబాయి ఆధీనంలో వున్న తక్కిన 'అమ్మాయిలు' వారానికి నాలుగైదు వందలు సంపాదించగలిగితే - 'ఆశా' ఒక్కరోజులోనే ఆ 'లెక్క' తెచ్చి గంగాబాయి చేతిలో పెట్టేది. ఆ విధంగా ఆవిడ అభిమానాన్ని చూరగొంది.

రోజులు... వారాలు.. నెలలు ఏళ్ళూ గడిచిపోయాయి. కేవలం మూడేళ్ళ వ్యవధిలో 'ఆశా' ఆ జిల్లాకంతటికి పేరు తెచ్చుకుంది. మనిషి నల్లగా వున్నా ఆమెలో ఎన్నో అందాలు కుర్రకారుని వెర్రెత్తించేవి. ఆమె కళ్ళు పూలవాకిళ్ళై మత్తెక్కించేవి. ఆ మత్తులో పడ్డ ఓ మదనకామరాజు - "నిన్ను పెళ్ళిచేసుకుంటాను ఈ వృత్తి వదిలిపెట్టి వచ్చేస్తావా?" అని అడిగాడు.

ఆశా ఆలోచించింది. అప్పటికే నాలుగేళ్ళుగా 'ఆ రకం' జీవితంలో లోతుపాతుల్ని చవి చూసింది. తన కళ్ళముందే 'రెండు వందలు' పుచ్చుకున్న 'అమ్మాయి' నాలుగేళ్ళ తరువాత - 'రెండు రూపాయలు'కు దిగిపోవటం గమనించింది.

రేపు తన పరిస్థితి అలాగే కాకూడదని గేరంటి ఏమిటీ..?

గంగాబాయి మాత్రం తనను ఎల్లకాలం ఆదుకుంటుందా? తనలో జవసత్వాలు తగ్గిపోయి 'రేటు' పడిపోతే - మరో 'ఉషా'నో, 'నిషా'నో తెచ్చి అభిమాన కూతురుగా పెంచుకోదన్న నమ్మకం ఏమిటి?

అందుకే 'కాళ్ళదగ్గర కొచ్చిన బేరాన్ని' కాలదన్నుకోకూడదుకుంది. ఆ మదన కామరాజుని పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకుంది. అయితే గంగాబాయి అభిమాన పుత్రికను ఆశీర్వదించవలసిందిపోయి ఆమె ఆలోచనకు అడ్డం పడింది.

రోజుకో బంగారు గుడ్డును పెట్టే బాతును ఒక్కసారిగా కోసుకుని వండుకుతినటం మూర్ఖత్వమనుకుంది. కనీసం పాతికవేలిస్తే ఆ పెళ్ళికి అంగీకరిస్తానని 'మదనకామరాజు'కి మాటిచ్చింది.

చివరికి అక్కడ కూడా వాళ్ళిద్దరి మధ్యా 'వేలంపాట' ప్రారంభమై పదిహేను దగ్గర ఆగింది.

వారం రోజుల తర్వాత పదివేలు గంగాబాయి చేతిలో పెట్టి - ఆమె సాక్షిగానే - 'ఆశా' మెడలో మూడుముళ్ళూ వేశాడు మదనకామరాజు.

మరో నెలరోజుల వ్యవధిలో తక్కిన అయిదువేలూ వడ్డీతో సహా తీరుస్తానని కాగితం రాసిచ్చాడు.

ఆ మర్నాడే ఆశా సమేతంగా బొంబాయి మహానగరం చేరుకున్నాడు మదన్.

ఓ 'హైక్లాస్' హోటల్లో రూం తీసుకున్నాడు. "మీ ఇంటికి ఎప్పుడు తీసుకెడతారు?" అని అడిగింది ఆశా ఆ రాత్రి.

"ముందు పది రోజులు హనీమూన్ తర్వాతే ఇల్లు" అని చెప్పాడు మదన్.

అతని గురించిన వివరాలన్నీ అడిగింది ఆశా.

తన తండ్రి పెద్ద 'బిజినెస్‌మాన్' అనీ ఆయనకు తానొక్కడే సంతానమనీ తనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాడనీ చెప్పాడు మదన్. ఒక్కసారిగా విషయం చెప్పి ఆయన్ని 'షాక్'కి గురిచేయటం కంటే నెమ్మదిగా చెప్పి ఒప్పిస్తానన్నాడు.

అతని మంచి మనసుకి ఆశా కృతజ్ఞతలు తెలుపుకుంది. తన తన నాలుగేళ్ళ 'వ్యభిచార' జీవితంపై నల్ల ముసుగు సరిచేసి స్వచ్ఛమైన మనసుతో అతనికి తన సర్వస్వాన్నీ అర్పించింది.

బొంబాయిలో పదిరోజులు పదినిమిషాల్లో దొర్లిపోయాయి. మదనకామరాజు పర్సులో డబ్బు ఖర్చయిపోయింది.

"ఇంక మనూరు వెళ్ళిపోదాం" అన్నాడు.

"మీ ఇష్టం" చెప్పింది ఆశా.

"నేను బ్యాంక్‌కి వెళ్ళి డబ్బు తెస్తాను. హోటల్‌లో కట్టాల్సిన డబ్బు కట్టేసి సాయంత్రం ట్రైన్‌కి వెళ్ళిపోదాం. బట్టలు సర్దేసుకో" అని చెప్పి ఆ రోజు ఉదయం పదిగంటలవేళ - బయటకు వెళ్ళాడు మదనకామరాజు.

సాయంత్రం నాలుగయింది. పెట్టె సర్దుకుని ప్రయాణానికి సిద్ధమై కూర్చుంది ఆశ. కానీ మదనకామరాజు జాడ కనిపించలేదు.

సాయంత్రం అయిదయింది. ఆశా మనసులో ఆరాటం ఆరంభమైంది.

'బండి ఆరుగంటలకని చెప్పాడు. ఇంకా రాలేదేమిటి చెప్మా? ' అనుకుంది. అసహనంగా అస్తమానూ 'రూం'లోంచి బయటకు చూడసాగింది.

సాయంత్రం ఆరయిపోయింది. ఈసారి ఆశా మనసులో ఏదో అనుమానం తల ఎత్తింది.

'కొంపదీసి నన్ను మోసం చేయలేదు కదా?' క్షణాలు యుగాలు గడుస్తున్న కొద్దీ - ఆమె మనసులో అంకురించిన అనుమానపు బీజం - మహావృక్షమై - మనసును కలచి వేయసాగింది. రాత్రి తెల్లవార్లూ కళ్ళల్లో ఒత్తులు వేసుకుని మదన్ కోసం ఎదురు చూసింది. అయినా నిరాశే ఎదురైంది. ఆ బొంబాయి మహానగరంలో ఎక్కడికని వెళ్ళాలి? ఎలా వెళ్ళాలి? అసలు వెళ్ళాలంటే ముందు హోటల్ బిల్లు చెల్లించాలి. తన పర్సులో పాతికరూపాయలకంటే ఎక్కువ లేవు.

ఆ సాయంత్రం వరకూ మదన్ వస్తాడని ఎదురుచూస్తూనే పరిపరివిధాల ఆలోచించింది. 'మదన్ ఇక రాడు' అని నిర్ణయించుకున్న తర్వాత - హోటల్ మేనేజర్‌ని కలుసుకుని తన పరిస్థితి వివరించింది.

"హోటల్ బిల్లు మొత్తం మూడువేలు దాటింది. 'ఎడ్వాన్స్' రెండువేలు ఇచ్చారు. తక్కిన వెయ్యీ చెల్లిస్తే మీరు వెళ్ళిపోవచ్చు" అన్నాడు మేనేజరు. ఆశా మాట్లాడే తెలుగు మేనేజరుకి తెలియదు. మేనేజరు మాట్లాడే హిందీ ఆశాకీ తెలీదు. ఒకరు మాట్లాడే విషయాన్ని మరొకరికి తెలియ చేయటంలో ఆ హోటల్లో పనిచేస్తున్న ఓ సర్వరు సహాయపడ్డాడు.

"మీ ఆయన కోసం మరో రెండు రోజులు చూద్దాం. అప్పటికీ ఆయన రాకపోతే ఏం చేయాలో ఆలోచిద్దాం" అని సలహా ఇచ్చాడు మేనేజరు.

ఆ రెండు రోజులూ - హోటల్ రూములోనే 'ఖైదీ'లా గడిపింది ఆశా. మూడవరోజు సాయంత్రం హోటల్ మేనేజరు ఆశా గదికి వచ్చాడు. అతని వెంట మరో పెద్దమనిషి కూడా ఉన్నాడు.

"ఈయన మా ప్రొప్రయిటర్‌గారు!" అని పరిచయం చేశాడు మేనేజరు. ఆ ప్రొప్రయిటర్‌కి కాస్తో కూస్తో తెలుగు రావటం వల్ల ఆశాకీ కొంత ఊరట కలిగింది. కన్నీళ్ళ పర్యంతమై తన గోడు చెప్పుకుంది. అంతా విన్న హోటల్ ప్రొప్రయిటర్ అడిగాడు -

"మా హోటల్లో డాన్స్ చేస్తావా?" అని. ఆశాకి అయోమయంగా వుంది. ఏం చెప్పాలో తోచలేదు.

"రోజుకి గంటసేపు డాన్స్ చేస్తే వందరూపాయలిస్తాం. హోటల్ రూంలోనే వుండచ్చు. భోజనం ఫ్రీ. ఒక నెలరోజుల్లో నీ అప్పు తీరిపోగా నీకే వెయ్యి రూపాయలు మిగుల్తాయి" ఆశపెట్టాడు మేనేజరు.

'అంతకంటే గత్యంతరం లేదు' అనుకుంది ఆశా.

"కానీ.. నాకు డ్యాన్స్ రాదే?" చెప్పింది వెంటనే.

"డాన్స్ రానక్కరలేదు. సినీమాల్లో చూస్తుంటావ్‌గా! హోటల్లో మ్యూజిక్ వినిపిస్తారు. దానికి తగ్గట్టుగా నువ్వు ఆడితే చాలు!"

కొంచెం అర్థమైంది ఆశాకి.

మర్నాడు రాత్రి తొమ్మిదిగంటలకు ఆమెను కార్లో - మరో హోటల్‌కి తీసుకెళ్ళారు. అక్కడ తనలాంటి అమ్మాయిలు మరో నలుగురు కనిపించారు. వాళ్ళందరికీ ఆమెను పరిచయం చేసి - 'ఈ అమ్మాయి పేరు ఆశా. మీతోబాటు డాన్స్ చేస్తుంది. ఎలా చేయాలో అంతా వివరంగా చెప్పండి" అంటూ ఆర్డరు జారీ చేశాడు ప్రొప్రయిటర్.

పది గంటలకు ఆ హోటల్లో డాన్స్ ప్రారంభమైంది. అది డాన్స్ కాదు. కేవలం పిచ్చిగంతులు. అందుకే వాటిని ఆ రెండు గంటల వ్యవధిలో చాలా సులువుగా నేర్చేసుకుంది ఆశా.

హోటల్లో అందరూ తాగుతున్నారు. తాగుతున్న వాళ్ళముందు తైతెక్కలాడుతున్నారు. ఆ 'తైతెక్కలాట' పేరు కేబరే డాన్సట. ఆశా తెలుసుకుంది.

వాళ్ళు ఒళ్ళు విరుచుకుంటూ డాన్స్ చేస్తున్నారు. వీళ్ళు ఒళ్ళు తెలియకుండా తాగుతున్నారు. ఓ అరగంట గడిచింది.

ముందు టేబుల్ దగ్గర కూర్చున్న ఓ యాభై ఏళ్ళ పెద్ద మనిషి అప్పటికి మూడు పెగ్గులు తాగి నాలుగో పెగ్గుకి ఆశాని కంపెనీ ఇవ్వమన్నాడు.

అంతకుముందు గంగాబాయ్ కంపెనీలో అలాంటి అనుభవం సంపాదించిన ఆశా ఆశగా అతని పక్కన చేరింది. గ్లాసులో వున్న విస్కీని అతనితో పంచుకుంది.

అతనేదో హిందీలో అడిగాడు.

"నహీ... మై... తెలుగు" అని మూడు ముక్కలు చెప్పింది ఆశా తన మత్తు కళ్ళతో అతనివైపు గమ్మత్తుగా చూస్తూ. అతను బోలెడాశ్చర్య పడిపోయాడు.

"ఓర్నీ! నువ్ తెలుగమ్మాయివా! వండ్రఫుల్.." అన్నాడు.

అంత ఆశ్చర్యాన్ని తట్టుకోలేకపోయాడు కాబోలు - తాగిన మత్తంతా దిగిపోయింది. మరో రెండు పెగ్గులు ఆర్డరిచ్చాడు.

"కంపెనీ మందులో మాత్రమేనా? అందులో కూడా ఇస్తావా" అని కొంటెగా అడిగాడు.

"ఎందులో?" అసలే మత్తు కళ్ళు. దానికి తోడు మైకం కూడా ఆవరించటంతో అవి వింతగా మెరిశాయి.

"పొందులో!" తాగుడు 'సిగ్గు శరీరాల్ని' తరిమేస్తుందంటారు. అందుకే అంత ధైర్యంగా చెప్పాడతను.

"కుదర్దు. మా ప్రొప్రయిటర్ ఒప్పుకోడు" గ్లాసులో వున్న చివరి చుక్క కూడా తాగేసి మళ్ళీ డాన్స్ బృందంలో కలిసిపోయింది.

అరగంట తర్వాత డాన్స్ పూర్తయింది. అమ్మాయిలతో బాటు ఆశా కూడా మేకప్ రూముకి వచ్చి బట్టలు మార్చుకుంది. తర్వాత ప్రొప్రయిటర్ ఆమెను మళ్ళీ 'హోటల్ రూం'లో దిగబెట్టాడు.

"భోంచేస్తావా?" అడిగాడు.

తలూపింది ఆశా. "బాగా ఆకలిగా వుంది" అని చెప్పింది.

"రూమ్ నెంబర్ 372లో కారియర్ వుంది వెళ్ళి భోంచెయ్. అంటూ కోటు జేబులోంచి అయిదువంద నోట్లు తీసి ఆమె చేతిలో పెట్టాడు.

"వందేగా ఇవ్వాల్సింది? " నోట్లు లెక్క పెట్టుకుని అడిగిందామె.

"వంద నేనిచ్చింది. నాలుగువందలు అతనిచ్చాడు" ప్రొప్రయిటర్ చెప్పాడు.

అర్థం కాలేదు ఆశాకి.

"ఇందాకా 'బార్'లో నువ్వు కంపెనీ ఇచ్చావ్ చూడు. అతను నిన్ను కావాలనుకుంటున్నాడు. నీకిష్టమైతే వెళ్ళు. ఇష్టం లేకపోతే ఆ నాలుగొందలూ అతనికిచ్చేసి భోజనం చేసి వచ్చెయ్" అంటూ వెళ్ళిపోయాడు ప్రొప్రయిటర్.

ఆశా - రూం నెంబర్ 372లో అడుగుపెట్టింది. 'రూం'లో వున్న అతను చిరునవ్వుతో ఆమెకు స్వాగతం చెప్పాడు.

'పెళ్ళి - భర్త - సంసారం - పిల్లలు' అనే కలల కౌగిళ్ళలోంచి మరోసారి ముళ్ళబాటలోకి జారిపోయింది ఆశా.

"వెయ్యిరూపాయలకి రెండువేలు ఖరీదు చేసే ఆనందాన్నిచ్చావ్" అన్నాడు అతను.

"అంటే మీరు ప్రొప్రయిటర్‌కి వెయ్యి రూపాయలిచ్చారా?" అడిగిందామె.

"అవును నీ రేటు అదేనటగా?" ఆ మాటలు విన్న ఆశాకి ప్రొప్రయిటర్ పట్ల కోపం, అసహ్యం కలిగాయి. వందరూపాయల కోసం లేదా ఒకరోజు బతుకు కోసం ఒళ్ళు అమ్ముకునే తనకూ లక్షల్లో వ్యాపారం చేస్తూ కూడా తన ముష్టిలో కక్కుర్తి పడ్డ ఆ ప్రొప్రయిటర్‌కూ భేదం లేదనుకుంది.

"ఛీ.. దుర్మార్గుడు. మీ దగ్గర వెయ్యి తీసుకుని నా చేతిలో అయిదువందలు పెట్టాడు" చెప్పిందామె.

"అంటే ఇది నీకు కొత్తా?" అడిగాడతను.

ఔనని చెప్పింది.

"నాతో మదరాసు వస్తావా? నీకు సినిమాల్లో వేషం ఇస్తాను" అడిగాడు. తర్వాత ఆ ప్రశ్న ఏదో కొత్తగా ధ్వనించింది ఆమెకు. సినీమాల్లో వేషాలు వేసే తారలకు డబ్బు బాగా వస్తుందని ఆమెకు తెలుసు. చాలాసార్లు గంగాబాయి కంపెనీలో ఉండే అమ్మాయిలు చెప్పుకోవటం వింది కూడా.

"సినిమాల్లో వేషాలు వేస్తే డబ్బు బాగా ఇస్తారా?" అడిగింది అనుమానం తీర్చుకోటానికి.

"ఆహా! అదృష్టం బాగుంటే లక్షలొస్తాయి" చెప్పాడతను.

"నేను సినిమాల్లో బావుంటానా?"

"నువ్ 'ఊ' అన్నావంటే నిన్ను గొప్ప స్టార్‌ని చేస్తాను" మళ్ళీ ఆమె ముందు బంగారు స్వప్నం కనిపించింది.

"వైజయింతిమాల, హేమమాలిని నీకు తెలుసుగా నువ్వు కూడా వాళ్ళంతటిదానవవుతావ్. నేను తాగి చెప్పటం లేదు. నేను ఓ సినిమాని డైరెక్ట్ చేస్తున్నాను. అందులో 'డాన్సర్' కోసం బొంబాయినించి ఎవర్నైనా తీసుకెళ్ళాలని వచ్చాను. నువ్ నాతో వస్తే ముందు ఆ వేషం వేయచ్చు"

ఆశా మనసులో ఎన్నెన్నో ఆలోచనలు ఆ క్షణంలో చోటు చేసుకున్నాయి.

వెళ్ళటమా? మానటమా?

తీరా వెళ్ళాక ఇతను కూడా తనను మోసం చేస్తే?

అయినా ఫర్వాలేదు. తనిప్పుడు అన్నింటికి అలవాటు పడిపోయింది.

ముఖ్యంగా తనను అడ్డం పెట్టుకుని వ్యాపారం చేస్తున్న ఆ హోటల్ ప్రొప్రయిటర్‌కి తగిన బుద్ధి చెప్పాలి.

తన నిర్ణయాన్ని అతనికి చెప్పింది ఆశా. ఆ మర్నాడే హోటల్ ప్రొప్రయిటర్‌కి ఆశా కట్టాల్సిన బిల్లు కట్టేసి విమానంలో మద్రాసు తీసుకొచ్చాడు అతను విమానంలో కూర్చున్నంతసేపూ ఆశా ఆలోచనలు ఆకాశమంత ఎత్తులో విహరించాయి. తాను త్వరలోనే 'హేమామాలినిలా' 'వైజయంతిమాలలా' పెద్ద సినీస్టారు కాబోతోంది. లక్షల్లో డబ్బు సంపాదించబోతోంది. ఆ డబ్బంతా ఏం చేయాలి?

అలా రకరకాల ఆలోచనలు వాటిని అలాగే గుండెల్లో దాచుకుని మద్రాసు మహానగరంలో కాలుపెట్టింది ఆశా.

"ఈ క్షణం నుంచీ నీ పేరు యామిని" అన్నాడు అతను టాక్సీలో కూర్చున్న తర్వాత.

అతని పేరు మీకు చెప్పలేదు కదూ? అవసరమా? అయితే 'అశోక్' అనుకుందాం.

టాక్సీ - అడయార్‌లో వున్న ఓ హోటల్ ముందు ఆగింది.

"రెండు మూడురోజుల్లో షూటింగ్ వుంటుంది. సాయంత్రం నిన్ను చూట్టానికి మా ప్రొడ్యూసర్‌ని తీసుకొస్తాను. ప్రస్తుతం ఈ రెండువేలు అడ్వాన్స్‌గా వుంచు" అని ఓ నోట్ల కట్ట ఆమె చేతిలో పెట్టి - ఆమెను రూములో దిగబెట్టి వెళ్ళిపోయాడు అశోక్.

ఆ రాత్రి బాగా పొద్దుపోయాక ప్రొడ్యూసర్ని తీసుకొచ్చాడు అశోక్. "ఈవిడే యామిని తెలుగమ్మాయే. బొంబాయిలో వుంటూ సినీమాల్లో చిన్న చిన్న వేషాలు వేస్తోంది. మన పిక్చర్‌లో క్లబ్ డాన్సర్ బాగా సూటవుతుందనిపించింది" అంటూ యామిని ఆయనకు పరిచయం చేశాడు.

అంతవరకూ పీకల్దాకా 'స్కాచ్ విస్కీ' తాగొచ్చిన ప్రొడ్యూసరు ఆమెను పరిశీలనగా చూశాడు. నల్లపిల్లయినా - హోటల్ గదిలోని మెర్క్యూరీ దీపాల కాంతిలో ఆమె అజంతా శిల్పసుందరిలా కనిపించింది.

"ఇప్పటికి ఎన్ని సినిమాల్లో చేశావ్?" అడిగాడు. బదులు చెప్పలేక ఇబ్బందిగా చూసింది యామిని. పడగ్గదుల్లో విటుల పక్కన నటించటమే తెలుసు తప్ప వెండితెర మీద ఎప్పుడైనా అసలు కనిపిస్తే కదా - చెప్పటానికి?

ఆమె అవస్థ గమనించిన అశోక్ వెంటనే కలిపించుకుని ఆమెను ఆదుకున్నాడు.

"హిందీ ఫీల్డులో ఇంకా అవకాశాలు రాలేదు. మరాఠీ ఫిలిమ్స్ చేసింది. ఓ పిక్చరు సూపర్ హిట్టయిందికూడా! మంచి డాన్సరు. ఈ అమ్మాయి 'డాన్స్' ఒక్కటైనా లేకపోతే డిస్ట్రిబ్యూటర్లు కొనటంలేదు" హద్దూ పద్దూ లేకుండా అబద్ధం చెప్పేశాడు అశోక్. సినిమాల్లో తనకు అవకాశం రావటానికి అతనంతగా కృషి చేస్తున్నందుకు కృతజ్ఞతగా చూసింది యామిని.

"మనకిక్కడ జ్యోతిలక్ష్మి ఎట్టాగో మరాఠీలో ఈ పిల్ల అట్లా అన్నమాట" అన్నాడు తన తెలివికి తనే మురిసిపోతూ ప్రొడ్యూసరు.

"డాన్స్ డైరెక్టరు ఎలా చెపితే అలా చేయటానికి ఓకె. అంది. ఆ కండిషన్ మీదే తీసుకొచ్చాను" గొప్పగా చెప్పాడు అశోక్.

"మరి రెమ్యూనరేషన్ సంగతి మాట్లాడేవా?"

"అలాంటి విషయాలు మీరే చూసుకుంటారు గదా? రెండువేలు అడ్వాన్సు మాత్రం ఇచ్చాను. ఇక తక్కిన సంగతులు మీరూ ఆవిడా మాట్లాడుకోండి. నేను శెలవు తీసుకుంటాను" అంటూ అశోక్ నిష్క్రమించాడు.

ఆ రాత్రి యామినితో అన్ని విషయాలూ నిస్సంకోచంగా మాట్లాడేశాడు ప్రొడ్యూసరు. 'సెక్స్' వుట్టిపడే ఆమె కళ్ళూ కదలికలూ అతన్ని విపరీతంగా ఆకర్షించాయి.

"అక్కడ నీకు ఏం ఇస్తారు?" రెండు నిమిషాల తర్వాత ప్రశ్నించాడు.

"దేనికి?"

సినీమాలో నటించినందుకు రెమ్యూనరేషన్ ఏం తీసుకుంటుందో తెలుసుకోవాలని ప్రొడ్యూసరు ఉద్దేశ్యం.

ఐతే 'గుమ్మడికాయల దొంగ' అంటే భుజాలు తడుముకున్నట్టు పడక సుఖానికి ఎంత తిసుకుంటున్నదీ చెప్పమని ఆయన అడిగాడేమో అని యామిని భావించింది.

"అదే! మరాఠీ సినిమాల్లో వేషానికి ఎంతిస్తున్నారు నీకు?" ఈ సారి మరింత వివరంగా అదిగాడాయన.

ఎంత చేస్తే ఏం గొడవో అని కొంచెం తటపటాయించిందామె.

"ఒక్కొక్కరు ఒక్కో రేటిస్తారు" గోడమీద పిల్లి వాటంగా బదులిచ్చింది.

"ఇప్పుడు మా పిక్చర్‌లో 'క్లబ్ డాన్స్' ఒక్కటే. రెండు రోజుల్లో అయిపోతుంది. ఓ అయిదువేలిస్తాం. అన్నీ అందులోనే" చెప్పాడు ప్రొడ్యూసరు.

"అయిదువేలు" అనే మాట యామిని చెవులకు సుమధుర సంగీతంలా వినిపించింది.

ప్రతిరోజూ 'ఒళ్ళు హూనం' చేసుకుంటే మహా అయితే ఓ వెయ్యిరూపాయలు కళ్ళు చూసేది ఇదివరకు. అందులో ఓనరు గంగాబాయి దగ్గర్నించీ హోటల్ బోయ్ దిలీప్ వరకూ అందరికీ వాటాలు పంచిపెడితే తనకు మూడువందలు మిగిలేవి. అలాంటిది ఇప్పుడు కేవలం 'ఒళ్ళు' చూపిస్తే చాలు అయిదువేలు 'ఒళ్ళో' వచ్చి పడుతున్నాయి.

"తెలుగు ఇండస్ట్రీలో డాన్సర్లకు మంచి గిరాకీ వుంది. ఈ పిక్చర్లో నీ డాన్స్ క్లిక్ అయ్యిందటే నువ్వింక బొంబాయి వెళ్ళక్కర్లేదు. ప్రతి రోజూ పదివేలు ఈజీగా సంపాదించుకోవచ్చు" ఆలోచనలో పడిన యామినిని ఒప్పించే ప్రయత్నంలో ప్రొడ్యూసరు మళ్ళీ అన్నాడు.

"అలాగే సార్. మీ ఇష్టం. కానీ నాకు తెలుగు సినిమాల్లో డాన్స్ చేయటం అంటే అంతగా తెలీదు. కొత్తగా వుంటుంది" వచ్చే అవకాశం చేజారిపోతుందేమోనన్న భయంతో ముందు జాగ్రత్తగా చిన్న బాణం వేసింది యామిని.

"మరేం పరవాలేదు అదంతా మా డాన్స్ డైరెక్టర్ చూసుకుంటాడు కావాలంటే అతన్ని రెండు రోజులు నీ దగ్గరకు పంపుతాను, ముందుగానే నీ చేత గట్టిగా రిహార్సల్స్ చేయిస్తాడు" అంటూనే ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

ఇక బెట్టుచేస్తే బెడిసి కొడుతుదనుకుని అతనికి పూర్తిగా లొంగిపోయింది యామిని.

వారం రోజుల తర్వాత షూటింగ్ ప్రారంభమైంది.

క్లబ్ డాన్సరుగా యామిని ఆ పాత్రలో జీవించింది. సెన్సారు వారి కత్తెర పడకపోతే ఆ డాన్స్ తన చిత్రానికి బంగారు పంటవుతుందని భావించాడు నిర్మాత. అందుకోసమే ముందుగానే జాగ్రత్తలు తీసుకున్నాడు.

సినిమా విడుదలైంది. అందులోని యామిని డాన్స్ కుర్రవాళ్ళు, ముసలివాళ్ళు అనే భేదం లేకుండా మొత్తం పురుష ప్రపంచాన్నే ఓ ఊపు ఊపేసింది. ఆ సినిమా విడుదలై విజయవంతమైన నాలుగువారాల వ్యవధిలో యామినికి మరో నాలుగు ఆఫర్లు వచ్చాయి. రెమ్యూనరేషన్ పెరిగింది. అడ్వాన్సులు చేతిలో పడ్డాయి. అంతవరకూ అశోక్ ఆధీనంలో వుంటున్న యామిని అడయార్లో ఓ బంగళా అద్దెకు తీసుకుంది.

జీవితంలో సెక్సు చాలా ముఖ్యం. అవసరం కూడా. సినిమాలు జీవితంలో ఒక భాగమైపోతున్న ఈరోజుల్లో సినిమాలకు కూడా సెక్సు చాలా అవసరంగా మారిపోయింది.

సెక్సును ప్రేరేపించే దృశ్యాల్ని చూపించటం సెన్సార్ నిబంధనలు ప్రకారం నేరమవుతుంది. అయినా వస్త్ర సన్యాసంతోనూ అంగాంగ విన్యాసంతోనూ యువతరాన్ని రెచ్చగొట్టి వాళ్ళ బలహీనతల్ని సొమ్ము చేసుకునే ప్రయత్నాలు రానురాను ఎక్కువవుతున్నాయి.

కోటి రూపాయలు సినిమా నిర్మాణం కోసం ఖర్చు చేసేటప్పుడు మరో లక్షో రెండు లక్షలో విసిరేసి సెన్సారు వాళ్ళ కళ్ళు మూయచ్చుకదా అనే ధోరణి కొంతమంది నిర్మాతల్లో ఏర్పడుతోంది. ఫలితంగా బూతు మాటలే సినిమాలో సంభాషణలుగా పేలుతున్నాయి. శృంగార చేష్టలే స్క్రీన్ప్లేగా రూపుదిద్దుకుంటున్నాయి.

ఒకప్పుడు అయిదో పదో (వేలు) డాన్సర్కి రెమ్యునరేషన్ ఇచ్చి ఓ అర్ధనగ్న నృత్యం తప్పనిసరిగా చిత్రంలో చొప్పించేవారు. ఇప్పుడిప్పుడు ఆ ధోరణి కూడా మారిపోతోంది.

"ఎలాగూ లక్షల్లో రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తున్నారు కదా ఆ బాపతు సెక్సీ డాన్సులు లక్షణంగా హీరోయిన్లు చేతే ఎందుకు చేయించకూడదూ?" అనే ఆలోచన నిర్మాతల్లో కలుగుతోంది.

మొత్తం మీద సెక్స్ డాన్సర్గా పేరు తెచ్చుకున్న యామిని 'సెక్సీ బాంబ్'గా తెలుగు చిత్రపరిశ్రమలో స్థిరపడింది. అయిదువేల రూపాయలతో ఆరంభమైన రెమ్యునరేషన్ పదిహేను ఇరవై వేలకు చేరుకుంది. అంతవరకూ పరిశ్రమలో సెక్స్ తారలుగా వెండి తెరను ఏలుతున్న ఒకరిద్దరు తారలుగా మరుగున పడిపోయారు. ఒళ్ళూ, వయసూ పెరిగితే పెళ్ళికి కూడా కాకుండా పోతామేమోనన్న భయంతో దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న మాటకు కట్టుబడి రూపం వుండగానే తాళి కట్టించుకున్నారు కూడా.

ఇక ఇప్పుడు ప్రతి కదలికలోనూ, చూపులోనూ సెక్స్ ఉట్టిపడే యామిని కోసం నిర్మాతలు ఎగబడ్డారు. పత్రికలవారు ఆమె ఒంపుసొంపుల్ని ముఖచిత్రాలుగా ప్రచురించి సర్క్యులేషన్‌ని పెంచుకున్నారు. నిర్మాతల బాక్సాఫీస్ సూత్రానికి మినిమమ్ గ్యారంటీగా వినిపించే పేర్లలో యామిని పేరుకూడా చేరిపోయింది.

వాల్‌పోస్టర్ల మీద హీరో హీరోయిన్ల బొమ్మలతో పాటు యామిని నృత్యభంగిమ కూడా చోటు చేసుకోసాగింది.

ఎంత లావు గుమ్మడికాయ అయినా కత్తిపీటకు లోకువేకదా!

ఏలూరులో అంతకుముందు ఆమెను ఆదరించిన గంగాబాయితో పాటు ఆమెను అనుభవించిన రసిక శిఖామణులుకూడా యామిని ఇంట్లో మకాం పెట్టారు.

సినిమా పరిశ్రమలోకి వచ్చాక ఈ కొద్ది సంవత్సరాలలోనే లక్షలు సంపాదించిన యామిని గంగాబాయిని తనతో వుండమంది. రసిక శిఖామణులందరికీ తన పొందు ఎంత ఖరీదైందో వివరించింది. వాళ్ళంతా చివరకు నిరాశతో వెనుదిరిగారు.

ఓ రోజు పొద్దున్నే మదరాసు మెయిలు దిగిన మదనకామరాజు అడయార్‌లో యామిని వుంటున్న ఇలు వెతుక్కుంటూ వచ్చాడు. అప్పటికింకా యామిని నిద్రలేవలేదు. అయితే ఒకప్పుడెప్పుడో యామినిని పెళ్ళిచేసుకున్నవాడిగా మదనకామరాజుని గుర్తుపట్టిన గంగాబాయి అతన్ని సాదరంగా ఆహ్వానించి కాఫీ ఇచ్చింది.

అతను కాఫీ తాగుతూంటే నిద్రలేచి వచ్చింది యామిని, "మీ ఆయన వచ్చాడమ్మా!" అంది గంగాబాయి.

అతన్ని యామిని వెంటనే గుర్తుపట్టింది. క్షణంలో ఆమె ముఖకవళికలు మారిపోయాయి. ఒకప్పుడు పెళ్ళిచేసుకుని, బొంబాయి తీసుకెళ్ళి హోటల్లో వదిలేసి వెళ్ళిపోయిన అతనిపట్ల ఆమెకు అసహ్యం కలిగింది. అయినా కంట్రోల్ చేసుకుంటూ అడిగింది.

"ఇక్కడికెందుకొచ్చావ్? నేనిక్కడ వుంటున్నట్లు నీకెలా తెలిసింది?" అని.

"సినిమాతారల అడ్రస్సులు తెలుసుకోవటం కష్టమేం కాదుగా! ఇక ఎందుకొచ్చానంటే నీ మీద నాకు హక్కుంది కనక" చెప్పాడతను.

"నన్ను ఏనాడైతే మోసం చేసి బొంబాయి హోటల్లో వదిలేసి వెళ్ళిపోయావో ఆనాడే నా మీద నీకు ఎలాంటి హక్కూ లేకుండా పోయింది" కోపాన్ని నిగ్రహించుకుంటూ చెప్పింది యామిని.

"నేను ఆ రోజు వదిలేసి వెళ్ళిపోయిన మాట వాస్తవమే. పరిస్థితులు అలా వచ్చాయి. ఆ తర్వాత ఇరవై రోజులకు మళ్ళీ హోటల్‌కి వచ్చి నీ కోసం వాకబు చేశాను. నా తప్పు ఒప్పుకుని క్షమార్పణ కోరి నిన్ను నావెంట తీసుకెళ్ళాలనుకున్నాను. కానీ నువ్వు అక్కడ కనిపించలేదు" సంజాయిషీ ఇస్తున్న ధోరణిలో చెప్పాడు అతను.

"ఇప్పుడు ఇంతకాలం అయ్యాక నీ సంజాయిషీలు నేను వినదల్చుకోలేదు. నీకూ నాకూ ఎలాంటి సంబంధం లేదు. నువ్వు వెళ్ళచ్చు" అంటూ లేచింది యామిని.

అతను వెళ్ళలేదు. పైగా ఏమాత్రం బెదరలేదు. నెమ్మదిగా సిగరెట్టు వెలిగించుకున్నాడు. ఆ తర్వాత ఆమెను సమీపించి చెప్పాడు.

"మనది తెంచుకుంటే తెగిపోయే సంబంధం కాదు. మనిద్దరికీ పెళ్ళైయినట్టు నా దగ్గర సాక్ష్యాలున్నాయి. ఇపుడు నీ దగ్గరే వుంటున్న గంగాబాయి ఆనాడు నా దగ్గర పదివేలు తీసుకుని మన పెళ్ళికి ఒప్పుకున్నట్టు కోర్టులో సాక్ష్యం చెపుతుంది. అదీకాక నేనే ప్రెస్‌వాళ్ళనందర్నీ పిలిచి కథంతా చెపుతాను. ఏలూరులో నువ్వు గడించిన అనుభవాలన్నింటినీ కథలు గాథలు రాయిస్తాను."

ఆ హెచ్చరిక విన్న యామిని షాకైంది.

ఇపుడిపుడే పరిశ్రమలో తాను స్థిరపడుతోంది. క్లబ్ డాన్సర్ వేషాలనుంచి కంట్రీ గర్ల్ వేషాల స్థాయికి చేరుకుంది. ఒకపుడెపుడో తన ఒంపు సొంపులకి ఆరువందలు ఖరీదు కడితే ఇపుడు సినీతార ముద్రపడ్డాక ఆ ఖరీదు పదింతలు పెరిగింది. హఠాత్తుగా ఇపుడు

తనకు పెళ్ళయిన విషయం బయటపడితే పరిస్థితి అస్తవ్యస్తం అవుతుంది. పైగా సినిమా అవకాశాలు చేజారిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. అన్నీ ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది. అతనికి యాభైవేలు ఇచ్చి తామిద్దరికి ఎలాంటి సంబంధం లేదని కాగితం మీద రాయించుకుంది.

కేవలం అయిదు రోజుల్లో మళ్ళీ ఆ యాభైవేలూ సంపాదించగలిగింది.

అది వేరే విషయం.

ప్రస్తుతం నగ్నకళను ఆరాధిస్తే వయసున్నంతవరకూ తనకెవరూ పోటీ వుండరన్నది యామిని నమ్మకం, ఆ నమ్మకంతోనే ఆమె అన్నింటికీ తెగించి ముందడుగు వేస్తోంది.

నగ్నత్వానికీ, శృంగారానికీ ప్రాంతీయ భేదాలు లేవు కనుక అన్ని భాషల్లోనూ ఆమె నటిస్తోంది.

'అలాంటి నటనవల్ల మీకు ఆత్మసంతృప్తి కలుగుతుందా?' అని ఎవరైనా అడిగితే

'జీవితమే ఒక నాటకం. ఆ జీవిత నాటకంలో అందరి పాత్రలు పవిత్రంగా ఉండవుకదా?' అని తేలిగ్గా కొట్టిపారేస్తుంది యామిని.

## *మొగుడిచ్చే డబ్బుకాదు - మనసిచ్చే మొగుడు కావాలి!*

**మనిషి జీవితంలో ఆడవాళ్ళకైనా** మగవాళ్ళకైనా పెళ్ళి ఓ మహత్తరమైన మలుపు.

'పెళ్ళంటే మూడు ముళ్ళుకాదు, నూరేళ్ళ పంట' అన్నారు పెద్దలు.

'పెళ్ళి చేసుకుని ఇల్లు చూసుకుని చల్లగా కాలం గడపాలోయ్ మీరెల్లరు హాయిగా వుండాలోయ్' అని అప్పుడెప్పుడో ఓ సీనియర్ కవిగారి సినీమా పాటలో పల్లవించారు. నిజమే.

ప్రతి మనిషి జీవితంలోనూ పెళ్ళి అనేది ఓ గొప్ప థ్రిల్లు. పెళ్ళిపీటలపై కూర్చున్న దంపతుల కళ్ళల్లో అద్భుతమైన మెరుపేదో కనిపిస్తుంది. భర్త తన మెడలో తాళి కడుతూంటే భార్య పులకించిపోతుంది. మెరిసిపోయే ఆవిడగారికి కళ్ళల్లోకి ఆనందభాష్పాలు కూడా ఉబికి వస్తాయి. తన జీవితానికి ఓ గౌరవం, ఓ పెద్దరికం, ఓ పరిపూర్ణత ఇత్యాదులన్నీ వచ్చినట్టు గర్వంతో పొంగిపోతుంది. అసలు ఆడపిల్లకి పెళ్ళి కాగానే నూటికి డెబ్బై అయిదు మార్కులు సిద్ధించినట్టవుతుందని ఈ మధ్య ఓ సినీమాలో కూడా శలవిచ్చారు. అలాగే, శోభనం గదిలోకి మొదటి రాత్రి వెండి గ్లాసుతో పాలు తీసుకొచ్చే భార్యను చూసిన భర్తగారి మనసు నిండా మధురమైన అనుభూతి నిండిపోతుంది.

పెళ్ళయ్యాక కొద్దిరోజులపాటు భర్త తన ఉద్యోగానికి శలవు పెట్టేస్తాడు. భార్యామణి కూడా ఉద్యోగస్తురాలైతే ఆమె చేత కూడా శలవు పెటిస్తాడు. ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో రెండు బెర్తులుండే కూపేలో రిజర్వేషన్ చేయించుకుని హనీమూన్ పేరుతో హాయిగా తిరుగుతారు.

దార్లో ఎక్కడైనా భార్య అరికాల్లో ముల్లు గుచ్చుకుంటే రక్తం రాకపోయినా సరే స్పెషలిస్టు దగ్గరకు తీసుకెళ్ళి టెటనస్ ఇంజక్షన్ ఇప్పించి డ్రస్సింగ్ చేయిస్తాడు భర్త. మంచం దిగద్దని మందలిస్తాడు. మాటిమాటికి 'ఇప్పుడెలా వుంది?' అని ప్రశ్నల వర్షం కురిపిస్తాడు.

"ఆ దేవుడెంత నిర్దయుడు? ఆ గుచ్చుకునే ముల్లేదో నీ లేత తమలపాకులాంటి అరికాలికే గుచ్చుకునేలా చేయాలా? నాకు గుచ్చుకోకూడదూ?" అంటూ భార్య ఒడిలో తలపెట్టుకుని కన్నీరు కూడా పెట్టుకుంటాడు.

తన పట్ల భర్తకున్న ప్రేమానురాగాలకు ఆమె కరిగిపోయి అతని కౌగిట్లో ముద్దయిపోతుంది.

"అయ్యో! ఈ మాత్రానికే అంత బాధపడతారెందుకండీ?" అంటూ తన చీర చెంగుతో అతని కన్నీళ్ళు తుడుస్తుంది.

కానీ ఇలా ఎంతకాలం సాగుతుందంటారు?

కొద్దివారాలు, కాకపోతే మరికొద్ది నెలలు, అంతే! ఆ తర్వాత వారిద్దరిమధ్యా ఇదే పద్ధతిలో డైలాగులు కొనసాగవు. కొనసాగితే అది జీవితం కాదు.

రోజులు గడుస్తున్న కొద్దీ జీవితంలో మార్పులొస్తాయి. దిన చర్యల్లో మార్పులొస్తాయి. ఆఖరికి పిలుపుల్లో కూడా తేడాలొస్తాయి.

'ప్రేయసీ! డియర్' లాంటి సంబోధనల స్థానంలో 'ఏమేవ్.. ఒసే' అనే పిలుపులు చోటు చేసుకుంటాయి.

పెళ్ళయిన తొలిరోజుల్లో భార్య కాలిలో ముల్లు గుచ్చుకుంటేనే అల్లాడిపోయిన మొగుడు ఆ తర్వాతెప్పుడో -

"ఏవండీ కూర తరుగుతూంటే వేలు తెగిందండీ" అని భార్య రక్తం ఓడుతున్న వేలితో ముందుకు వస్తే -

చదువుతున్న పేపర్లోంచి దృష్టిని కూడా మరల్చకుండా -

"తెగింది వేలేకదా! కాలు తెగినంత ఖంగారు పెడతావేమిటి? కాస్తంత కాఫీ పొడుం అద్దుకో.. రక్తం కట్టేస్తుంది" అంటాడు భర్త. ఏతావాతా చెప్పొచ్చేదేమిటంటే -

'పెళ్ళంటే ఓ మహత్తరమైన మలుపు, పెళ్ళంటే మూడు ముళ్ళుకాదు, నూరేళ్ళ పంట' వంటి స్లోగన్స్‌లో పూర్తి యదార్థం వుండదుగాక వుండదని. అవన్నీ పెళ్ళికి ముందు, అబ్బాయిల్నీ, అమ్మాయిల్నీ పడగొట్టే బంధాలు.

పెళ్ళి చేసుకుని ఇల్లు చూసుకుని ఎల్లకాలం చల్లగ కాపురం చేద్దామనుకుంటే అది సాధ్యపడే విషయం కాదు.

ముఖ్యంగా సినీతారల విషయంలో, నూటికి తొంభై మంది విషయంలో వంటిమీదకు వచ్చిపడే వయస్సుని కూడా 'మేకప్' వెనకాల దాచేసుకుంటూ - పెళ్ళి ప్రస్తావన తెస్తే దాటేసుకుంటూ దీపం వుండగా ఇల్లు చక్కపెట్టుకోవాలన్నట్టుగా గ్లామర్ వుండగా వేషాలు లెఖ్ఖ పెట్టుకుంటారు చాలామంది హీరోయిన్లు.

తమిళ చిత్రరంగంలో తొలి అడుగువేసి, మళయాళంలో మరో అడుగు ముందుకు నడిచి తెలుగు సినీపరిశ్రమలో స్థిరపడిన 'కాంతి' కూడా సరిగ్గా అలాగే అనుకుంది.

తల్లితండ్రులు - పెళ్ళిచేసుకొమ్మని సంబంధాలు తెచ్చి ఒత్తిడి చేస్తే వద్దని వారిస్తూ వాయిదాలు వేసింది. తన జీవితం మీద పెళ్ళి అనే ముద్రపడితే సినిమా ఛాన్సులు తగ్గిపోతాయని భావించింది.

"నిర్మాతలయినా, దర్శకులయినా పెళ్ళికాని హీరోయిన్లకే అవకాశాలు ఇస్తుంటారు. అలాంటి వాళ్ళనే కోరుకుంటారు" అనేది కాంతి అనుభవపూర్వకంగా తెలుసుకున్న నిజం.

కాంతి ఒకప్పుడు అంటే సుమారు ఇరవై సంవత్సరాల క్రితం చాలా అందంగా వుండేది. పాలరాతి శిల్పంలా మెరిసిపోయే సౌందర్యంతో చూపరుల్ని కట్టిపారేసేది. శృంగార కవుల ముందు ఆమెను నిలబెడితే ఆమె సౌందర్యం వాళ్ళచేత ప్రబంధాలను రాయించగలిగేది.

తిరువేంద్రం కాలేజీలో చదువుకునే రోజుల్లో ప్రతి ఏడూ కాంతినే కాలేజీ బ్యూటీగా ఎన్నుకునేవారు. ఓ స్వచ్ఛంద సంస్థవారు నిర్వహించిన అందాల పోటీలో కూడా ఆమె బహుమతి పొందింది. కాలేజీ వార్షికోత్సవాల సందర్భంగా ఏర్పాటైన సాంస్కృతిక కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొనటానికి వచ్చిన ప్రముఖ తమిళ సినిమా దర్శకుని దృష్టిని కాంతి అందచందాలు అతుక్కుపోయాయి.

"పిక్చర్‌లో యాక్ట్ చేస్తావా?" అని అడిగాడు.

"మా పేరెంట్స్‌ని అడగాలి" అని చెప్పింది.

మర్నాడు పొద్దున్నే ఆ దర్శకుడు కాంతి పేరెంట్స్‌ని కలుసుకున్నాడు. తాను తీస్తున్న సినిమాలో ఓ ముఖ్య వేషానికి కాంతిని తీసుకోదల్చుకున్నట్టు చెప్పాడు.

కాంతి తల్లిదండ్రులు ఆలోచనలో పడ్డారు. మరికొద్ది నెలల్లో ఫైనల్ పరీక్ష రాయగానే ఆమెకు పెళ్ళిచేయాలన్న సంకల్పంతో సంబంధాలు కూడా చూస్తున్నారు. ఆ విషయాన్నే దర్శకుడికి చెప్పారు.

"అప్పుడే పెళ్ళికి తొందరేమిటండీ? ఇంకా చిన్న పిల్ల. ఇప్పుడు పిక్చర్‌లో ఈ వేషం చేస్తే కాంతికి మంచి పేరొస్తుంది. బోలెడన్ని ఆఫర్స్ కూడా రావచ్చు. నాలుగైదేళ్ళలో పేరూ డబ్బూ కూడా సంపాదించుకోవచ్చు. అప్పుడు గొప్ప గొప్ప వాళ్ళే మీ అమ్మాయిని చేసుకుంటామని మీ వీధి గుమ్మంలోకి వచ్చి క్యూలో నిలబడతారు" అంటూ నచ్చచెప్పాడు దర్శకుడు.

షూటింగ్ అయినంతకాలం తాము కూడా తమ కూతురుతోనే వుండే షరతు మీద వాళ్ళు అంగీకరించారు.

ఆ విధంగా 1975లో తొలిసారిగా వెండితెరకు తన కాంతుల్ని పంచిపెట్టింది కాంతి.

ఆమె నటించిన తొలి చిత్రం విజయవంతమైంది. ఆమె ఎన్నో సినిమా పత్రికలకు ముఖచిత్ర సుందరైంది. కొన్ని ప్రముఖ పత్రికల్లో ఆమెను ఇంటర్వ్యూ చేయటం కూడా జరిగింది. తమిళంతోపాటు అటు మళయాళంలోనూ ఇటు తెలుగులోనూ కూడా ఆమెకు ఆఫర్లొచ్చాయి. ఓ ఏడాదిపాటు ఆమెతో ఆమె తల్లి కూడా షూటింగులకు వెడుతూండేది. ఆ తర్వాత తల్లికి అనారోగ్యం చేయటంతో కాంతి ఒక్కత్తే షూటింగులకు హాజరయ్యేది.

'ఒంటరిగా ఉన్నావంటే వంటికి మంచిదికాదు' అన్నారు కదా! అది ఆమె పట్ల నిజమైంది.

షూటింగ్ అయిపోయాక ఆమెను కలుసుకునేందుకు ఆయా చిత్రనిర్మాతలూ దర్శకులూ హోటల్ రూమ్‌కి వచ్చేవారు. ఆమెతో సరదాగా కాలక్షేపం చేసేవారు. ఆమె భవిష్యత్తు మీద ఎన్నో ఆశలు కల్పించేవారు. ఆ పైన తమ కోరికను వ్యక్తం చేసేవారు.

"ఒక్కసారి వాళ్ళ కోరిక తీరిస్తే ఎన్నో మెట్లు మనం పైకి వెళ్ళచ్చు" అనే ఆలోచన ఆమెను బలహీన పరిచింది. అంతే.

ఆ ఆలోచన కలిగిన కొంత కాలానికే తెరమీద ఎలాంటి పాత్రలు పోషించినా ఖరీదైన హోటల్ గదుల్లో ఆమె శృంగార నాయికగా మారిపోయింది. డబ్బూ పేరు వచ్చేసరికి తనను కోరుకున్న వారితోగాక తను కోరుకునే వాళ్ళతో జీవితాన్ని ఎంజాయ్ చేయటం నేర్చుకుంది కాంతి.

కేవలం ఏడెనిమిదేళ్ళ వ్యవధిలో సినీతారగా మంచి పేరు తెచ్చుకుంది. ఆర్థికంగా అంతో ఇంతో వెనకేసుకుంది. అమ్మకీ, నాన్నకీ తిరువేంద్రంలో ఇల్లు కట్టించింది. తన కోసం మెడ్రాస్‌లో మరో ఇల్లు కొనుక్కుంది.

అప్పటికి పాతికేళ్ళ వయసు దాటిపోయింది.

జీవితంలో శృంగారాన్ని అనుభవించటం వేరు. దాంపత్య జీవితాన్ని ఎంజాయ్ చేయటం వేరు.

దాంపత్య జీవితాన్ని కొనసాగించటంలో ఓ పరిపూర్ణత వుంటుంది. తన భర్త, తన పిల్లలు, తన ఇల్లు - అలా అనుకోవటంలో ఓ అద్భుతమైన అనుభూతి వుంటుంది.

అందుకే ఓసారి అమ్మానాన్న పెళ్ళి ప్రస్తావన తెస్తే "మీ ఇష్టం" అంది కాంతి.

ఆమెకు ఇష్టమైన వరుడితోనే పెళ్ళి జరిపించారు తల్లితండ్రులు.

అబ్బాయి పేరు ఆనందన్, ఆరడుగుల అందగాడు. మదరాస్ కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం చేసుకుంటున్నాడు.

"నీ సినిమాలు చాలా చూశాను. నీ నటనంటే నాకు చాలా ఇష్టం" అన్నాడు ఆనందన్ తొలిరాత్రి తన కౌగిట్లో చేరిన కాంతితో.

"థాంక్స్" అంది కాంతి అతని గుండెల్లో ఒదిగిపోతూ. "నీ నటన తెరమీద వరకే పరిమితమై వుండాలి. జీవితంలో మాత్రం నటించకూడదు. ముఖ్యంగా నా దగ్గర" అన్నాడతను తర్వాత.

ఆమె అదోరకంగా అతనివైపు చూసింది.

"నామీద అనుమానమా?" అడిగింది కాంతి.

"అలా అయితే పెళ్ళే చేసుకోనుగదా? అయినా నీ గతంతో నాకు పనిలేదని మరోసారి చెబుతున్నాను. నువ్ సినిమాల్లో యాక్ట్ చెయ్యకుండా వుంటే మంచిది. ఒకవేళ నువ్వు చేస్తానన్నా నాకు అభ్యంతరం లేదు. కానీ ప్రతి సినిమాకీ నా పర్మిషన్ తీసుకోవాలి. నీకు నువ్వుగా నిర్ణయాలు తీసుకోకూడదు" చెప్పాడు ఆనందన్.

ఆ రాత్రి చాలాసేపు నిద్రకు దూరమై ఆలోచనల్లో పడింది కాంతి.

"పెళ్ళి చేసుకుని పొరపాటు చేశానా?" అనుకుంది.

"నా కాళ్ళకు నేనే బంధాలు వేసుకున్నానా?" అని బాధపడింది.

ఓ వారం రోజుల తర్వాత పత్రికల వాళ్ళు ఫోన్ చేసి ఆమెకు శుభాకాంక్షలు తెలియచేశారు.

"వివాహం చేసుకుని దాంపత్య జీవితంలో స్థిరపడ్డారు కదా! మరి మీరు సినిమాల్లో నటించటం మానేస్తారా?" అని అడిగారు.

"ఇంకా నిర్ణయం తీసుకోలేదు. త్వరలోనే మిమ్మల్నందర్నీ పిలిచి నా నిర్ణయాన్ని తెలియజేస్తాను" అని బదులిచ్చింది కాంతి.

ఆ రాత్రే భర్తకు విషయం చెప్పి "వాళ్ళకి ఏం చెప్పమంటారు?" అని అడిగింది.

"నాకు ఇష్టం లేదని ముందే చెప్పాను. నీ ఆస్తంతా నా పేరున రాసి ఆ తర్వాత కావాలంటే సినిమాల్లో నటించు" అన్నాడు ఆనందన్. కాంతి దిగ్భ్రాంతిగా భర్తవైపు చూసింది.

ఆనందన్ చూపుల్లో ఎలాంటి ప్రత్యేకతా లేదు. భార్యకు ఆజ్ఞలు జారీ చేసే అతి సాధారణమైన భర్తలాగే కనిపించాడు.

"తాను అనుకున్నదేమిటి? జరుగుతున్నదేమిటి? ఇందుకేనా తాను పెళ్ళిచేసుకున్నది?"

తన స్వేచ్ఛను వదులుకుని తన లక్ష్యానికి తిలోదకాలిచ్చి చాలామంది సగటు ఆడపిల్లల్లా మొగుడి అడుగులకు మడుగులొత్తుతూ అతని ఆజ్ఞల్ని శిరోధార్యంగా భావిస్తూ వంటింటి కుందేలులాగా, పిల్లల్ని కనే యంత్రంలాగా బతకటానికేనా అతన్ని భర్తగా కట్టుకున్నది? అలా ఆలోచిస్తున్న కాంతి కళ్ళముందు అప్రయత్నంగా గతంలో జరిగిన సంఘటనలు కదిలాయి.

ఆ రోజు తన పుట్టినరోజు..

ఉదయాన్నే లేచి స్నానం చేసింది. వినాయకుని కోవెలకు వెళ్ళి అర్చన చేయించింది. తన పుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్నదానం చేయించమని గుళ్ళో వెయ్యిరూపాయలు చందా కట్టింది. తాను సినీనటిగా గుర్తింపు తెచ్చుకున్నప్పటి నుంచీ ప్రతి ఏడూ పుట్టిన రోజు పండుగ వైభవంగానే జరుపుకుంటోంది. ముఖ్యంగా తనకు అవకాశాలిస్తున్న నిర్మాతల్నీ, ప్రోత్సహిస్తున్న దర్శకుల్నీ, తోటినటీనటుల్నీ, పత్రికావిలేఖరుల్నీ అందర్నీ పిలిచి సాయంత్రం పూట పార్టీ కూడా ఇస్తోంది.

ఆరోజు కూడా అక్కడి ఓ ఫైవ్‌స్టార్ హోటల్లో పార్టీ ఏర్పాటు చేసింది.

"ఇవాళ సాయంత్రం పార్టీకి ఓ ముఖ్యమైన వ్యక్తికూడా వస్తాడమ్మా" అన్నాడు తన తండ్రి.

తనకు వెంటనే ఆ మాటలోని అంతరార్థం స్ఫురించలేదు.

"ఆనందన్ అని మనకు దూరపు బంధువు. మంచి పొజిషన్‌లో వున్నాడు. నువ్వంటే అతను చాలా ఇష్టపడుతున్నాడు. వచ్చే నెలలో మీకు పెళ్ళి చేయాలనుకుంటున్నాను" మళ్ళీ వెంటనే వివరంగా చెప్పాడు తండ్రి.

ఆ క్షణం వరకూ తను పెళ్ళి గురించి ఆలోచించలేదు.

"ఇప్పుడిప్పుడే ఇండస్ట్రీలో స్థిరపడుతున్నాను. తెలుగులో కూడా మంచి వేషాలు వస్తున్నాయి. ఇలాంటి సమయంలో నేను పెళ్ళి చేసుకుని భర్త - పిల్లలు అనుకుంటే నా భవిష్యత్తు ఏం కావాలి?" అని ప్రశ్నించింది తను.

"పెళ్ళి చేసుకున్నంత మాత్రాన సినిమాలు వదులుకోవాలని ఎక్కడుంది? పైగా అతను నిన్నూ నీ యాక్టింగ్‌నీ మెచ్చుకుని మరీ కోరుకుంటున్నాడు. సినిమాలు ఎల్లకాలమూ వుండవు. జీవితాంతం తోడుగా వుండాల్సింది భర్తా పిల్లలే. కాళ్ళ దగ్గరకు వచ్చిన అవకాశం జారవిడుచుకుంటే ముందు ముందు పరిస్థితులు ఎలా వుంటాయో? అన్నీ ఆలోచించే చెప్తున్నాను. ముందు అబ్బాయిని చూడు. అతను నచ్చితేనే నీ నిర్ణయాన్ని తెలియచెయ్యి. కానీ పెళ్ళి మాత్రం ఆడదానికి జీవతావసరమని మర్చిపోకు."

అంతగా ఆయన చెప్పడంతో తాను కాదనలేకపోయింది.

"అలాగే అతను నచ్చితే పెళ్ళిచేసుకుంటాను. కానీ ఒక్క షరతు. నా సినిమా జీవితానికి అడ్డుపడకూడదు" అంది తను.

"అతనికి ఆ సంగతి నేను ఖచ్చితంగా చెప్తాను" అన్నాడు తండ్రి.

ఆ సాయంత్రం పార్టీకి ఆనందన్ వచ్చాడు. అతన్ని తండ్రి తనకు పరిచయం చేశాడు.

"మీరేం చేస్తూంటారు?" అడిగింది తను.

"లెక్చరర్ని. ఎకనామిక్స్ లెక్చరర్ని" చెప్పాడు.

అర్థశాస్త్రాన్ని చదివిన అతగాడు అర్ధాంగిని బాగా అర్థం చేసుకోగలడన్న నమ్మకం కలిగింది ఆమెకు. తన అంగీకారాన్ని తండ్రికి తెలియచేసింది. పార్టీకి హాజరైన వారికందరికీ తాను కొద్దిరోజుల్లోనే పెళ్ళి చేసుకోబోతున్న శుభవార్త చెప్పింది. తనకు కాబోయే భర్తను అందరికీ పరిచయం చేసింది. అందరూ తనకు గ్రీటింగ్స్ చెప్పారు.

పార్టీ పూర్తయిన తరువాత తను అతనితో మురుగేశన్ ఆలయానికి వెళ్ళింది. ఆ స్వామి సన్నిధిలో తన వేలినున్న ఉంగరాన్ని తీసి ఆమె వేలికి తొడిగాడు అతను.

ఆలయం నుంచి ఇద్దరూ బీచ్‌కి వెళ్ళారు.అక్కడ రాత్రి పదకొండయ్యేదాకా ఎన్నో కబుర్లు కలబోసుకున్నారు.

అప్పటినుంచీ దాదాపు ప్రతిరోజూ ఏదో ఒక సమయంలో అతను తనను కలుసుకుంటూనే వుండేవాడు.

ఇంక నాలుగురోజుల్లో పెళ్ళి ముహూర్తం.

"ఇవాళ మనిద్దరం సరదాగా గడుపుదాం" అని అతను పొద్దున్న అయిదింటికే ఫోన్ చేశాడు.

"ఇవాళ షూటింగుందే!" చెప్పింది.

"నా కోసం కేన్సిల్ చేసుకోలేవా?"

రెండు క్షణాలు ఆలోచనలో పడింది తను.

"మరేం ఫరవాలేదు. కేన్సిల్ చేసుకో. నాకు తెలుసు. నువ్వు నా మాటను కాదనవని" మళ్ళీ అతనన్నాడు.

"సరే షూటింగ్‌కి వెళ్ళి ఓ గంటలో వచ్చేస్తాను. పదింటికి కలుద్దాం" చెప్పింది తను ఒక నిర్ణయానికి వచ్చి.

అన్నట్టుగానే పదిగంటలకు అతను తనకోసం ఇంటికొచ్చి వెయిట్ చేస్తున్నాడు.

"నిన్ను అబ్బాయి షాపింగ్‌కి తీసుకెడదామని వచ్చాడమ్మా. వెళ్ళిరా" అన్నాడు తండ్రి.

ముందుగా తనను సిల్క్ ఎంపోరియానికి తీసుకెళ్ళాడు.

"నా తొలి ప్రజంటేషన్‌గా ఓ చీర కొంటాను" అన్నాడు. ఎనిమిదివందలు పెట్టి చీర తీసుకున్నాడు ఆనందన్.

"ఇప్పుడు మా ఇంటికి వెడుతున్నాం" అన్నాడు కారులో కూర్చున్న తర్వాత. తను అభ్యంతరం చెప్పలేదు.

మరికాసేపట్లోనే కారు అతని ఇంటి దగ్గర ఆగింది.

"కుడికాలు ముందుగా పెట్టు" ఆమె చేయి పట్టుకుని చిరునవ్వుతో అన్నాడతను.

అంతకుముందు చాలా సినిమాల్లో తను అలాంటి సన్నివేశాల్లో నటించింది. కానీ.

ఆ క్షణం మాత్రం జీవితంలో అలాంటి సన్నివేశం నిజంగా ఎదురైనప్పుడు ఒళ్ళంతా ఎందుకో చెమటలు పోశాయి.

ఏదో సరికొత్త ప్రపంచంలో అడుగు పెడుతున్న అనుభూతికి లోనైంది తను.

ఇల్లంతా నిర్మానుష్యంగా వుంది.

"ఇంట్లో ఎవరూ లేరా?" అనుమానంగా అడిగింది.

"లేరు కనుకనే ఈరోజు సరదాగా నీతో గడపాలనుకున్నాను. మనిద్దరం హాయిగా మనసులు విప్పి మాట్లాడుకోవచ్చు" అన్నాడు.

తన ఇల్లంతా చూపించాడు. తన తండ్రి తిరుచునాపల్లిలో పనిచేస్తూంటాడనీ, తల్లిమాత్రం తనతో వుంటూ అపుడపుడూ తిరుచునాపల్లి వెళ్ళి వస్తూంటుందనీ చెప్పాడు. అంతకుముందు రోజే ఆవిడ ఊరు వెళ్ళిందనీ, పెళ్ళి ముహూర్తం నాటికి తండ్రితో వస్తుందనీ కూడా తెలియచేశాడు.

"నేనిలా చొరవ చేసి ఎవరూ లేనప్పుడు మా ఇంటికి తీసుకొచ్చానని భయపడుతున్నావా?" ప్రశ్నించాడు తర్వాత.

తనేమీ బదులు చెప్పలేదు.

"కాబోయే భర్తనికదా! ఆ మాత్రం చొరవచేస్తే తప్పులేదేమోనని తీసుకొచ్చాను" అంటూ చొరవగానే తనను కౌగిలిలోకి తీసుకున్నాడు.

తను వారించలేకపోయింది.

"కొత్తచీర కట్టుకుని చూపించవూ?" లాలనగా అడిగాడు.

తను ఆ ముచ్చట తీర్చింది. కొత్తచీర కట్టుకొచ్చి అతని పాదాలు తాకి నమస్కారం కూడా చేసింది.

"నో! నో! ఇలాంటి పద్ధతులు నాకు నచ్చవ్. నువ్వు చదువుకున్న పిల్లవి. పైగా పెద్ద సినిమాతారవి. ఇలాంటి పనులు చేయకూడదు" అంటూ తనను మరింత దగ్గరగా తీసుకుని నుదుటి మీద ముద్దుపెట్టుకున్నాడు.

తను పరవశించిపోయింది. అతను నిగ్రహించుకోలేకపోయాడు.

"చీర నలిగిపోతుంది" అతని బాహువుల్లోంచి విడిపించుకునే ప్రయత్నం చేస్తూ అంది తను.

"నా చీరకదా ఫరవాలేదు" అన్నాడు అతను అన్నాడు అతను కొంటెగా.

అతను ఆ తర్వాత ఏం చేసినా తను వారించలేకపోయింది.

"నువ్వంటే నాకు చాలా ఇష్టం. కలల్లోకి కూడా వస్తుంటావ్ తెలుసా?" అన్నాడతను తర్వాత.

"ఇవాళ పక్కలోకి వచ్చాను కదా?" రేగిపోయిన జుట్టును దువ్వి జడ అల్లుకుంటూ చెప్పింది చిరునవ్వుతో.

"నేను సినిమాల్లో నటించటం మీకు అభ్యంతరం లేదుగా?" తను అడిగింది.

"నువ్వు సినిమాల్లో నటించటం వల్లనేకదా నేను నీ ఆరాధకుకుణ్ణి అయ్యాను." అన్నాడతను.

మరి..!!??

'ఆనాడు అలా చెప్పిన మనిషి ఇపుడు ఇలా అంటున్నాడేమిటి తన ఆస్తినంతా అతని పేర రాసి ఆ తర్వాత కావాలంటే సినిమాల్లో నటించాలా?'

"అంటే... అంటే మీరు నన్ను పెళ్ళి చేసుకున్నది నా ఆస్థికోసం అన్నమాట" అంది కాంతి రోషంతో.

"ఆస్తీ ఐశ్వర్యాలపట్ల నాకెపుడూ మోజు లేదు. మనం ఉండటానికి మంచి ఇల్లుంది. మన కుటుంబం జీవించటానికి చాలినంత జీతం నాకు వస్తుంది. ఇంకా కావాలంటే ట్యూషన్స్ చెప్పుకోవచ్చు. నువ్వు కూడా చాలా సినిమాల్లో యాక్ట్ చేసి పేరూ, డబ్బూ సంపాదించుకున్నావ్. ఇక ఆ రకం జీవితానికి గుడ్‌బై చెబితే బావుంటుంది" ఆనందన్ దృఢంగా అన్నాడు.

'ముందు మీ పర్మిషన్ తీసుకుని యాక్ట్ చేయచ్చునన్నారు. నేను సినిమాల్లో నటిస్తూండటం వల్లనే నా ఆరాధకులయ్యారన్నారు. ఇప్పుడేమో ఆ రకం జీవితానికి గుడ్‌బై చెప్పమంటున్నారు. అసలు 'ఆ రకం' అంటే మీ ఉద్దేశ్యం ఏమిటి?'' వస్తున్న కోపాన్ని అణచుకుంటూ ఆవేశంగానే ప్రశ్నించింది.

''కూల్ డౌన్ ఆవేశం అనర్ధాలకు దారితీస్తుంది. సినీతారల గురించి ముఖ్యంగా లేడీస్ గురించి నలుగురూ నాలుగు రకాలుగా చెప్పుకుంటూంటారు. నీ గురించి ఎవరూ అలా చెప్పుకోవటం నేను భరించలేను. అందుకే నువ్ ఇక సినిమాలకై గుడ్‌బై చెపితే బావుంటుందన్న నిర్ణయానికి వచ్చాను. మా అమ్మకూడా ఆ మాటే అంది'' చెప్పాడతను. కాంతి అతనివైపు నిర్జీవంగా చూసింది.

ఎన్నో సినిమాల్లో ధైర్యసాహసాలుగల యువతిగా నటించిన కాంతి ఆ క్షణంలో అబలగా, బేలగా మారిపోయింది.

పెళ్ళయిన తర్వాత ఆమె జీవితంలో తొమ్మిదోరాత్రి.

భర్త బాహువుల్లో బందీగా పరవశించవలసిన కాంతి, భవిష్యత్తుని తల్చుకుని భయంతో వణికిపోయింది. ఆ రాత్రి నిద్రపట్టకుండానే తెల్లవారిపోయింది.

తెల్లవారిన తర్వాత ఆమె ఒక నిర్ణయానికి వచ్చింది. పత్రికల వారికందరికీ ఫోన్ చేసి ఆ సాయంత్రం ప్రెస్ కాన్ఫరెన్స్‌కి ఆహ్వానించింది.

''మావారు చదువుకున్నవారు, సంస్కారవంతులు. నేనంటే ఆయనకు ప్రాణం. నేను సినిమాల్లో నటిస్తే ఆయనకు ఎలాంటి అభ్యంతరం వుండదన్నారు'' అని ప్రకటించింది.

మర్నాడు పేపర్లలో వచ్చిన ఆ వార్త చదివి ఆనందన్ మండిపడ్డాడు.

''నా మాట కాదని సినిమాల్లో నటిస్తే విడాకులిస్తాను'' అన్నాడు అక్కడితో అతను ఊరుకోలేదు.

''నేను నా భార్యకు సినిమాల్లో నటించటానికి అంగీకారం తెల్పలేదు.'' అంటూ పత్రికలవాళ్ళకు తెలియచేశాడు.

పత్రికలవారికీ, పరిశ్రమలవారికీ ఇదో చర్చనీయాంశంగా మారింది. ఆ పరిస్థితుల్లో కాంతికి సినిమా అవకాశాలు కూడా తగ్గిపోయాయి. మానసికంగా ఆమె క్రుంగిపోయింది.

''మావారు మా మంచివారు. నా జీవితాన్ని ఎలా కావాలంటే అలా మలుచుకోమంటున్నారు. 'ఆల్ దట్ క్రెడిట్ గోస్ టు మైహస్బండ్'' అంటూ స్టేట్‌మెంట్లిచ్చిన కాంతి సిగ్గుతో, అవమానభారంతో తలవంచుకుంది.

ఆ అవమానాలు భరిస్తూ తాళికట్టిన భర్తను గౌరవించటానికి ప్రయత్నిస్తూ కాలం గడుపుతోంది. కానీ బీటలువారిన అద్దాన్ని అతికించటం ఎవరి తరం? కలతలు రేగిన కాపురం కూడా బీటలు వారిన అద్దంలాంటిదే.

సంసారం అనే నాణేనికి 'పెళ్ళి - ప్రేమా' అనేవి బొమ్మా బొరుసులు. ఈ రెండూ పటిష్టంగా వుంటే ఆ సంసారం హాయిగా వుంటుంది. ఆ వివాహబంధం స్థిరంగా వుంటుంది. లేదంటే ఆ బతుకు చెల్లని రూపాయిలా చెదిరిపోతుంది.

ఏ భార్యకయినా సినీతారకయినా.

మొగుడిచ్చే డబ్బు కాదు ముఖ్యం.

మనసిచ్చే మొగుడు దొరకటం ముఖ్యం

ఎవరు ఏ వృత్తిలో వున్నా, భార్యాభర్తలన్నాక ఒకరినొకరు అర్థం చేసుకుని ఒకరిమీద మరొకరు గౌరవాన్ని వుంచుకుని, నమ్మకాన్ని పెంచుకోవటం అన్నింటికంటే ముఖ్యం.

# గాంధీగారి దేశంలో గజానికో గాంధారి కొడుకుంటే...!

**ఫోను రింగయింది.**

"హలో" అన్నాను రిసీవర్ ఎత్తి.

"హలో..నేనేనండీ" అవతల్నించి గొంతు వినిపించింది. ఆ గొంతు గుర్తుపట్టి - 'హలో - నమస్తే' అన్నాను.

"ఓసారి మా ఆఫీసుకి రాగలరా?" అడిగారాయన.

"అలాగే" రిసీవర్ పెట్టేశాను.

ఆ తర్వాత ఓ గంటకు 'సితార' ఆఫీసు చేరుకున్నాను.

"మీ కోసమే ఎదురు చూస్తున్నాను" అంటూ ఆహ్వానించారు అసోసియేట్ ఎడిటర్.

"ఇది చూడండి" నేను కూర్చున్న తర్వాత బల్లమీద వున్న ఓ కవరు తీసి నా చేతికి అందించారాయన.

"ఏమిటిది?" అదిగాను.

"డియర్ సితార శీర్షికలో ప్రచురించమని రాశారెవరో. చూడండి" కవరులో వున్న కాగితం బయటకు తీసి చదివాను.

"సితార ఎడిటర్ గారికి నమస్కారములు. మీ పత్రికలో వారం వారం వస్తున్న 'వెండి తెర సాక్షిగా' చదువుతున్నాను. చాలా ఆసక్తిదాయకంగా నడుస్తోంది. అందులో పరిశోధకుడు చెప్పినట్టుగా 'మంజులత'లాంటివారు ఎందరో వున్నారు. వెండితెర జిలుగు వెలుగుల్లో ఓ వెలుగు వెలగాలన్న తాపత్రయంతో పడరాని పాట్లు పడిన సోదరీమణులు ఎంతోమంది చీకటి జీవితాలు గడుపుతున్న మాట యదార్థం. మీరు చెప్పినట్లుగా సినిమాల్లో చేరాలనుకోవటం, అందుకు ఆశపడటం 'మత్తు'తో కూడినవే. అదొక కలల ప్రపంచం. ఆ కలల ప్రపంచంలో కాలు పెట్టి జారిపోయి కల చెదిరిపోయి, తమ జీవితాన్ని నాశనం చేసుకునే ఇడపడుచులు మన చుట్టూ ఎందరో వున్నారు. వారి బతుకులి వెలుగులోకి తెచ్చి మరెవరూ ఊబిలో కూరుకుపోకుండా జాగ్రత్తపడేందుకు ఈ శీర్షిక ద్వారా అవసరమైన సలహాలు అంద చేస్తున్న మీకు తోటి సోదరీమణుల పక్షాన కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

"ఇలాంటి శీర్షికను అయిదేళ్ళ క్రితమే ప్రచురించి వుంటే - నా బ్రతుకు ముళ్ళబాట అయ్యేది కాదు. నా గురించిన వివరాలు 'వెండితెరసాక్షిగా' శీర్షికలో రాస్తే స్వార్థపరుల ప్రలోభాలకు లొంగిపోయి తమ జీవితాల్ని చేజేతులా నరక ప్రాయం చేసుకునే నాబోటి అక్కలకూ చెల్లెళ్ళకూ - మేలుకొలుపుగా వుంటుంది. నా అడ్రస్ క్రింద రాస్తున్నాను.

**ఇట్లు**

**శోభ.**

ఉత్తరంలో క్రింది భాగాన వున్న అడ్రస్ వైపు ఆసక్తిగా చూశాను.

అది హైదరాబాదు అడ్రస్. నా కళ్ళు సంతృప్తితో మెరిసాయి. వెండి తెరమీదకు ఎక్కి వెలలేని సంపాదనని వేనోళ్ళ పొగడ్తల్నీ పొందాలని ఆశపడే అమ్మాయిలకు ఆ వెండితెర వెలుగుల వెనుక ఎంతటి గాఢాంధకారం వ్యాపించి వుంటుందో తెలియ చెప్పాలని 'సితార'తో కలసి చేస్తున్న చిన్ని ప్రయత్నానికి ఎటువంటి ప్రతిస్పందన కలుగుతోందో గమనించిన నాకు ఎంతో ఆనందం కలిగింది. నిజానికి సినీమారంగం మంచిదికాదని చెప్పటం కానీ - ఇక్కడంతా చీకటే చోటు చేసుకుంటుందని చెప్పడం కానీ మా వుద్దేశ్యం కానేకాదు. ఇందులో అప్పుడప్పుడు అక్కడక్కడ ఎదురయ్యే ఎత్తుపల్లాల గురించీ తగిలే ఎదురు దెబ్బల గురించీ సినీమాల్లో చేరాలనుకుని ఆశతో పరుగెత్తుకొచ్చే అమ్మాయిలకూ, అబ్బాయిలకూ - ఒక చిన్న 'హెచ్చరిక'లా తెలియ చెప్పాలనే నా ప్రయత్నం.

"ఈ ఉత్తరం 'సితారలో' ప్రచురిస్తారా?" అని అడిగాను.

ఉత్తరం ప్రచురించటం ఎందుకూ? ఏకంగా ఆమె ఇంటర్వ్యూ వేద్దాం. మీరు వెళ్ళి ఇంటర్వ్యూ చేయండి" అన్నారు అసోసియేట్ ఎడిటర్.

మర్నాడు సాయంత్రం మూడు గంటలకు లెటర్‌లో ఆమె రాసిన అడ్రస్ ప్రకారం బాలానగర్ బయలుదేరాను. డోర్ నంబర్లు ఒక వరుస క్రమంలో లేకపోవటం వల్ల ఇల్లు పట్టుకోవటం కొంచెం కష్టమైంది.

నాలుగు వీధులు తిరిగిన తర్వాత ఒక చోట నాకు కావలసిన ఇంటి నంబరు కనిపించింది. అదొక చిన్న డాబా ఇల్లు. చుట్టూ కాంపౌండ్ వాల్ గేటు తీసుకుని లోపలకు అడుగుపెట్టాను.

ఇరుపక్కలా రంగు రంగుల గులాబీ పూల మొక్కలు కనిపించాయి. ఎదురుగా వరండాలో ఓ మధ్య వయస్కురాలు కాఫీ తాగుతూ కూర్చుంది.

"నమస్తే!" తటపటాయించి చూస్తూ "విష్" చేశాను. ఆమె పరిస్థితి కూడా నాలాగే వుంది.

"శోభగారంటే"

ఆమె ముఖకవళికలు ఇట్టే మారిపోయాయి

"దేనికి?" కసురుతున్నట్టుగా అడిగింది.

"సితార పత్రిక నించి వచ్చాను. ఇంటర్వ్యూ చేసి పత్రికలో రాద్దామని."

"అక్కర్లేదు. మీరు వెళ్ళొచ్చు" కటువుగా అన్నదామె.

అంటే ఆమె శోభ కాదన్న సంగతి అర్ధమైంది.

"ఇంతకీ శోభంటే!? "ఎవరో తెలుసుకోవాలన్న నా కుతూహలం కొద్దీ అడిగాను.

"మా అమ్మాయే! జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు మళ్ళీ ఇంటర్వ్యూలూ ఫోటోలు అంటూ గడచిపోయిన పీడకలను గుర్తు చేయకండి" అంటూ ఇక మాట్లాడేదేమీ లేదన్నట్టు కుర్చీలోంచి విసురుగా లేచి ఇంట్లోకి నడవబోయిందామె.

"శోభగారే రమ్మని ఉత్తరం రాశారు మేడం" అన్నాను.

ఆమె చటుక్కున ఆగిపోయిది. ఈలోగా నా జేబులో వున్న ఉత్తరం తీసి ఆమె చేతికి అందించాను. దాన్ని గబగబా చదివించి ఆమె.

"ఏం ప్రశ్నలడుగుతారు?" ఉత్తరాన్ని మడతపెట్టి నా చేతికి తిరిగి ఇచ్చేస్తూ అడిగింది.

"ఇంకా నిర్ణయించుకోలేదు. అసలు శోభగారు ఏం చెప్పదల్చుకున్నారో విన్న తర్వాత మేం అడగవలసినవి ఏవైనా వుంటే అడుగుతాం."

"సరే.. మా గురించి ఇష్టం వచ్చినట్టు రాయకండి. మర్యాదగా బ్రతుకుతున్నవాళ్ళం. మా పరువు తీసింది చాలక. ఇంకా వివరాలు కూడా చెప్తుందట మహాతల్లి.. రండి" అని విసుక్కుంటూ లోపలకు నడిచిందామె.

నేను ఆమెను అనుసరించాను.

ఇద్దరం ఎడం పక్కనే వున్న ఓ గదిలోకి వెళ్ళాం.

"కూర్చోండి కాఫీ తీసుకొస్తాను" ఓ కుర్చీని మంచం దగ్గరగా లాగి వెళ్ళిపోయిందామె.

మంచం మీద పడుకుని రేడియో వింటున్న వ్యక్తిని చూసి షాకయ్యాను. చూడగానే భయం కలిగించేలా వుంది ఆమె ఆకారం. చేతులూ, కుడిచెంప, మెడ క్రింద భాగం కాలిపోయినట్టుగా కనిపిస్తోంది. జుట్టు కూడా ఒక వైపు లేకపోవటం వల్ల వికృతంగా వుంది.

"మీరేనా శోభగారు?" అడిగాను - మరేం అడగాలో తెలియక.

"అవును.. మీరు..?"

"సితారకి మీరు రాసిన ఉత్తరం చూసి - మిమ్మల్ని ఇంటర్వ్యూ చేద్దామని వచ్చాను" కుర్చీలో కూర్చుంటూ చెప్పాను.

ఆమె ఉత్సాహంగా లేచి కూర్చుంది.

"అంటే 'వెండితెర సాక్షి'గా రాస్తున్నది మీరేనా?" అడిగింది.

"అవును.."

"మిమ్మల్ని కలవటం నాకు సంతోషంగా వుంది. నా వుత్తరం చూసి నా కథ తెలుసుకునేందుకు వస్తారని అనుకున్నాను. కానీ ఇంత తొందరగా వస్తారని అనుకోలేదు" రేడియో ఆఫ్ చేసి - పక్కనే వున్న బల్లమీద పెట్టింది.

నేను ఆమెవైపు అలాగే తదేకంగా చూస్తున్నాను. మహావుంటే ఆమెకు పాతికేళ్ళు వుండచ్చు. ముఖం వికారంగా వున్నా కళ్ళు మాత్రం చాలా అందంగా మెరిసిపోతూ కనిపిస్తున్నాయి. పాలమీగడలాంటి శరీరచ్ఛాయ.

అంతటి అందమైన పిల్లకు - వళ్ళెలా కాలిందో? "ఏమిటలా ఆలోచిస్తున్నారు? నన్నూ, నా రూపాన్నీ చూసి భయపడుతున్నారా?" అడిగింది చిరునవ్వుతో.

"అదికాదు. మీకీ ప్రమాదం ఎలా సంభవించి వుంటుందా అని ఆలోచిస్తున్నాను."

"ఖర్మ!" అదే నవ్వు.

ఆ నవ్వు వెనకాల అంతర్లీనంగా విషాదపు ధ్వనులేవో వినిపించాయి.

"మీ ఉత్తరాన్ని బట్టి చూస్తే మీరు అయిదేళ్ళ క్రితం ఎప్పుడో సినీమాల్లో చేరాలనుకున్నట్టూ, ఆ ప్రయత్నంలో మోసపోయినట్టూ అర్థమవుతోంది" అన్నాను.

"నిజమే చాలా దారుణంగా మోసపోయాను. నాలాంటిది అసలు బతక్కూడదు. కానీ దేవుడు చాలా గొప్పవాడుకదండీ. ఎవర్నెందుకు ఈ భూమ్మీద వుండిపొమ్మంటాడో, ఎవర్ని తొందరగా తన దగ్గరకు రమ్మంటాడో ఎవరూ చెప్పలేరు" మరో కుర్చీని నా దగ్గరకు లాక్కుని కూర్చుంటూ చెప్పింది.

"మీరు చదువుకున్నారా?" ఆ ప్రశ్న అడగటం అనవసరమని తెలిసి కూడా ఎందుకు అడిగానో నాకే తెలీదు.

ఆ ఇంటినీ ఇంట్లో వాతావరణాన్ని గమనించి చూస్తే ఆ కుటుంబం 'అబౌవ్ మిడిల్ క్లాస్' అని ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. అటువంటి కుటుంబానికి చెందిన ఆడపిల్ల చదువుకోకుండా ఎలా వుంటుంది?

"బి.ఎస్సీ పాసయ్యాను సార్. డాన్స్ నేర్చుకున్నాను" చెప్పింది శోభ. సరిగ్గా అదే సమయంలో శోభ తల్లి కాఫీ తెచ్చి మా ఇద్దరికీ ఇచ్చింది.

"సినీమా పిచ్చిలోపడి బంగారంలాంటి భవిష్యత్తును నాశనం చేసుకుంది. చివరికిలా ప్రాణం మీదకి తెచ్చుకుని వీధి మొహం చూడకుండా చీకట్లో బతుకుతోంది. ఇంకా పేపర్లో రాసి దాని బతుకు రచ్చకెందుకీడుస్తారూ? అలా వదిలేయండి బాబూ?" అంది ఆవిడ.

నేను ఏం మాట్లాడాలో తెలియక ఇబ్బంది పడ్డాను. "నేను నీకు కన్నబిడ్డను కనుక నీ దృష్టిలో బతికున్నాను. కానీ నా దృష్టిలో, లోకం దృష్టిలో నేను ఎప్పుడో చచ్చిపోయానమ్మా! నాకు ఎందుకీ గతి పట్టిందో. నాలాగా తొందరపాటుతో అడ్డమైన గాడిదల్నీ నమ్మి మోసపోకుండా వుండేందుకు అందరూ తెలుసుకోవాలి" ఆవేశంగా అంది శోభ. ఆవిడ మరేమీ మాట్లాడకుండా గదిలోంచి బయటకు వెళ్ళిపోయింది.

"క్షమించాలి. మా అమ్మా, నేనూ రోజూ ఇలా దేనికో ఒకందుకు మాటా మాటా అనుకుంటూనే వుంటాంలెండి. మీరేమీ అనుకోకండి. మా అమ్మకి నేనంటే ప్రాణం. నేను ఎందుకూ పనికిరానని తెలిసినా లక్షరూపాయలు ఖర్చు పెట్టి నన్ను బతికించుకుంది. అయినా నన్ను చూసి అపుడపుడూ గుండెలు పగిలేలా ఏడుస్తూంటుంది. నేనిలా బతికుండి ఏడిపిస్తున్నానా అనుకుంటూంటాను. చచ్చిపోతే ఒక్కసారే ఏడుస్తారు. తర్వాత కొంత కాలానికి మర్చిపోతారు. కానీ బతికుంటే రోజూ ఇదే వరుస."

ఆమె అలా వరస పెట్టి మాట్లాడేస్తోంది. నాకు అసలు విషయం ఏమిటో స్పష్టంగా అర్థం కావటంలేదు.

"ఇంతకీ మీరు సినిమాల్లో వేషాలు వేశారా?" టాపిక్‌ని డైవర్ట్ చేయాలన్న ఉద్దేశంతో అడిగాను. "ఉండండి" అంటూ లేచి గోడవారగా వున్న బీరువాలోంచి ఓ ఆల్బం నాకు అందించింది. ఆత్రుత కొద్దీ పేజీలు తిరగేశాను. అవన్నీ శోభ తాలుకు ఫోటోలే. కొన్ని ఫోటోలు డాన్స్ భంగిమల్లో వున్నాయి. మరికొన్ని ప్రముఖులైన సినీమా తారలతోనూ, దర్శకులతోనూ తీయించుకున్నవి.

నేను ఒక్కటొక్కటే ఆల్బంలో ఫోటోలు చూస్తూంటే అవి ఏ సందర్భంలో తీయించుకున్నదీ వివరించింది.

చివర్లో ఒక ఫోటోపై నా దృష్టి నిలిచింది.

అందులో వున్న ఓ నలభై ఏళ్ళ యువకుడు శోభ భుజం మీద చేయి వేసి నిలబడ్డాడు.

"ఎవరితను?" అని అడిగాను.

"ఎవరీయన?" అని అడిగి వుండాల్సిందని వెంటనే అనుకున్నాను.

"నా జీవితాన్ని సర్వనాశనం చేసిన బ్రోకరు వాడే" పళ్ళు పిండుకుంటూ చెప్పింది శోభ.

నాకు కొంత అర్థమైంది అసలు విషయం. ఫోటోలో వ్యక్తిని 'ఎవరీయన' అని సంబోధించినందుకు క్షణం ముందు నొచ్చుకున్న మనసు ఆమె చెప్పింది విన్నాక కొంచెం తేలికపడినట్లయింది.

ఆమె అసలు విషయంలోకి వస్తోందని గ్రహించాను. నా హేండ్‌బ్యాగ్‌లో వున్న నోట్ పుస్తకం, బాల్ పెన్నూ తీసుకున్నాను.

"ముందు మీ ఫాదర్ పేరు చెప్తారా?" అడిగాను నోట్ బుక్ తెరచి రాసుకునేందుకు ఉద్యుక్తుణ్ణి అవుతూ.

"సారీ! వాళ్ళ గురించి ఏమీ అడక్కండి. ఇలాంటి పాపిష్టి దాన్ని ఇంకా నెత్తిన పెట్టుకుని గౌరవిస్తున్న వాళ్ళు, నిజంగా దేవతలు. వాళ్ళ గురించి కొందరికి ఎలాగూ తెలుసు. లోకానికంతటికీ తెలియటం నాకు ఇష్టం లేదు. అంచేత వాళ్ళ గురించి వదిలేసి నా గురించి వివరాలు చెప్తాను. రాసుకోండి" అందామె.

నేను ఆసక్తిగా ఆమె వైపు చూశాను. ఆమె చెప్పటం ప్రారంభించింది.

"మా నాన్నగారు సెంట్రల్ గవర్నమెంటు ఎంప్లాయి. మా మమ్మీ కూడా చదువుకున్నవారే. ఒకప్పుడు ఉద్యోగం కూడా చేసేవారు. తర్వాత మానేశారట. నాకు ఓ చెల్లెలూ, తమ్ముడూ వున్నారు. పదో ఏటనించీ మమ్మీ నాకు 'డాన్స్' నేర్పించింది. ఆల్బంలో ఫోటోలు చూశారుగా. అందులో ఎక్కువగా నేను 'డాన్స్ ప్రోగ్రామ్స్' ఇస్తున్నపుడు తీసినవే. కాలేజీలో బి.ఎస్సీ చదివేటప్పుడు - ఓసారి యానివర్సిరీకి నేను 'ఇందిరాగాంధీ' మోనో యాక్షన్ కూడా చేశాను. నేను ఫైనలియర్ చదువుతూండగానే మా మమ్మీ, నాన్నగారు నాకు పెళ్ళి సంబంధాలు చూడటం ప్రారంభించారు. బెంగుళూరు నుంచీ ఓ సంబంధం వచ్చింది. అబ్బాయి ఎయిరిండియాలో పని చేస్తున్నాడు. అతనికి నేను నచ్చాను. కట్నం కానుకలు లేకుండా నన్ను చేసుకోవటానికి అంగీకరించాడు."

"ఆ అబ్బాయి మీకు నచ్చాడా?" మధ్యలో కల్పించుకుంటూ అడిగాను నేను.

"ఊఁ! బాగానే వున్నాడు. కానీ నా అంత తెలుపు కాదనుకుంటాను. నా పరీక్షలు అయిన తర్వాత ముహూర్తం పెట్టిస్తానన్నారు మా నాన్నగారు. తర్వాత అపుడపుడు బెంగుళూరు నించి అతను నాకు ఉత్తరాలు రాస్తూండేవాడు. నేను ఎప్పుడైనా జవాబు రాసేదాన్ని.

"ఓసారి మా ఫాదర్ ఫ్రెండు ఒకాయన - ఏదో పని మీద మా ఇంటికొచ్చారు. అప్పుడు నేను హాల్లోనే ఏదో చదువుకుంటున్నాను. నన్ను చూసి "ఈ అమ్మాయి నీ కూతురే కదూ?" అని అడిగారాయన. నన్ను ఆయనకు పరిచయం చేశారు నాన్నగారు.

"టీవీలో యాక్ట్‌చేస్తావా?" అని అడిగారాయన. నేను నాన్నగారి వైపు చూశాను. ఓసారి టీవీలో నా చేత 'డాన్స్' ప్రోగ్రాం ఇప్పించాలని మా నాన్నగారు చాలా ప్రయత్నాలు చేశారు. కానీ వీలుపడలేదు. ఇప్పుడు అవకాశం దానంతట అదే వచ్చింది. మా నాన్నగారి ఫ్రెండు టీవీలో ఏదో సీరియల్ తీస్తున్నట్టూ అందులో హీరోయిన్ వేషం నా చేత వేయదల్చుకున్నట్టూ చెప్పారు.

"మా నాన్నగారు ఆలోచనలో పడ్డారు. అంతలో ఆయన మళ్ళీ నా వేషం గురించి మరింత వివరంగా చెప్పారు. పదమూడు వారాలపాటు సీరియల్ వస్తుందనీ - నాకు మంచి పేరొస్తుందనీ కూడా చెప్పారు. మమ్మీని పిలిచి విషయాన్ని వివరించారు నాన్నగారు.

"ఓ మూల పరీక్షలు దగ్గరపడుతున్నాయి. ఇప్పుడు ఇవన్నీ ఎందుకు?" అంది మమ్మీ.

"మరేం ఫరవాలేదమ్మా! నెలకు వారం రోజుల చొప్పున రెండు నెలలు. మొత్తం పదిహేను రోజులు పనుంటుంది అంతే. చదువుకీ కాలేజీకి ఎలాంటి ఇబ్బందీ లేకుండా నేను అరేంజ్ చేసుకుంటాను" అని ఆయన హామీ ఇచ్చారు. చివరకు అమ్మా నాన్నా సరే అన్నారు.

"మరి మీకు ఇష్టం లేదా?" అడిగాను నేను మళ్ళీ కల్పించుకుంటూ.

"నాకూ ఇష్టమే. కానీ వాళ్ళ ఇష్టం ముఖ్యం కదా?" అంది శోభ.

"ఊఁ తర్వాతేమయింది?" అడిగాను.

"ఆ తర్వాత ఇరవై రోజులకే షూటింగ్ ప్రారంభమైంది. నాతోబాటు షూటింగ్‌కి మొదట్లో మా మమ్మీ వస్తూండేది. తర్వాత అప్పుడప్పుడు మా సిస్టర్ వచ్చేది. షూటింగ్ అయిన నెలరోజులకే టీవీలో సీరియల్ మొదలైంది. నన్ను అందరూ పొగట్టం ప్రారంభించారు ముఖ్యంగా మా కాలేజీలో ఫ్రెండ్స్ నన్ను 'ప్రత్యేకం'గా చూస్తూంటే నాకు అదోలా వుండేది. ఓసారి మా ప్రిన్సిపాల్ కూడా పిలిచి నన్నెంతో మెచ్చుకుంది.

"అలా నాకు మంచి పేరు, గుర్తింపూ రావటంతో ఇంకా ఇంకా ఎక్కువ సీరియల్స్‌లో నటించాలన్న కోరిక పెరగసాగింది. అప్పట్లో మా ఇంటికి ఎవరెవరో వచ్చి - వాళ్ళు తీసే 'సింగిల్ ఎపిసోడ్స్'లో వేషం వెయ్యమని అడిగేవారు.

"..అప్పుడప్పుడు మమ్మీకి నాన్నగారికీ చెప్పి పర్మిషన్ తీసుకున్నా. తర్వాత తర్వాత వాళ్ళకు చెప్పకుండానే నేను ఒప్పేసుకునేదాన్ని.

"ఓసారి ఓ సింగిల్ ఎపిసోడ్‌లో వేషం వెయ్యటానికి నన్ను నర్సాపురం రమ్మన్నారు. నాతో తమ్ముణ్ణి సాయంపంపించింది మా అమ్మ. రాత్రి షూటింగ్ పదకొండు గంటలకు పూర్తయ్యాక నన్ను కార్లో హైదరాబాదు పంపించారు. నాతోబాటు మేకప్‌మేన్ శంకర్ కూడా అదే కార్లో వచ్చాడు. మాటల సందర్భంలో అతను తనకు చాలామంది సినిమా డైరక్టర్లు తెలుసుననీ - నేను 'ఊఁ..' అంటే వాళ్ళకు పరిచయం చేసి నన్ను 'సినీమా హీరోయిన్'ని చేస్తాననీ చెప్పాడు."

శోభ చెప్పటం ఆపి క్షణం సేపు కళ్ళు మూసుకుంది "మీరు 'ఊఁ..' అనలేదా?" అడిగాను వెంటనే.

ఆమె దిగులుగా చూసి నవ్వుతూ చెప్పింది.

"అనకపోతే బావుండేది. నాకివాళ ఈ గతిపట్టేదికాదు. ఆనాడే పెళ్ళి చేసుకుని హాయిగా ఏ బెంగుళూరులోనే ఉండేదాన్ని"

"మరి" ఆ తర్వాత ఏం జరిగిందో చెప్పమన్నట్టుగా చూశాను.

"అప్పటికే గ్లామర్ ప్రపంచం తాలూకు బలహీనత ఏదో నాలో ఆవహించింది. టీవీ తెరమీద కనిపిస్తేనే నన్ను ఎంతోమంది 'ప్రత్యేకం'గా చూడటం, నాకేదో కొత్తరకం గౌరవాన్ని ఇవ్వటం చూసి గర్వపడేదాన్ని. 'అదే సినీమా తెరమీద కనిపిస్తే?' ఒక్కసారిగా నా

ఒళ్ళు గగుర్పొడిచింది. నా మీద నాకే నమ్మకం పెరిగిపోయింది. అవకాశం రావాలేగానీ తప్పకుండా 'హీరోయిన్' అయిపోగలనన్న విశ్వాసం కలిగింది."

"అశోకా హోటల్లో నాకు తెలిసిన డైరెక్టరొకాయన వున్నాడు. నువ్వు 'ఊఁ..' అంటే రేపు అతనికి పరిచయం చేస్తాను' అన్నాడు శంకర్ మళ్ళీ నేను సరేనన్నాను.

మర్నాడు శంకర్ నన్ను ఆ డైరెక్టర్‌కి పరిచయం చేశాడు. అప్పట్లో ఆయన డైరక్ట్ చేస్తున్న చిత్రంలో ఓ చిన్న వేషం వుందనీ ప్రస్తుతానికి ఆ వేషం చేస్తే నెక్స్ట్ పిక్చర్లో హీరోయిన్ వేషం ఇస్తాననీ చెప్పాడాయన. నాకు ఎగిరి గంతేయాలనిపించింది.

తన స్కూటరు మీదనన్ను మళ్ళీ ఇంటి దగ్గర డ్రాప్ చేస్తూ మధ్యలో ఇందిరాపార్క్‌కి తీసుకెళ్ళాడు శంకర్.

"ఇక్కడికెందుకు తీసుకొచ్చావ్?" అని అడిగాను.

"సినీమాల్లో వేషం ఇప్పించాను. కనీసం అయిస్క్రీం కూడా ఇప్పించవా?" అని అడిగాడు శంకర్.

"రేపు స్వీట్స్ కొనిస్తానుగా" అని సమాధానం చెప్పాను.

"రేపటి పని ఇవాళే చెయ్యాలి. ఇవాల్టిపని ఇప్పుడే చెయ్యాలి అనేది నా సిద్ధాంతం, నువ్వు అంటే నాకు చాలా ఇష్టం. అందుకే నీకీ సహాయం చేశాను. ఇప్పుడు 'ఐస్క్రీం' కూడా నేనే ఇప్పిస్తాను. పార్కులో ఓ అరగంట కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ 'ఐస్క్రీం' తినేసి వెళ్ళిపోదాం" అంటూ నా సమాధానం కోసం చూడకుండా పార్కులోకి దారితీశాడతను.

"..ఐస్క్రీం తింటూ కబుర్లలో పడ్డాం. నేను చాలా బాగుంటాననీ - మేకప్ చేస్తే నా 'ఫేస్' హీరోయిన్‌లా 'మౌల్డ్' అవుతుందనీ - నన్ను ములగ చెట్టు ఎక్కించాడు శంకర్.

"మద్రాసులో తనకు తెలిసిన పెద్ద డైరక్టర్లు చాలామంది వున్నారు. వాళ్ళకు కూడా పరిచయం చేస్తాననీ చెప్పాడు. నిజంగానే నేనంటే అతనికి అభిమానమని గ్రహించాను. అందుకే అతనేం చెప్పినా సరేనన్నాను. పదిరోజులు గడిచిపోయాక - ఓరోజు సాయంత్రం అతను మా ఇంటికొచ్చాడు. ఏదో టెలీఫిలింలో చిన్న వేషం చేయాలి రమ్మన్నాడు. "ఇంత సడెన్‌గా చెపితే ఎలా? ఇంట్లో ఎవరూ లేరే సాయం పంపిద్దామంటే" అంది మమ్మీ.

"అదేమిటి ఆంటీ అలా అంటారు. నేను లేనా? నేను స్వయంగా తీసుకెళ్ళి మళ్ళీ షూటింగ్ పూర్తికాగానే దగ్గరుండి తీసుకొస్తానుగా!" శంకర్.

"మమ్మీ సరేనంది. నేను అతని వెంట బయల్దేరాను. తిన్నగా అతను నన్ను ఓ పెద్ద హోటల్‌కి తీసుకెళ్ళాడు. ఏదో డ్రింక్ ఆర్డరిచ్చాడు. 'షూటింగ్ అని చెప్పి ఇక్కడికి తీసుకొచ్చావేమిటి?' అని అడిగాను.

'ఇక్కడికని చెపితే మీ వాళ్ళు పంపరని' అన్నాడు.

'నాకు సినిమాలో మంచి వేషం వచ్చే ఛాన్స్ వుందనీ, మర్నాడెవరో డైరక్టరుకు నన్ను పరిచయం చేయబోతున్నాననీ చెప్పాడు. అంతలో కుర్రాడు డ్రింక్స్ తెచ్చి పెట్టాడు. నేను సందేహించాను. ప్రమాదం ఏమీ రాదు. తాగు' అన్నాడు. మామూలు కూల్ డ్రింక్ తెప్పిస్తే తాగుతానన్నాను. అతను వినలేదు. అదికూడా అలాంటిదే అన్నాడు. పైగా పెద్ద పెద్ద హీరోయిన్లంతా రాత్రిళ్ళు తాగితే తప్ప నిద్రపోరని చెప్పాడు. చివరకు నేను తాగకపోతే తను కూడా తాగనని మొండికేశాడు. అలా లొంగిపోయాను.

"ఓ గంట హోటల్లో కబుర్లు చెప్పుకున్నాం. తర్వాత నన్ను బంజారాహిల్స్‌లో వున్న హోటల్‌కి తీసుకెళ్ళాడు. నాకేం అర్థంకాలేదు. తన పేర రూమ్ తీసుకున్నాడు" చెప్పటం ఆపి నావైపు చూసింది శోభ.

"ఊఁ చెప్పండి" ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ అడిగాను.

తర్వాత జరిగిందేమిటో మీరు ఊహించగలరుగా. మీరు 'వెండితెర సాక్షి'గాలో రాసిన చాలా మంది అమ్మాయిలు మోసపోయినట్టే నేనూ మోసపోయాను. కల్లబొల్లి కబుర్లు చెప్పి డ్రింక్ మత్తులో వున నన్ను నాశనం చేశాడు. నేను ఏడ్చాను. "అన్నీ మన మంచికే" అన్నాడు. తాను ఆ పాపం చేసినందుకు పరిహారంగా నన్ను తప్పనిసరిగా పెద్ద హీరోయిన్‌ని చేస్తానన్నాడు. ఎన్నో సినిమాలకు తాను 'మేకప్‌మాన్'గా పనిచేస్తున్నట్టూ ఇండస్ట్రీలో తనకెంతో పలుకుబడి వున్నట్టూ చెప్పాడు. ఆ మాటలన్ని నమ్మేశాను. "

"మర్నాడు డైరెక్టరు దగ్గరకు తీసుకెళ్ళాడా?" మధ్యలో కల్పించుకుని అడిగాను.

"ఆ వెళ్ళాను. ఆయన నన్ను తనతో మద్రాసు రమ్మన్నాడు"

"ఆయన పేరేమిటో తెలుసుకోవచ్చునా?"

"..." చెప్పింది.

"ఆయన వేషం ఇచ్చాడా మరి?" అడిగాను ఆసక్తిగా.

"ఇచ్చాడు. అదీ చిన్న వేషమే. దానికోసం నేనూ మా తమ్ముడూ పదిరోజులు మద్రాసులో వుండవలసి వచ్చింది. ఆ పదిరోజుల్లోనూ నేనున్న హోటల్‌కి కారుపంపి నాలుగుసార్లు నన్ను ఒంటరిగా తన రూమ్‌కి పిలిపించుకున్నాడు" చెప్పిందామె.

"ఎందుకు?"

నన్ను ఓ అమాయకుణ్ణి చూసినట్టుగా చూసిందామె. "అది కూడా చెప్పాలా?" అంది. అర్థం చేసుకున్నాను.

"అయామ్ సారీ. సినీమా వేషాలకోసం మీరు మీ జీవితాన్ని బలిపెట్టుకున్నారన్నమాట."

"అది కాదు బలి. ఆ శంకరం మాటలు నమ్మి వాడితో కాపురం పెట్టటం బలి" ఆమె కళ్ళల్లో పేరుకున్న కసి, పగా కనిపించాయి.

నేను ఆశ్చర్యంగా చూశాను.

"అస్తమానూ వాడు మా ఇంటికొచ్చి సినీమా వేషాల గురించి మాట్లాడటం, తనతో స్టూడియోలకు తిప్పుకోటం మా ఇంట్లో వాళ్ళకి నచ్చలేదు. అదే సమయంలో ఓ టీవీ సీరియల్లో నాకు అతను వేషం ఇప్పించాడు. మా వాళ్ళు ఇంక వేషాలు వెయ్యద్దన్నారు. నాలో మానసిక సంఘర్షణ చెలరేగింది. చివరకు వెండి తెర గ్లామరే! నన్ను ఒక విలాసవస్తువుగా వంటింటి కుందేలుగా చూడటం ప్రారంభించాడు.

"మరి మీ వాళ్ళు వూరుకున్నారా అతనితో మీరు వుంటే?" అడిగాను.

"ముందు నయానా భయానా చెప్పారు. పోలీసు కంప్లయింటు కూడా ఇచ్చారు. కానీ నేను మేజర్ని కావటం వల్ల ఎవరూ ఏమీ చేయలేకపోయారు. అప్పటినుంచీ నేను మళ్ళీ మా ఇంటి గడప తొక్కటం మానేశాను."

"ఊఁ... ఆ తర్వాత?" అడిగాను వెంటనే.

"నాకు వేషాలు రావటం తగ్గిపోయాయి. నా గురించి అతను పట్టించుకోవటం మానేశాడు. రోజూ తాగి రావటం - తన అవసరం తీర్చుకోవటం. పైగా నన్ను పెళ్ళి చేసుకున్నాక తనకు అవకాశాలు తగ్గిపోయాయనీ నేను నష్టజాతకురాలిననీ తిట్టేవాడు. ఎప్పుడైనా ఉక్రోషంతో నేను ఏదైనా అంటే నన్ను చిత్రహింసలు పెట్టేవాడు. అతనితో ఆర్నెల్ల కాపురం నరకమైపోయింది. సినీమా తారనవ్వాలన్న నా కోరికను చంపేశాడు. నా వాళ్ళకు నేను శాశ్వతంగా దూరమైపోయాను. రానురాను ఇల్లుగడవటం కష్టమయ్యేది. తనమటుకు తాను వీధిలో ఎక్కడో తినేసి వచ్చేవాడు. నా గురించి పట్టించుకునేవాడేకాదు.

"ఇందుకేనా నన్ను పెళ్ళి చేసుకున్నది?" అని అడిగాను. మా మధ్య మాటామాటా పెరిగింది. నా మీద చెయ్యి చేసుకున్నాడు. నేను చస్తేనేగానీ అతనికి మనశ్శాంతి ఉండదన్నాడు. నాకు పౌరుషం వచ్చింది. చేజేతులా బంగారం లాంటి నా జీవితాన్ని నాశనం

చేసుకున్నందుకు ఆ క్షణంలో నా మీద నాకే అసహ్యం వేసింది. ఆ రాత్రి కిరసనాయిలు ఒంటి మీద పోసుకుని ఆత్మహత్యకు తలపడ్డాను" అప్పటికే ఆమె కళ్ళల్లో కన్నీళ్ళు చేరుకున్నాయి.

నేను జాలిగా చూస్తూండిపోయాను.

నెమ్మదిగా కళ్ళు తుడుచుకుని ఆమె మళ్ళీ చెప్పసాగింది "అక్కడకూడా దేవుడు నాకు అన్యాయం చేశాడు. నన్ను ఎవరో వీధిలో పోతున్నవాళ్ళు చూసి మంటలార్పి హాస్పిటల్లో చేర్చారు. మర్నాడు ఉదయానికి అమ్మా నాన్న ఎలా తెలిసిందో వాళ్ళకి హాస్పిటల్‌కి వచ్చారు. కన్నీరు మున్నీరుగా ఏడ్చారు. నేను చచ్చిపోతే బాగుండునని వెయ్యి దేవుళ్ళకు మొక్కుకున్నాను ఎలాగైనా నన్ను బతికించమని అమ్మ కూడా ఎంతో మంది దేవుళ్ళని ప్రార్థించింది. మా అమ్మ దేవత కనక, పుణ్యాత్మురాలు కనుక, ఆవిడ ప్రార్థనల్నే ఆ దేవుడి విన్నాడు. నేను ఏడుస్తూ రోజులు ఈడుస్తున్నాను."

ఆమె కన్నీరు చూసి నేను చలించిపోయాను. కొన్ని నిమిషాలపాటు ఆ గదిలో నిశ్శబ్దం చోటు చేసుకుంది. ఇక ఆ తర్వాత ఏం మాట్లాడాలో తెలీక "వెడతాను" అంటూ లేచాను.

"నా కథ 'సితార'లో రాస్తారు కదూ?" దీనంగా చూసి అడిగిందామె.

ధైర్యంగా ముందుకొచ్చి తన కథ రాయమని తనకి తానుగా ఆమె అడిగినందుకైనా ఆమె గురించి అందరికీ తెలియచేయాలని నిర్ణయించుకున్నాను. 'గాంధీగారి దేశంలో గజానికో గాంధారి కొడుకుంటే - సినీమా రంగంలో అంగుళానికో కీచకుడుంటాడు' అని ఓసారెప్పుడో ఓ పత్రికలో చదివిన వాక్యాన్ని గుర్తు చేసుకుంటూ - ఆమె వైపు సానుభూతిగా చూసి బయటికొచ్చాను.

## *కమీషన్ ఏజంట్లు ఇక్కడ కూడానా?*

**'సొంతలాభం కొంతమానుకుని** పొరుగువానికి సాయపడవోయ్' అన్నారు మహాకవులు.

అలా 'స్వంతం - స్వార్థం' మానుకుని పొరుగుమనిషికి అంతో ఎంతో సహాయం చేయాలనుకునేవాళ్ళు ఇవాళ మన సొసైటీలో వుంటారంటే ఆశ్చర్యపోక తప్పదు.

ఎందుకంటే ఇవాళ మనం ఏ పని చేసినా స్వంతలాభాన్నే చూసుకుంటున్నాం తప్ప కొంతయినా దాన్ని వదులుకోటంలేదు. పైగా పరాయివాడు పతనమవుతూంటే చూసి పరోక్షంగా పరవశిస్తున్నాం.

అదే ఓ సినిమాలో చూపించినట్టు ఎవరైనా మనదగ్గరకొచ్చి సహాయాన్ని కోరితే సదరు సహాయాన్ని అవలీలగా చేయగల స్థితిలో మనం వున్నా 'నీకు ఆ సహాయం చేస్తే మరి నాకేంటి?' అని చెయ్యి చాపుతున్నాం ఈ మెంటాలిటీ రాజకీయరంగంలో ఎక్కువగా కనిపిస్తుందని కొందరంటే, సినిమారంగంలో కూడా వుంటుందంటాడు రాంబాబు.

రాంబాబుది హైదరాబాదు. హైదరాబాదులోనే పుట్టాడు. అక్కడే పెరిగాడు. అక్కడే చదువుకున్నాడు. చిన్నప్పట్నించీ సినీమాలు బాగా చూసేవాడు. విడుదలయ్యే ప్రతి తెలుగు సినీమానీ విడవకుండా మొదటిరోజునే చూడటం అతని హాబీ. తాను చూడటం కాకుండా తన మిత్రబృందాన్నికూడా వెంటబెట్టుకుని వెళ్ళేవాడు. కనీసం సినిమా ఖర్చులు కలిసొస్తాయన్న ఉద్దేశ్యంతో చాలామంది కుర్రాళ్ళు అతనితో స్నేహం చేయాలని తహతహలాడేవారు.

ఆ విధంగా ఓ కొత్త సినిమా విడుదలైందంటే కనీసం నలుగురు స్నేహితుల్నైనా వెంట తీసుకెళ్ళి ఎడం పక్కన ఇద్దర్నీ, కుడిపక్కన ఇద్దర్నీ కూర్చోబెట్టుకుని మధ్యన తానో మహారాజులా పరివేష్టితుడయ్యేవాడు.

తన అభిమాన హీరో నటించిన చిత్రమైతే పాతిక రూపాయలతో గులాబీపూలు కొనితెచ్చి పాటపాటకీ పూలరేకులు హీరో మీద జల్లేవాడు. అక్కడితో ఆగకుండా సినిమాలో ఓ పాత్ర ఏదైనా డైలాగు చెబుతూంటే తర్వాత పాత్ర ఏ డైలాగు చెబుతుందో ముందే వూహించి చెప్పేసేవాడు. ఆ ఫీటు చూసి అతని మిత్రులంతా ఆశ్చర్యచకితులయ్యేవారు. 'నువ్వు సినిమా రైటర్‌వి ఎందుకు కాకూడదూ?' అని ఓసారి అతని మిత్రుడు అడిగాడు రాంబాబుని. ఆ ప్రశ్న రాంబాబులో విపరీతమైన సంచలనాన్ని లేపింది.

'నిజమే! తను సినిమాకి డైలాగులు ఎందుకు రాయకూడదూ?' అని ప్రశ్నించుకున్నాడు. వందలాది సినిమాలు చూసిన అనుభవం తనకుంది. ప్రేయసీప్రియులు కలుసుకుని తమ ప్రేమను వ్యక్తం చేసుకునేటప్పుడు ఎలా మాట్లాడుకుంటారో, తండ్రీకొడుకుల మధ్య అభిప్రాయ భేదాలు వచ్చినప్పుడు ఏ డైలాగులు వాడతారో ఇంకా అనేక సందర్భాల్లో ఆయా పాత్రలు ఎలా సంభాషిస్తాయో సినిమాలు చూసేటప్పుడు ముందుగానే తాను ఊహించి చెప్పేవాడు.

అలాంటప్పుడు తాను మాత్రం ఎందుకు రాయలేడు? హైదరాబాదులోనే వుంటున్న ఓ ప్రముఖ రచయితను కలుసుకుని తన మనసులోని మాట చెప్పాడు రాంబాబు. "మీరు ఎలా అయినా నాకు సహాయం చేయాలి" అని అర్థించాడు.

"చూడు తమ్ముడూ! సినిమా అనేది ఒక వ్యాపారం. ఈ వ్యాపారంలో లాభాలు రావాలన్న ఆలోచనతోనే లక్షలు పెట్టుబడి పెడతాడు నిర్మాత. అటువంటప్పుడు కొత్తవాళ్ళతో ఎక్స్‌పెరిమెంట్ చేయటం కష్టం" వివరించాడు ఆ ప్రముఖ రచయిత.

"మరైతే నా కోరిక తీరే మార్గం లేదా?" దిగులుగా చూస్తూ అడిగాడు రాంబాబు".

"ఉంది సినిమాల్లో కథలూ, డైలాగులూ రాయాలంటే నువ్వు ముందు స్టేజి నాటకాలు రాయాలి. వాటిగురించి ప్రజలంతా పదే పదే గొప్పగా చెప్పుకోవాలి. మేమంతా అలా నాటకాలు రాసి సినిమాల్లో చెయ్యిపెట్టినవాళ్ళమే" చెప్పాడు.

"నా మైండ్‌లో బోలెడు కథలున్నాయి. రేపే నాటకం రాసి తెస్తాను. మీరు చదివి అభిప్రాయం చెప్పాలి" ఉత్సాహంగా అన్నాడు రాంబాబు.

"అలాగే ఓ చేత్తో నాటకాలు రాస్తూనే మరో చేత్తో కథలు కూడా రాస్తూండు. ఇవాళ తెలుగులో పత్రికలకు లోటులేదు. కనక విజృంభించు. చందమామ మొదలు వేదాంతభేరి వరకూ ప్రతి పత్రిక్కీ ఏదో ఒక కథ పంపించు. ఎలా అయినాసరే పాఠకులు నిన్నో రచయితగా గుర్తించాలి. వూరూరా నీ నాటకాలు ప్రదర్శించబడాలి. వాటి తాలూకు వార్తలూ, విశేషాలూ పేపర్లలో పడాలి. అలా అలా ఒకటి రెండేళ్ళలో నీ పేరు, నీ రచనల గిరాకీ సినిమా రంగానికి పాకుతాయి. అప్పుడు నీకు 'రైటర్'గా ఆ రంగంలో అవకాశాలు వస్తాయి" గీతాబోధ చేసిన లెవెల్లో చెప్పాడా రచయిత.

ఆ తర్వాత ఇరవై రోజుల వ్యవధిలో రెండు నవలలు రాశాడు రాంబాబు. వాటిని ఆ ప్రముఖ రచయితకు చూపించి, మార్పులూ, చేర్పులూ చేయించుకున్నాడు. మళ్ళీ ఫెయిర్ చేసి రెండు నవలల్నీ రెండు వారపత్రికలకు స్వయంగా పట్టుకెళ్ళి అందచేశాడు.

ఓ పత్రికా సంపాదకుడు, నవల తీసుకోకుండానే తన పాలసీ చెప్పాడు - "సారీ! మా పత్రికలో కేవలం రచయిత్రులకే ప్రాధాన్యం ఇస్తూంటాం మహిళలు రాసిన ఉత్తరాల్నే ప్రచురిస్తాం. వారి ప్రశ్నలకే జవాబులిస్తాం. వారు పంపే జోకుల్నే పబ్లిష్ చేస్తాం. అలాగే నవలల విషయంలో కూడా."

"అమే మీది మహిళాపత్రికా?" డౌటొచ్చి అడిగాడు.

"అలా అని కాదు. కానీ అది అంతే. అప్పుడప్పుడు రచయితలు రాసినవీ వేస్తూంటాం. కానీ మా రెగ్యులర్ రచయితలు మాకున్నారు. కనక మీ నవలను వేరే పత్రికకు ట్రై చేయండి" మర్యాదగా చెప్పాడు ఎడిటర్.

గత్యంతరంలేక ఆ నవలను తీసుకుని ఇంటికొచ్చేశాడు రాంబాబు. మర్నాడు ఆ ప్రముఖ రచయితను కలుసుకుని జరిగిన విషయం చెప్పాడు.

ప్రముఖ రచయిత పదినిమిషాలు ఆలోచించాడు. "నీకు అభ్యంతరం లేకపోతే ఓ పని చేద్దాం" అన్నాడు తర్వాత. ఏమిటన్నట్టు చూశాడు రాంబాబు. "ఆ పత్రికలో నేను రెగ్యులర్ రైటర్నే కాబట్టి ఈ నవలను నా పేరుమీదే ఇస్తే వాళ్ళు పబ్లిష్ చేస్తారు" చెప్పాడు రచయిత.

"అంటే...?"

"అంటే నవలా రచయితగా నీ పేరు బదులు - నా పేరుంటుంది. వాళ్ళిచ్చే పారితోషికంలో మనిద్దరం చెరిసగం తీసుకుంటాం"

ఇప్పుడు రాంబాబు ఆలోచనలో పడ్డాడు. నవలను ఎంతో కష్టపడి రాశాడు. పైగా తనకెంతో నచ్చిన సబ్జెక్టు. ఎవరి పేరు మీదనో అచ్చు అవుతుంది. పోనీ రెమ్యునరేషనైనా పూర్తిగా వస్తుందా అంటే అదీలేదు. ఎలా?

"పేరు నాది ఎలాగూ వుండదు కనుక - పారితోషికమైనా పూర్తిగా ఇవ్వండి" అన్నాడు ఆఖరి బేరంగా. రాంబాబుని ఓ పురుగును చూసినట్టుగా చూశాడు ఆ రచయిత.

"మార్కెట్లో నా పేరేమిటో - దానికున్న విలువేంటో నీకు తెలుసా? నేను 'ఓం నమఃశివాయః' అని రాసి పత్రిక్కి పంపితే పత్రికలవాళ్ళు అద్భుతమైన బొమ్మ వేయించి కలర్ పేజీలో ప్రింటు చేస్తారు తెలుసా? నా పేరు వాడుకుంటున్నందుకు ఆ మాత్రం 'గుడ్విల్' ఇవ్వకపోతే ఎలా?" అన్నాడు. రాంబాబు సిగ్గుపడ్డట్టుగా చూశాడు. "సారీ" అన్నాడు.

"కష్టపడి రాశాను. ఇది త్వరగా అచ్చులో రావటం ముఖ్యం మీరు ఏం చేసినా నాకిష్టమే" అన్నాడు ఆ నవలను అతని చేతిలో పెట్టి. తర్వాత నెలరోజులకే బ్రహ్మాండమైన పబ్లిసిటీతో - ఆ నవల సదరు ప్రముఖ రచయిత పేరు మీద అంతకుముందు రాంబాబుకి 'నో' అన్న పత్రికలోనే సీరియల్గా ప్రారంభమైంది. ప్రారంభ సంచికకు 'కవర్ పేజి'గా ఆ ప్రముఖ రచయిత ఫోటో కూడా వేశారు.

నవలకు మంచి పేరొచ్చింది. రచయితకు ఇంకా గొప్ప కీర్తి వచ్చింది. వారపత్రికలో నవలా ప్రచురణ పూర్తికాకముందే పబ్లిషర్లు ఆ రచయిత ఇంటిముందు 'క్యూ'లో నిలబడ్డారు.

'నవల పబ్లికేషన్' హక్కుల కోసం వేలంపాట ప్రారంభమైంది. మొత్తానికి నలభైవేలకు నవల అమ్ముడుపోయింది.

వారపత్రికవారు కేవలం పదివేలే ఇచ్చారు కనుక ముందు పెట్టుకున్న 'కండిషన్' ప్రకారం రాంబాబు చేతిలో అయిదువేలు పెట్టాడు రచయిత. "మరి నవలగా వేసినందుకు పబ్లిషర్స్ వేరే ఇచ్చారుగా?" అడిగాడు రాంబాబు.

"అది మన కండిషన్ కాదుగా?" తేలిగ్గా నవ్వుతూ అన్నాడు రచయిత. రాంబాబుకి ఒళ్ళు మండిపోయింది. 'కోర్టుకెడతాను' అన్నాడు.

"సాక్ష్యాలు లేవు. అనవసరంగా డబ్బు ఖర్చుపెట్టుకోకు. నువ్వు బాగా రాస్తావు. కనుక వేరే నవల్స్ రాయి. ఈసారి 'కండిషన్స్' స్పష్టంగా కాయితాలమీద రాసుకుందాం?" సిగరెట్టు వెలిగించుకుని తాపీగా చెప్పాడు రచయిత. మనసులోనే ఏడుస్తూ ఇంటికి వెళ్ళిపోయాడు రాంబాబు. ఆ రాత్రి తెల్లవార్లూ నిద్రపట్టలేదతనికి.

ఎన్నెన్నో ఆలోచనలు. అతని నవల తన పేరుమీద రాకపోయినా, ఆ నవలకు మంచి పేరొచ్చింది. వారం వారం వందలాది పాఠకులు నవలను మెచ్చుకుంటూ పత్రికకు ఉత్తరాలు రాశారు. ఆ రచయితకూడా తనను మెచ్చుకున్నాడు. అందుచేత తను బాగా రాయగలడు.

ఆ ధైర్యంతోనే మరికొన్ని నవలలు రాయాలని నిర్ణయించుకున్నాడు. ఈసారి, సినిమాని దృష్టిలో పెట్టుకుని సంభాషణలతో సహా దృశ్యాలుగా రాయాలని కూడా తీర్మానించుకున్నాడు.

నెలరోజుల్లో అలా రెండు స్క్రిప్టులు తయారుచేశాడు. అప్పుడప్పుడే దర్శకుడిగా మంచిపేరు తెచ్చుకుంటున్న మూర్తిగార్ని కలుసుకుని తనను తాను పరిచయం చేసుకున్నాడు. తనకు 'ఫలానా ప్రముఖ రచయిత' చేసిన అన్యాయం గురించి వివరంగా చెప్పుకున్నాడు.

"ఈ స్క్రిప్టులు నేను చదివి మీకు ఏ సంగతీ చెపుతాను. ఓ ఇరవైరోజుల తర్వాత కనిపించండి" అన్నాడు దర్శకుడు. ఆలోచనలో పడ్డాడు రాంబాబు.

"మళ్ళీ ఇక్కడ కూడా మోసపోను కదా?" అనుకున్నాడు.

"మీకేం భయంలేదు. ఇవి బావుంటే ఉపయోగిస్తాను లేదంటే జాగ్రత్తగా మీకు తిరిగిస్తాను. కావాలంటే రశీదు రాసిస్తాను" రాంబాబు మనసులో చెలరేగుతున్న భయాందోళనల్ని పసిగట్టిన దర్శకుడు అన్నాడు.

"అబ్బే అవసరంలేదు సార్. వుంచండి. మళ్ళీ కలుస్తాను" అంటూ అప్పటికి శలవు తీసుకున్నాడు రాంబాబు.

మళ్ళీ ఇరవైరోజుల తర్వాత కలుసుకున్నాడు ఆయన్ని, "వెల్‌కం. మీకు నేనే కబురు పెట్టాలనుకున్నాను" అంటూ ఉత్సాహంగా పలకరించాడు డైరెక్టర్ మూర్తి.

"స్క్రిప్ట్ చదివారా సార్? అడిగాడు కూర్చున్న తర్వాత.

"ఓ చదివాను. రెండూ బావున్నాయి. ఇవాళ సాయంత్రం మనం ఓ ప్రొడ్యూసర్ దగ్గరకు వెడుతున్నాం. అక్కడ మిమ్మల్ని కొత్తరైటరుగా పరిచయం చేస్తాను. మామూలుగా ఇప్పుడు రైటర్స్‌కి 'ఏభై' నించీ 'ఎనభై' వేలదాకా ఇస్తున్నారు. మీరు ఫస్ట్‌టైమ్ రాస్తున్నారు కనక - ముప్పయ్ ఇమ్మంటాను. నేను జాగ్రత్తగా చూసుకుంటానని కూడా చెప్తాను."

"మీ ఇష్టం సార్" సంతృప్తిగా, సంతోషంగా అన్నాడు రాంబాబు

"కానీ ఒక్క షరతు"

"ఏమిటిసార్"

"ప్రొడ్యూసర్ ఇచ్చే ముప్పయ్‌లో మీకు వచ్చేవి పదివేలే"

"అంటే?"

"తొలిసారిగా రిస్కుతీసుకుని నిన్ను సినీమారంగానికి పరిచయం చేస్తున్నాను. ఆ మాత్రం లాభం చూసుకోకపోతే ఎలా?" అన్నాడు మూర్తి రాంబాబుకి నోటమాటరాలేదు.

## *తల్లీ కూతుళ్ళకు ఒక్కడే హీరో!*

**"రాకన్ మానవు హాని** వృద్దులు మహారణ్యంబులో దాగినన్" అన్నారు.

వయస్సు మహ చెడ్డది. మనిషికుండే బద్ధకం వయసుకి చచ్చినా వుండదు. అది మనిషి ఒంటిమీదకు ఏరోజు కారోజు వచ్చి పడుతూనే వుంటుంది. మహత్తరమైన మందులు తింటున్నా, మహారణ్యంలో దాక్కున్నా వచ్చే వయసును ఆపటం మనిషికి ప్రాణం ఇచ్చిన ఆ బ్రహ్మ తరంకూడా కాదు. వయసుని సాధారణంగా మనం 'ఏళ్ళ'ల్లో కొలుస్తూంటాం. ప్రతి ఏడూ పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటూంటాం. ఎంతలేని వారైనా ఆ 'పుట్టినరోజు'న పొద్దున్నే తలంటు పోసుకుని, గుళ్ళోకెళ్ళి తమ ఇష్టదైవాన్ని పూజిస్తారు.

ఉన్నవారైతే, భారీ ఎత్తున 'బర్తడే'లు జరుపుకుంటూ వచ్చే వయసుని హుందాగా ఆహ్వానిస్తారు. ముఖ్యంగా 'సినీతారల' పుట్టినరోజులొస్తే సందడే సందడి. వాళ్ళు ఆ రోజున ఇంట్లో తమ కుటుంబ సభ్యుల మధ్య లేకపోయినా ఫరవాలేదు. ఎక్కడుంటే అక్కడే

సందడి. ఒకవేళ తమ పుట్టిన రోజు 'ఆరోజునే' అన్న విషయం వాళ్ళకు గుర్తులేకపోయినా దర్శకులో నిర్మాతలో గుర్తుచేస్తారు. సెట్టులోనే వాళ్ళ చేత 'కేకు' కోయిస్తారు. మెడలో పూలమాలలు అలంకరిస్తారు. సినీమా పత్రికలవారు ఫోటోలు తీసి ప్రచురిస్తారు. ఇంత హడావిడి జరిగినా ఆ తారలకు ఎంత వయసు వచ్చిందో ఎవరూ చెప్పరు. మగతారలు కొంతమంది తమ వయసెంతో నిర్భయంగా చెప్పుకుంటారు. ఆడ తారామణులు మాత్రం చెప్పరుగాక చెప్పరు. ఒకవేళ చెప్పినా 'పంతొమ్మిది'లోపే చెప్తారు. తమకు వయసు పెరిగిందని కానీ లేక పెళ్ళయిందని కానీ పరిశ్రమలో మనుషులకి తెలిస్తే సినీమా ఛాన్సులు తగ్గిపోతాయని భయం.

ఓ తారామణి ఆ మధ్య ఓ హీరోని ప్రేమించింది. పెళ్ళి చేసుకోబోతున్నట్టు కూడా ప్రకటించింది. అయితే ఆ ప్రకటన వెలువడిన నాలుగేళ్ళదాకా పెళ్ళి జరగలేదు. ఈలోగా దాదాపు ఇద్దరూ కలిసే వుండేవారు. ఎక్కడకు వెళ్ళినా కలిసే వెళ్ళేవారు. 'హోటల్ రూమ్'లో కూడా కలిసే వుండేవారు. అయినా వాళ్ళిద్దరిమీదా ఎవరికీ అనుమానం రాలేదు పాపం. నిందలు వేసే ధైర్యం కూడా ఎవరికీ లేకపోయింది. కారణం 'వాళ్ళిద్దరూ కాబోయే 'భార్యాభర్తలు' కనుక. ఏతావాతా చెప్పొచ్చేదేమిటంటే హీరోయిన్లు వయసు విషయంలోనూ, 'ప్రేమాపెళ్ళిళ్ళ' విషయంలోనూ చాలా జాగ్రత్తగా వుంటారు. కావాలంటే ఎవరైనా హీరోయిన్ తారసపడినప్పుడు ఇంటర్వ్యూ చేసి చూడండి.

"మేడమ్ మీరు ఎవరినైన ప్రేమించారా?" అని అడిగితే

"ప్రేమా? ఏమో మా అమ్మనీ, చెల్లెల్నీ తప్ప నేనెవర్నీ ప్రేమించినట్టు గుర్తులేదు. అంత తీరుబడి కూడా నాకుండదు. అమ్మనీ చెల్లెల్నీ ఎందుకు ప్రేమిస్తున్నానంటే వాళ్ళిద్దరే నాతోకూడా ఎప్పుడూ షూటింగ్‌లకొచ్చి వెంట వుంటారు కాబట్టి" అని చెప్తుంది.

"మీరు పెళ్ళెప్పుడు చేసుకుంటారు?" అని ప్రశ్నిస్తే

"అప్పుడేనా? ఇంకా నాకు పద్దెనిమిదే కదండీ. అయినా ఆ విషయం నేనెప్పుడూ ఆలోచించను. మా పెద్దవాళ్ళిష్టం" అంటుంది.

ఆ పెద్దవాళ్ళు అమ్మాయి పెళ్ళి చేయాలని ఎలాగా ఆలోచించరు. బంగారు బాతుని ఎవరు వదులుకుంటారు చెప్పండి. అమ్మాయి హీరోయిన్‌గా లక్షలు తెచ్చిపోస్తూంటే ఆ 'నిధి'ని వదులుకుని పెళ్ళిచేసి అత్తారింటికి పంపితే ఇంకేముంది? అందుకే వాళ్ళు అమ్మాయి పెళ్ళిచెయ్యరు. అమ్మాయేమో తన వయసు చెప్పదు. చివరకు సినీమాల్లో అవకాశాలు తగ్గిపోయాక తలలో ఒకటి రెండు వెంట్రుకలు తెల్లబడ్డాక "ఈ సినీమా జీవితంలో విసుగెత్తిపోయాను. నా వాళ్ళ మధ్య గడిపే అవకాశం లేకుండా పోతోంది. అందుకే పెళ్ళిచేసుకుని ఆదర్శ గృహిణిగా భర్తను సుఖపెడుతూ పిల్లల్ని క్రమశిక్షణతో పెంచి పెద్ద చేయాలనుకుంటున్నాను" అని పత్రికల వారికి చెబుతుంది.

మళ్ళీ కొంతకాలం పోయాక తమ పిల్లలు కూడా సినీమాల్లో వేస్తే చూసి సంతోషించాలనుకునే మనస్తత్వం చాలామంది తారల్లో ముఖ్యంగా 'హీరోయిన్స్'లో వుంటుంది. ఈ 'వయసు' ప్రాబ్లం హీరోయిన్స్‌కే తప్ప హీరోలకు అంతగా వుండదు. 'హీరోయిన్'కి పెళ్ళయితే ఇక అవకాశాలు తగ్గిపోవచ్చు. ఇవాళ హీరోగా వెండితెరమీద వెలిగిన నటుడు మరో ఇరవై ఏళ్ళు హీరోగానే ఎన్నో చిత్రాలు చేయచ్చు. కానీ హీరోయిన్ విషయం అలాకాదు. ఏ హీరోయిన్ కూడా అంతకాలం అదే హోదాలో కొనసాగలేదు.

ఇరవై ఏళ్ళక్రితం ఓ 'హీరో' సరసన 'హీరోయిన్'గా నటించిన తారామణి 'కూతురు' ఇటీవల అదే హీరో సరసన 'హీరోయిన్'గా నటించింది. అలాంటి సందర్భంలో ఆ 'తల్లి' ఆలోచనలు ఎలా వుంటాయి?

ఈ ప్రశ్న నేను చాలాసార్లు వేసుకున్నాను. జవాబుగా ఓ కథ రాశాను.

ఆ కథేమిటంటే -

అనగనగా ఓ అందమైన అమ్మాయి. పేరు కళ్యాణి తెనాలి దగ్గర ఓ పల్లెటూళ్ళో తనదంటూ చెప్పుకునేటందుకు శిథిలావస్థలో వున్న ఓ పెంకుటిల్లుండేది ఆమెకు. ఆ ఇంట్లో విరిగిపోయిన నులకమంచం మీద పక్షవాతంతో పడిపోయిన కన్నతల్లి వుండేది. ఆవిడప్రాణాలు నిలబెట్టవలసిన బాధ్యత కూడా కళ్యాణికే వుండేది. అప్పట్లో కళ్యాణికి ఇరవై ఏళ్ళ వయసుండేది. అపురూపమైన

రూపలావణ్యాలు లేకపోయినా ఆమె ప్రమేయం లేకుండా వచ్చిపడిన వయసూ ఆ వయసు తెచ్చిపెట్టిన అందాలూ ఆమెకెంతో ఆకర్షణనిచ్చేవి. ఆ ఆకర్షణే అనుకోకుండా ఆమెను రంగస్థల నటిగా తీర్చిదిద్దింది. ఆమె జీవనోపాధికి ఆలంబనమైంది. ఆదా చేసుకునేటందుకు చాలినంత ఆదాయం రాకపోయినా, సాదాగా బ్రతకటానికి ఆకలి తీర్చుకోటానికీ సరిపోయేది. అభినందన పరంపరలూ కరతాళధ్వనులూ ఉత్తమ నటి సత్కారాలూ ఇవన్నీ ఆమెలో క్రమేపీ కొత్త ఆశలు చిగురింపచేశాయి.

ఎవరో అన్నట్టు 'ఆశ' అనేది మోహావేశమే కావచ్చు. కానీ జీవితం అవతలి తీరం చేరేవరకూ అది మనల్ని వెంట తీసుకు వెడుతూనే వుంటుంది. ఆ ఆశే 'కళ్యాణి'ని రెచ్చగొట్టిది. మేకప్ రూంలో నిలువుటద్దం ముందు కూర్చుని ముఖానికి రంగు వేసుకుంటున్నప్పుడల్లా - "నేను సినిమాల్లో ఎందుకు నటించకూడదూ?" అనే ప్రశ్న ఆమె మనసులో తల ఎత్తి కళ్ళల్లో కదలాడేది.

చివరకు ఆ రోజు రానే వచ్చింది. అదృష్టం తలుపు తట్టింది.

బెజవాడలో జరుగుతున్న నాటకపోటీల్లో బహుమతులివ్వటానికి ప్రత్యేక అతిథిగా వచ్చిన ఓ దర్శక నిర్మాత స్టేజిమీద కళ్యాణి పాత్రపోషణ చూశాడు. నిండు మనసుతో ఆశీర్వదించాడు. "త్వరలో మేం తీయబోతున్న పిక్చర్‌లో ఈమెను 'హీరోయిన్‌గా బుక్ చేసుకుంటున్నాం' అని అప్పుడే సభాముఖంగా ఆయన ప్రకటించాడు. ప్రేక్షకులు కరతాళధ్వనులు చేశారు. ఆ దర్శక నిర్మాత ఆమె అడ్రస్ తీసుకుని వెళ్ళిపోయాడు. తర్వాత ఆర్నెల్లకు ఆమెకు టెలిగ్రాం వచ్చింది. రెక్కలు కట్టుకుని మద్రాసు వెళ్ళివాలింది కళ్యాణి. అక్కడ ఆమెకోసం 'హీరోయిన్' వేషం రెడీగా వుంది.

"మొత్తం ఇరవైవేలు పారితోషికం అయిదువేలు అడ్వాన్సు" చెప్పాడు దర్శకనిర్మాత ఆమెకు ఆనందంలో నోటమాటరాలేదు.

"పిక్చర్‌లో హీరో ఎవరో తెలుసా?" అడిగాడాయన. తెలీదన్నట్టు చూసింది. 'కుమార్" ఆయనే చెప్పాడు. ఒక్కసారిగా ఎగిరి గంతేయాలనిపించింది కళ్యాణికి.

అప్పటికే సుమారు పదిహేను సంవత్సరాలనుంచీ సినిమాల్లో నటిస్తూ చలన చిత్ర పరిశ్రమలో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నాడు కుమార్. అతను నటించిన సినిమాకి గ్యారంటీ వుంటుందని పరిశ్రమలో అందరికీ ఓ నమ్మకం. అతను 'డేట్స్' ఇచ్చినప్పుడే సినిమా తీయచ్చుననుకుంటూ ప్రతిరోజూ అతని ఇంటిముందు ఎంతోమంది ప్రొడ్యూసర్లు కాపలా కాస్తుంటారు. కుమార్ నటించిన సినిమాల్ని చూడకుండా వదిలి పెట్టేది కాదు కళ్యాణి ఒక్కమాటగా చెప్పాలంటే కుమార్ తన అభిమాన హీరో. అలాంటి హీరో పక్కన తాను హీరోయిన్‌గా నటించబోతోంది.

"మీరంటే నాకు చాలా ఇష్టం. ఇవాళ మీ పక్కన నటించటం నిజంగా నా అదృష్టం. అసలు ఇది కలా నిజమా అనిపిస్తోంది" మొట్టమొదటిసారిగా స్టూడియోలో కుమార్‌ని కలుసుకున్నప్పుడు 'మైమరుపు'తో చెప్పింది కళ్యాణి. కుమార్ సుకుమారంగా ఓ అరనవ్వు నవ్వాడు. ఆ నవ్వు ఆమెను పులకింపచేసింది. రానురాను ఆ నవ్వుకోసం అతన్ని మరింతగా ఆరాధించటం ప్రారంభించింది.ఆ సినిమా షూటింగ్ జరుగుతున్న రోజుల్లోనే కళ్యాణి తల్లి మరణించింది. అప్పుడు కుమార్ ఆమెకు కొండంత ధైర్యం చెప్పాడు. షూటింగ్ లేని రోజుల్లో ఆమెను షికార్లకూ, ఇతర చిత్రాల ప్రివ్యూలకూ తన వెంట తీసుకువెళ్ళేవాడు. అంతటి పేరు ప్రఖ్యాతులున్న హీరో తనను అంతగా అభిమానించి చేరదీస్తున్నందుకు కళ్యాణి పొంగిపోయేది.

ఒక్కపాట మినహా ఆ చిత్రం తాలూకు షూటింగ్ పూర్తయింది. పాట పిక్చరైజ్ చేయటం కోసం వాళ్ళిద్దర్నీ కొడైకెనాల్ తీసుకెళ్ళారు. అక్కడ మొదటిరోజు షూటింగ్ అయిపోయింది. గెస్ట్‌హౌస్‌లో ఎవరి రూమ్‌కి వాళ్ళు వెళ్ళిపోయారు. రాత్రి తొమ్మిదిగంటలవేళ కళ్యాణిగదిలో వున్న ఫోను రింగైంది.

"హలో" అంది రిసీవరెత్తి.

"హలో ఏం చేస్తున్నావ్ భోజనం అయిందా?" అది కుమార్ గొంతు.

"లేదండి ఇప్పుడే స్నానం చేశాను."

"అయితే డిన్నర్‌కి నాకు కంపెనీ ఇవ్వకూడదూ?" "..."

"నీకు అభ్యంతరం వుంటే వద్దు. నువ్వంటే నాకెందుకో చాలా అభిమానం. అందుకే చనువు తీసుకుని అడిగాను" చెప్పాడు కుమార్.

"వస్తాను సార్" చెప్పిందామె. మరో అయిదునిమిషాల్లో కళ్యాణి, కుమార్ రూమ్‌లో అడుగు పెట్టింది. ఫారెన్ సెంటువాసనేదో గుప్పుమంది.

"వెల్ కం కళ్యాణీ" అంటూ స్వాగతం పలికాడు కుమార్. అతనికెదురుగా వున్న సోఫాలో కూర్చుందామె. పక్కనే టీపాయ్ మీద విస్కీ బాటిలూ గ్లాసులూ వున్నాయి.

"అడగ్గానే వచ్చినందుకు థాంక్స్" అన్నాడు గ్లాసుల్లో విస్కీపోస్తూ మీరు అడిగితే రాకుండా వుండగలనా! నేను మీ ఫాన్‌ని" చిరునవ్వుతో బదులు చెప్పింది కళ్యాణి.

"వండ్రఫుల్ నేనెప్పుడు గమనించలేదు" విస్కీగ్లాసులో ఐస్‌వాటర్ పోస్తూ అన్నాడు కుమార్.

"ఏమిటీ? " అర్ధంకాలేదామెకు.

"అదే నువ్ నవ్వితే నీ బుగ్గలు సొట్టలు పడటం నేనెప్పుడు అంత నిశితంగా గమనించలేదు"

కళ్యాణి సిగ్గుపడింది.

"నువ్వు మంచి 'టైం'లో వచ్చావ్ ఇండస్ట్రీకి. ఇప్పుడసలు హీరోయిన్స్‌కి ఎంత కొరతగా వుందో తెలుసా? టాప్ హీరోయిన్స్‌గా ఇంతకాలం ఏలినవాళ్ళు ముసలివాళ్ళైపోయారు. కొత్తవాళ్ళకి గ్లామరుంటే ఎక్స్‌ప్రెషన్స్ వుండటంలేదు. ఇప్పుడు ఈ పిక్చర్ హిట్టయితే నిన్నింక ఎవరూ పట్టుకోలేరు" గ్లాసు అందిస్తూ చెప్పాడు కుమార్. అతని మాటలే ఆమెకు ఎంతో మత్తిచ్చాయి.

"నేనెప్పుడూ తీసుకోలేదు" ఇబ్బందిగా చూసింది.

"ఫరవాలేదు. జస్ట్ వన్ పెగ్. ఎపిటైజర్. బాగా ఆకలి పుడుతుంది, కమాన్" బలవంతంగా చేతికి అందించాడు. కాదనలేకపోయింది. తన అభిమాన నటుడితో కలిసి అలా 'డ్రింక్' చేయటం అదో అనుభూతిగా అనిపించింది ఆమెకు.

"నేను చాలామంది హీరోయిన్స్‌తో చేశాను. కానీ ఎవరూ నన్నింతగా 'ఎట్రాక్ట్' చేయలేదు. నీ కళ్ళల్లో ఏదో మేగ్నటిక్ పవరుంది" ఆమె పక్కనే కూర్చుంటూ అన్నాడు కుమార్. అతని మాటలూ ప్రవర్తనా కొంచెం కొత్తగా వున్నా ఏమీ చేయలేని విచిత్ర పరిస్థితిలో వుండిపోయింది కళ్యాణి. "ఛీర్స్" అన్నాడు తన గ్లాసును ఆమె గ్లాసుకి తాకిస్తూ. "ఫర్ యువర్ గ్రాండ్ సక్సెస్" అంటూ గ్లాసులో మందు సిప్ చేశాడు.

ఆమె కూడా కొంచెం తాగింది. "నువ్వెప్పుడైనా ఎవరినైనా ప్రేమించావా?" అడిగాడు కుమార్ రెండు క్షణాల నిశ్శబ్దం తర్వాత.

"ఊహు" తల అడ్డంగా వూపింది.

"పోని నిన్ను ఎవరైనా ప్రేమించారా?" అతని వైపు అదోలా చూసింది కళ్యాణి.

"అంటే అయిమీన్ సినిమాల్లోకి రాకముందు నువ్వు నాటకాల్లో వేసేదానివని ప్రొడ్యూసరుగారు చెప్పారు. ఆ రోజుల్లో ఎప్పుడైనా" అంటూ ఏదో అడగబోయి ఆగిపోయాడు.

క్షణం సేపు ఏదో గుర్తుచేసుకుంటున్నదానిలా కళ్ళు మూసుకుంది కళ్యాణి. తర్వాత చెప్పింది. "ఓసారి ఓ నాటకం రిహార్సల్స్‌లో డైరెక్టర్ తాగొచ్చి గొడవచేశాడు వాణ్ణి లెంపకాయకొట్టి ఇంటికి వెళ్ళిపోయాను. మళ్ళీ ఆ నాటకంలో చేయలేదు"

"అయితే ఇప్పుడు నన్నూ కొడతావా?" కొంటెగా చూస్తూ అడిగాడు కుమార్.

"అంటే?"

"నువ్వు నవ్వినప్పుడు నీ బుగ్గలమీద ఎక్కడైతే సొట్టలు పడతాయో సరిగ్గా అక్కడ ముద్దుపెట్టుకోబోతున్నాను" అన్నాడు గ్లాసు టీపాయ్ మీద పెట్టి కళ్యాణి తెల్లబోయి చూసింది కుమార్ వైపు. ఏదో చెప్పాలనుకుంది. కానీ ఆమెకు ఆ అవకాశం ఇవ్వకుండా తన మాట నిలబెట్టుకున్నాడు కుమార్ తన రెండు చేతుల్తో ఆమె ముఖాన్ని పట్టుకుని వణికిపోతున్న ఆమె పెదవుల్ని గాఢంగా ముద్దుపెట్టుకున్నాడు. కళ్యాణి ఆ హఠాత్సంఘటనకు త్రుళ్ళిపడింది.

"అయామ్ సారీ! నిగ్రహించుకోలేకపోయాను" మళ్ళీ మందు గ్లాసు తీసుకుంటూ అన్నాడతను. కళ్యాణి మాట్లాడలేదు. తలవంచుకుంది.

"నువ్వంటేనాకు చాలా ఇష్టం. ఎంతోమంది అమ్మాయిల్ని చూశాను. ఎంతోమంది పక్కన నటించాను. నా మనసెప్పుడూ చలించలేదు. కానీ నిన్ను చూసిన మొదటిసారే నువ్వంటే నాకెంతో అభిమానం కలిగింది. ఆ అభిమానం ప్రేమగా మారింది. అందుకే ఈ సాహసం చేశాను. నేను చేసిన పని తప్పయితే నన్ను నువ్వానాడెవరో డైరెక్టర్ని లెంపకాయ కొట్టానన్నావ్ చూడు అలా కొట్టేసి వెళ్ళిపోవచ్చు. నేనంటే నీక్కూడా ఆ రకమైన అభిమానం వుంటే నీ చేతిలో వున్న మందుగ్లాసు వెంటనే ఖాళీచేసెయ్" చకచకా మాట్లాడేశాడు కుమార్.

కొన్ని క్షణాలు అలాగే మౌనంగా వుండిపోయిందామె.

"నీకు .. నీకు అభ్యంతరం లేకపోతే నిన్ను నేను పెళ్ళిచేసుకుంటాను" అంతలోనే అన్నాడు కుమార్. ఆ మాట పాశుపతాస్త్రంలా పనిచేసింది. కళ్యాణి అతనివైపు చురుక్కున చూసింది. "ఎస్! నువ్ ఒప్పుకుంటే ఈ క్షణమే పంచభూతాల సాక్షిగా నిన్ను పెళ్ళిచేసుకుంటాను" అంటూనే జవాబు చెప్పడానికి ఆమెకు అవకాశం ఇవ్వకుండా తన వేలికున్న వుంగరం తీసి ఆమె వేలికి తొడిగేశాడు కుమార్. క్షణం సేపు ఏదో కలల ప్రపంచంలో వున్న అనుభూతి కలిగింది కళ్యాణికి.

"ఏం నేనంటే ఇష్టంలేదా?" ఆమెను దగ్గరకు తీసుకుంటూ అడిగాడు మళ్ళీ.

"ఇష్టమే" అన్నట్టు కళ్ళతోనే బదులు చెప్పిందామె.

"మరి నేను ఇంత మాట్లాడినా నువ్ పెదవి విప్పి ఒకమాట కూడా చెప్పవేమిటీ?"

ఏం చెప్తుంది? ఉట్టికి సైతం ఎగరలేని తన చేతులకు స్వర్గమే అంది వస్తోంటే.

పేరు ప్రఖ్యాతలున్న హీరో ఓ అనామకురాలైన తనను పెళ్ళి చేసుకుంటానని ముందుకొస్తే ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతుండే తప్ప పెదవి విప్పి మాట్లాడగలుగుతుందా?

"మీ ఇష్టం. కానీ నన్ను మోసం చేయకండి కష్టమొస్తే చెప్పుకునేందుకు నాకెవరూ లేరు" ఆమె కళ్ళల్లో కన్నీరు మెరిసింది. ఆమెను మరింత దగ్గరకు తీసుకున్నాడు కుమార్. ఆనందంతో పొంగి పోయిందామె. ఆ ఆనందంలో తన సర్వస్వాన్నీ అతనికి అంకితం చేసుకుంది.

రోజులు గడిచిపోయాయి. వారాలు దొర్లిపోయాయి. ఈలోగా ఒకటి రెండుసార్లు కుమార్ దగ్గర పెళ్ళిప్రస్తావన తెచ్చింది కళ్యాణి.

"కొంచెం ఓపిక పట్టు డాళింగ్. ఇప్పుడిప్పుడే నీకు సినీమాల్లో అవకాశాలు వస్తున్నాయి. ఇపుడే తొందరపడితే ఇకముందు నీకు ఛాన్సులురావు" చెప్పాడతను."

"ఎందుకని?" అమాయకంగా చూసిద్మి.

"అదంతే హీరోయిన్స్ పెళ్ళిచేసుకుంటే ఇంక బుకింగ్స్ రావు. పైగా వాళ్ళకి బోలెడన్ని ప్రాబ్లమ్స్. పిల్లలు పుట్టుకొస్తారు. ఛామ్ తగ్గిపోతుంది. కొంతమందైతే లావెక్కిపోతారు" కళ్యాణికి ఆ మాటల్లో నూటికి నూరుపాళ్ళూ నిజం ధ్వనించింది. ఆ తర్వాత ఒకరిద్దరు దర్శకులకు కళ్యాణిని రికమెండ్ చేసి వేషాలు ఇప్పించాడు కుమార్.

పెళ్ళి విషయంలో తొందరపడవద్దని కుమార్ చెప్తున్నా కళ్యాణి తొందరపడక తప్పలేదు. ఒకరోజు తాను తల్లికాబోతోందన్న నిజం తెలుసుకున్న రోజు కుమార్‌ని ఆత్రంగా కలుసుకుంది కళ్యాణి. విషయం చెప్పింది. పత్రికలవాళ్ళని పిలిచి, తనను పెళ్ళిచేసుకున్నట్టుగా ప్రకటన ఇవ్వమని కోరింది. "నీతో పెళ్ళి నాకిష్టంలేదు" అతి మాములు సినీమా డైలాగ్ చెప్పిన ధోరణిలో అన్నాడు.

కళ్యాణి భయంతో ఒణికిపోయింది.

"ఎందుకని?" శక్తిని కూడదీసుకుంటూ, అక్షరాలు పోగుచేసుకుంటూ అడిగింది.

"సినీమాల్లో నటించే ఆడవాళ్ళ పట్ల సదభిప్రాయం లేదు"

ఒక్కసారిగా తుళ్ళిపడి చూసింది.

"నాక్కాదు మావాళ్ళకి. పైగా వాళ్ళు నాకు వేరే సంబంధం చూశారట" వెంటనే అన్నాడు.

"అయితే మనగురించి వాళ్ళకు చెప్పలేదా?" అతనికి ఎదురుగా నిలబడి భుజాలు పట్టుకుని కుదుపుతూ ప్రశ్నించింది.

"చెప్పాలనిపించలేదు" ఆమె చేతుల్ని విసురుగా తప్పించి దూరంగా వెళ్ళిపోయాడు కుమార్ తాపీగా సిగరెట్ తీసి వెలిగించుకున్నాడు కళ్యాణి అప్రతిభురాలై బొమ్మలా చూస్తూండిపోయింది.

ఆమెను చేరుకుంటూ నెమ్మదిగా చెప్పాడు కుమార్.

"అంతా ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చాను కళ్యాణీ! నువ్ హీరోయిన్‌గా మంచి పేరు తెచ్చుకోవాలంటే ఇంకా టైము పడుతుంది. ఈలోగా పెళ్ళిచేసుకుంటే నా సంగతి అటుంచి నీ భవిష్యత్తు దెబ్బతింటుంది"

"నాకా భవిష్యత్తు అక్కర్లేదు. ఈ క్షణంలోనే సినీమా జీవితానికి స్వస్తి చెప్తాను. మీ భార్యగా మీకు సేవ చేసుకుంటూ హాయిగా వుండగలను" చెప్పింది కళ్యాణి.

"కానీ హాయిగా ఎంతకాలం వుండగలం? రేపెప్పుడైనా నాకు సినీమాల్లో ఛాన్సులు తగ్గిపోతే? అప్పుడు ఇద్దరం వీధినపడి అడుక్కుతినాలి. అందుకే ఇద్దరం యాక్ట్ చేస్తూంటే ఒకరికి అవకాశాలు లేకపోయినా మరొకరు సంపాదించి తేవచ్చు"

"అలా అయితే మరి నన్నెందుకు కాదంటున్నారు?"

"చెప్పానుగా నువ్ పెద్ద హీరోయిన్‌వి అవుతావనుకున్నాను కానీ అంతకంటే ముందు తల్లివవుతున్నావ్"

"అది నా తప్పుకాదు"

"ఆల్‌రైట్ తప్పు నాదే క్షమించు" అంటూ గబగబా అక్కణ్ణించి వెళ్ళిపోయాడు కుమార్. కళ్యాణి కుప్పలా కూలబడిపోయింది. ఆ క్షణం వరకూ అతన్ని ఎంతగా ఆరాధించిందో ఈ క్షణాన అతన్ని అంతగా అసహ్యించుకుంది. ఇక తనేం చెయ్యాలి? తాను తల్లికాబోతున్న విషయం రేపోమాపో అందరికీ తెలుస్తుంది. తననంతా అసహ్యించుకుంటారు.

తనకీ జన్మలో పెళ్ళికాదు. 'పోనీ, నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకుంటే?'

'అవును అదొక్కటే మార్గం.'

ఓ నిర్ణయానికొచ్చింది. తాను పనిచేస్తున్న సినీమా తాలుకు షూటింగ్ ఇక వారం పదిరోజుల్లో పూర్తయిపోతుంది. ఆ తర్వాత తన వూరెళ్ళిపోయి తన ఇంట్లో తన బ్రతుకు చివరిక్షణాలు గడపాలని తీర్మానించుకుంది.

అంతలో ఓ అనుకోని సంఘటన ఆమె జీవితాన్ని మరోమలుపు తిప్పింది. ఒకరోజు కళ్యాణి షూటింగ్‌లో వుండగా అమెరికన్ కళాకారుల బృందం షూటింగ్ చూసేందుకు వచ్చింది. ఆ బృందానికి నాయకత్వం వహిస్తున్న గ్రీవ్స్ కళ్యాణి నటనకు ముగ్ధుడయ్యాడు.

"మీలాంటి ఆర్టిస్టు మా డ్రామా ట్రూప్‌లో వుంటే బావుంటుంది" అన్నాడు.

అతను తెలుగులో మాట్లాడటం ఆమెకి ఆశ్చర్యాన్ని కలిగించింది.

"సో మీకు తెలుగు కూడా వచ్చా?" అని అడిగింది కళ్యాణి.

"కొంచెం. కొంచెం. పన్నెండేళ్ళ వయస్సు వచ్చేవరకూ నేను ఇండియాలోనే వుండేవాణ్ణి. ఆ తర్వాత మా అంకుల్‌తో అమెరికా వెళ్ళిపోయాను. అక్కడే థియేటర్ ఆర్ట్‌లో డిప్లొమా తీసుకున్నాను" చెప్పాడు.

ఆ రాత్రి అమెరికన్ కళాకారుల బృందానికి సినీ పరిశ్రమలోని కొందరు ప్రముఖులు డిన్నర్ ఏర్పాటు చేశారు. డిన్నర్‌లో తన పక్కన కూర్చున్న కళ్యాణిని గ్రీవ్స్ అడిగాడు. "ఓ పిక్చర్‌లో యాక్ట్‌చేస్తే మీకు రెమ్యూనరేషన్ ఎంత ఇస్తారు?"

చెప్పింది కళ్యాణి.

"మీరు నాతో అమెరికా వచ్చేయకూడదూ?" అడిగాడు.

కళ్యాణి ఆశ్చర్యంగా చూసింది.

"మీకు అభ్యంతరం లేకపోతేనే. నాకింకా మేరేజ్ కాలేదు. మీకూ కాలేదని తెలుసుకున్నాను. మీరిష్టపడితే నన్ను మేరేజ్ చేసుకోవచ్చు"

ఆ మాటలకామె తుళ్ళిపడలేదు. ఆలోచనలో పడింది.

అంతలో గ్రీవ్స్ మళ్ళీ చెప్పాడు. "న్యూయార్క్ దగ్గర ఓ టౌన్‌లో నాకు పెద్ద థియేటర్ వుంది. అందులో ప్రతిరోజూ నాటక ప్రదర్శనలుంటాయి. మీరు నాతో వుంటే మరికొన్ని కొత్తనాటకాలు తయారు చేయవచ్చు. నన్ను మారేజ్ చేసుకున్నా, చేసుకోకపోయినా మీకు నెలనెల జీతం ఇస్తాను."

"అలాగే నాకభ్యంతరంలేదు" వెంటనే తన నిర్ణయాన్ని చెప్పేసింది కళ్యాణి.

"థాంక్యూ నేను అమెరికా వెళ్ళగానే మీరు అక్కడకు రావటానికి ఏర్పాట్లు చేస్తాను" ఉత్సాహంగా అన్నాడు గ్రీవ్స్.

"కానీ మన మేరేజ్ విషయం మాత్రం మీతో పర్సనల్‌గా రేపు మాట్లాడతాను" చెప్పిందామె. తానుంటున్న హోటల్ పేరు చెప్పి మర్నాడు రాత్రి తప్పక కలుసుకోమని కోరాడు గ్రీవ్స్.

ఆ ప్రకారమే కళ్యాణి మర్నాటి రాత్రి హోటల్‌కి వెళ్ళి అతన్ని కలుసుకుంది. తాను ఒకరివల్ల మోసపోయినట్లూ, త్వరలోనే తల్లి కాబోతున్నట్టూ అతనికి చెప్పింది.

"మిమ్మల్ని ఛీట్ చెయ్యటం నాకు ఇష్టంలేదు. అందుకే జరిగిన కథంతా మీకు చెప్పాను. అయినా మీరు నన్ను పెళ్ళి చేసుకుంటానంటేనాకు అభ్యంతరంలేదు. నాకీ జీవితం మీద మమకారం లేదు. ఆత్మహత్య గురించి కూడా ఆలోచించాను. అయినా మీరు మరో కొత్త ఆశను చూపించారు. ప్రస్తుతం నేనీ వాతావరణం నుంచీ, ఈ మనుషులనుంచీ దూరంగా వెళ్ళిపోవాలి. అందుకే మీతో రావటానికి ఇష్టపడుతున్నాను. ఇక నన్ను పెళ్ళి చేసుకునే విషయమంటారా? మీ ఇష్టం. కావాలంటే నేను అబార్షన్ చేయించుకుంటాను."

జీవితం పట్ల మమకారం తగ్గిపోయినవాళ్ళు ఎంత తెగువ చేసి మాట్లాడతారో అంతకంటే ఎక్కువ తెగించి మాట్లాడింది కళ్యాణి. గ్రీవ్స్ అట్టే ఆలోచన చేయలేదు.

"మీ పరిస్థితికి జాలిపడుతున్నాను. మీ సాహసానికి సంతోషిస్తున్నాను కూడా! మీరు అబార్షన్ చేయించుకోవాల్సిన అవసరంలేదు. మిమ్మల్ని నేను పెళ్ళిచేసుకోటానికి సిద్ధంగా వున్నాను" ఆమె చేతిని ఆత్మీయంగా ముద్దుపెట్టుకున్నాడు.

"కానీ మన మేరేజి ఇక్కడే జరగాలి" చెప్పింది కళ్యాణి.

"ఇక్కడా!"

"అవును. ఇక్కడే మీకు అభ్యంతరం లేకపోతే రేపే రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్ళి మేరేజ్ చేసుకుందాం."

ఆమె నిర్ణయానికి తన అంగీకారాన్ని తెలియచేశాడు గ్రీవ్స్. మర్నాడే అతి నిరాడంబరంగా వాళ్ల పెళ్ళి జరిగిపోయింది. ఆ తర్వాత ఇండియాలో గ్రీవ్స్ పర్యటన కళ్యాణితో హనీమూన్‌గా మారిపోయింది.

ఆ తర్వాత రెండు నెలలకే కళ్యాణి అమెరికా వెళ్ళిపోయింది. అమెరికా చేరుకున్న కళ్యాణికి సరికొత్త జీవితం స్వాగతం పలికింది. గ్రీవ్స్ ఆమెనెంతో ప్రేమగా చూసుకునేవాడు అప్పుడప్పుడు తన థియేటర్‌కి తీసుకెళ్ళి ట్రూప్‌లో పనిచేసే కళాకారుల్ని ఆమెకు పరిచయం చేసేవాడు.

"ఓ ఏడాదిపాటు ఇక్కడి అందరితో తిరుగుతూ, వేషభాషల్ని గమనిస్తుండు. నీ డెలివరీ అయిన తర్వాత నువ్వు కూడా డ్రామాల్లో యాక్ట్ చేద్దువుగాని" అన్నాడు గ్రీవ్స్.

అతను తనపట్ల కనబరిచే ఆత్మీయతకు ఆమె పొంగిపోయేది. అదే క్షణాన కుమార్ ఒకనాడు తనతో వ్యవహరించిన తీరుకి అసహ్యం కలిగేది. తన కడుపులో శిశువు పెరుగుతున్న కొద్దీ ఆమెకు పదే పదే కుమార్ గుర్తుకొచ్చేవాడు.

బిడ్డపుట్టిన తర్వాత కుమార్ జ్ఞాపకాలు అసలు 'వీడవేమో' నన్న భయం ఆవరించేది. మొదట్లోనే 'అబార్షన్' చేయించుకోనందుకు బాధపడేది. 'శిశువు పుట్టాక ఏ అనాథాశ్రమంలోనో ఇచ్చేస్తే?' అనే ఆలోచన కలిగింది కళ్యాణికి.

"ఈ దేశంలో అనాథాశ్రమాలు వుంటాయా?" అని 'గ్రీవ్స్'ని అడిగింది.

"ఎందుకూ?" ప్రశ్నించాడు.

తన మనసులో చెలరేగుతున్న ఆలోచనల్నీ ఆందోళనల్నీ అతనికి వివరించిందామె. అయితే గ్రీవ్స్ ఆ విషయాల్ని సీరియస్‌గా తీసుకోలేదు. పసిపిల్లలు భగవంతుని రూపాలనీ అటువంటి వారిపట్ల ద్వేషాన్ని పెంచుకోవటం తగదనీ చెప్పాడు.

"కళ పవిత్రమైంది. మనం కళాకారులం. మనకెప్పుడూ చెడు ఆలోచనలు రాకూడదు. నీకు పుట్టే బిడ్డ భగవంతుని ప్రసాదం. పవిత్రంగా చూసుకుందాం కళామతల్లికి అంకితం చేద్దాం" అన్నాడు గ్రీవ్స్. భర్త సంస్కారానికి కళ్యాణి ఉప్పొంగిపోయింది.

ఆ ఆనందంలో రోజులు ఇట్టే గడిచిపోయాయి. కళ్యాణికి ఆడపిల్ల పుట్టింది. తన అభిరుచులకు తగినట్టుగా పిల్లను పెంచి పెద్దచేసింది. ఆమెకు 'ఆరాధన' అనే పేరు పెట్టింది. తన కలలకు ప్రతిరూపంగా తన ఆశలకు వారసురాలిగా ఆమెను తయారు చేయాలని నిశ్చయించుకుంది. అందుకే ఆరాధనకు సంగీతం నేర్పించింది. భారతీయ నృత్యంలో ప్రావీణ్యురాలిని చేసింది.

ఆరాధన అందమైన 'అమెరికా బొమ్మ'లా తయారైంది. ఆమెకు పదహారేళ్ళ ప్రాయం వచ్చింది. సరిగ్గా అప్పుడే అనుకోని సంఘటన జరిగింది.

అమెరికాలో వుంటున్న తన బంధువుల్ని చూట్టానికి ఇండియానించి వచ్చిన ప్రముఖ దర్శకుడు 'దత్తు' ఓ రోజున గ్రీవ్స్ థియేటర్లో ఆరాధన నృత్యం చూశాడు. ఆమె అందచందాలకూ, అభినయానికి ముచ్చటపడిపోయిన దత్తు ఆమె తెలుగు పిల్లని తెలుసుకుని మరింత విస్తుపోయాడు.

నృత్యప్రదర్శన ముగిసిన తర్వాత కళ్యాణిని కలుసుకుని తనను పరిచయం చేసుకున్నాడు. 'ఆరాధన' వంటి టాలెంట్ కలిగిన ఆర్టిస్టు ఈనాటి తెలుగు సినీపరిశ్రమకు ఎంతో అవసరం అన్నాడు. కళ్యాణి ఇష్టపడితే తాను తీయబోతున్న నృత్యప్రధానమైన చిత్రంలో ఆరాధనకు వేషం అందునా హీరోయిన్ వేషయం ఇస్తానన్నాడు. కళ్యాణి ఆలోచనలో పడింది.

ఒకప్పుడు తాను సినిమా హీరోయిన్‌గా పేరు ప్రఖ్యాతులు గడించుకోవాలని ఆశపడింది. కానీ తప్పటడుగులు వేసి, తప్పనిసరి పరిస్థితుల్లో గ్రీవ్స్‌ని పెళ్ళిచేసుకుని ఇండియా విడిచిపెట్టి వచ్చేసింది. ఇప్పుడు మళ్ళీ అలాంటి అవకాశమే తన 'ఆరాధన'కి రాబోతోంది. అదృష్టం బాగుండి తన కూతురు హీరోయిన్‌గా మంచి పేరు తెచ్చుకుంటే తమ చివరి కాలాన్ని ఇండియాలో గడపవచ్చు. తనను ఎంతో

ప్రేమించి పెళ్ళిచేసుకున్న గ్రీవ్స్ చనిపోయి మూడేళ్ళయిపోతోంది. థియేటర్‌పై వస్తున్న అద్దెతోనూ, కూతురిచ్చే నృత్యప్రదర్శనలనించి వస్తున్న సంపాదనతోనూ ఈ మూడేళ్ళనించీ ఎలాగో రోజులు నెట్టుకొస్తోంది.

కానీ తన మాటెలా వున్నా ఆరాధనకు ఓ మంచి భవిష్యత్తు కావాలి. ఆమెకు మంచి సంబంధం చూసి పెళ్ళిచేయాలి. అన్నింటినీ మించి ఆరాధనకి కూడా సినిమాల్లో నటించాలన్న కోరిక ఏర్పడింది.

అందుకే -

ఆ ఆలోచనతోనే 'దత్తు'కి మాటిచ్చింది. తన కూతుర్ని సినీమాల్లో చేర్చటానికి సుముఖతను వ్యక్తం చేసింది.

"షూటింగ్ షెడ్యూలు ప్లాన్ చేసుకున్న తర్వాత తెలియచేస్తాను. మీ అమ్మాయిని తీసుకుని మీరు కూడా రావచ్చు ఈలోగా మీకు 'వీసా' ఏర్పాట్లు అవీ చేస్తాను" అన్నాడు దత్తు కళ్యాణి దగ్గర్నించి అడ్రస్సు, ఇతర వివరాలు తీసుకుని.

నాలుగు నెలలు తిరక్కుండానే ఆరాధనకు దత్తు దగ్గర్నించి పిలుపురానే వచ్చింది.

ఆరాధనతో మళ్ళీ పదహారేళ్ళ తర్వాత ఇండియాకి వచ్చింది కళ్యాణి.

"ఇక్కడ మీకు సౌకర్యంగా వుందా?" కళ్యాణి వుంటున్న హోటల్ రూంలోకి అడుగుపెడుతూనే ప్రశ్నించాడు దత్తు.

"ఓయస్! ఈ హోటల్ చాలా బావుంది" చెప్పింది కళ్యాణి.

"సాయంత్రం స్టోరీరైటర్ వచ్చి అమ్మాయికి కథ చెప్తారు. రేపటినించీ షూటింగ్ వుంటుంది. పొద్దున్న ఎనిమిదింటికి కారు పంపిస్తాను" అన్నాడు దత్తు అక్కడి సోఫాలో కూర్చుంటూ. తల్లి పక్కనే కూర్చుని ఆరాధన ఏదో మ్యాగజైన్ తిరగేస్తోంది.

"షూటింగ్ ఎన్ని రోజులుంటుంది?" అడిగింది కళ్యాణి.

"అమ్మాయి వర్క్ పదిరోజుల్లో కంప్లీటైపోతుంది."

"పిక్చర్‌లో హీరో ఎవరు?" యధాలాపంగా అడిగిందామె మళ్ళీ.

"కుమార్ అనీ"

కళ్యాణి ఉలిక్కిపడింది.

"కుమారా?"

"అవును. మీరు బహుశా అతని పేరు వినేవుంటారు. ఇప్పటికప్పుడే రెండువందల ఫిల్మ్స్‌లో యాక్ట్ చేశారాయన"

"అంటే ఇరవై ఏళ్ళ క్రితం ఎప్పుడో 'చిల్లరమొగుడు' సినీమాలో" గుర్తుచేసుకుంటూ అడగబోయింది కళ్యాణి.

"అవునవును. అప్పట్లో ఆ పిక్చరే అతనికి టర్నింగ్ పాయింట్ అప్పటికి నేనింకా ఫీల్డులోకి రాలేదులెండి. కానీ కుమార్ ఇండస్ట్రీకొచ్చి పాతికేళ్ళు దాటిపోయింది" చెప్పాడు దత్తు.

కళ్యాణి ముఖంలో రంగులు మారిపోయాయి. ఆమె కళ్ళు ఎర్రబడ్డాయి. రక్తపోటు ఎక్కువైంది. "కుమార్ పక్కన మా ఆరాధన యాక్ట్‌చేయటానికి నేను ఒప్పుకోను దత్తుగారూ!" అంది కళ్యాణి ఆవేశాన్ని అణచుకునే ప్రయత్నం చేస్తూ.

'మేగజైన్' తిరగేస్తున్న ఆరాధన ఉలిక్కిపడి తల్లివైపు అయోమయంగా చూసింది దత్తు మాత్రం ఖంగారుపడలేదు. ముసిముసిగా నవ్వుతూ అన్నాడు.

"ఏభై ఏళ్ళ కుమార్ పక్కన పదహారేళ్ళ మీ పాప హీరోయిన్‌గా నటించటం ఏమిటని మీరు ఆశ్చర్యపోతున్నారేమో అలాంటివేం పెట్టుకోకండి. మా దేశంలో ఇది మామూలే. పైగా మీకు తెలీదేమో. ఇంత వయసొచ్చినా, కుమార్ విగ్గుపెట్టుకుంటే స్టూడెంటులా కనిపిస్తాడు. అసలు ఆయనతో 'పిక్చర్' అనౌన్స్ చేస్తేచాలు బయ్యర్లు వరుసలో వచ్చి నిలబడతారు. ఆయన 'డేట్స్' కోసం నేను పద్దెనిమిది నెలలు ఆగాను. తెలుసా?" కుమార్ గొప్పతనం గురించి రికార్డు పెట్టాడతను.

కానీ కళ్యాణి ఆ మాటలు బొత్తిగా పట్టించుకోలేదు.

"కావచ్చు. కానీ అతని పక్కన హీరోయిన్‌గా మా బేబీని యాక్ట్‌చేయనివ్వను" అదే తన ఆఖరి నిర్ణయం అన్నట్టుగా మరింత ధృఢంగా చెప్పింది కళ్యాణి. ఈసారి కొంచెం ఇబ్బందిగా చూశాడు దత్తు.

"మీరెందుకు అలా అంటున్నారో నాకు అర్థంకావటంలేదు. ఆయన పక్కన హీరోయిన్ ఛాన్స్ కోసం ఫీల్డులో వున్న అమ్మాయిలెందరో కలలు కంటుంటారు. ఆయనతో నటిస్తే చాలు తమకెంతో ఫ్యూచర్ వుంటుందని ఆర్టిస్టులందరూ భావిస్తారు. మీకు ఓ చిన్న సంగతి చెప్పనా?"

ఏమిటన్నట్టు చూసింది కళ్యాణి.

"ఈ మధ్య 'పూజ' అనే అమ్మాయి ఫీల్డులోకి వచ్చింది. వేషాలకోసం అందరి చుట్టూ తిరిగింది. చివరకు సాధించింది. చిన్న హీరోల పక్కన కేవలం పదివేలు, పాతికవేలు రెమ్యునరేషన్‌తో హీరోయిన్‌గా నటించింది. అలా నాలుగైదు పిక్చర్స్‌లో యాక్ట్‌చేశాక ఆమె స్టార్ తిరిగింది. హఠాత్తుగా కుమార్ పక్కన రెండో హీరోయిన్ గా నటించే అవకాశం వచ్చింది. అప్పుడు అయిదువేల రెమ్యునరేషన్‌కే అగ్రిమెంట్ సైన్ చేసింది. ఆ పిక్చర్ సూపర్ హిట్టయింది. ఆ దెబ్బతో తన రెమ్యునరేషన్ రెండు లక్షలకు పెంచేసింది ఆ పిల్ల" అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు. కానీ మధ్యలో కల్పించుకుంది కాళ్యాణి.

"ప్లీజ్ ఇంకేం చెప్పకండి ఆయన మహానటుడే కావచ్చు. ఆయనతో నటిస్తేనే చాలు, జన్మధన్యమవుతుందని ఎందరో అనుకుంటే అనుకోవచ్చు అంత మాత్రం చేత నా నిర్ణయాన్ని మార్చుకోలేను."

ఆమె మాటల ధోరణిలోని తీవ్రతనూ, కళ్ళల్లో పేరుకుంటున్న ద్వేషాన్ని గమనించాడు దత్తు. "తీరా రేపటినించీ షూటింగ్ ప్రారంభిస్తూంటే ఈ చివరి నిమిషంలో మీరిలా ప్రాబ్లం తీసుకొస్తే ఎట్లా?" అడిగాడు.

"సారీ మీకు ఇబ్బంది కలిగించినమాట నిజమే. క్షమించండి మీ పిక్చర్‌లో హీరో కుమార్ అనే విషయాన్ని మీరు నాకు అమెరికాలోనే చెప్పివుంటే మేం అసలిక్కడకు వచ్చేవాళ్ళమేకాదు" చెప్పింది కళ్యాణి.

"అంటే మీకు కుమార్ తెలుసా ఇలాంటి నిర్ణయానికి ఇంత హఠాత్తుగా మీరు ఎందుకొచ్చారో తెలుసుకోవచ్చా?"

"దాదాపు పద్దెనిమిదేళ్ళ క్రితం నేను కుమార్‌తో యాక్ట్ చేశాను. ఒకటికాదు. రెండు సినిమాల్లో అతని పక్కన హీరోయిన్‌గా నటించాను"

"అలాగా!?" ఆశ్చర్యంగా చూశాడు దత్తు.

"ఇప్పుడు మళ్ళీ నా కూతురు కూడా అతని హీరోయిన్‌గా నటించటం నాకిష్టంలేదు. నేను భరించలేను" ఆమె పెదవుల్లో సన్నని వణుకు కూడా ధ్వనించింది.

"మీరు అనవసరమైన సెంటిమెంట్స్‌తో మీ పాప ఫ్యూచర్‌ని పాడు చేస్తున్నారు"

"ప్లీజ్. ఇంకేం చెప్పద్దు. దయుంచి వెంటనే మా తిరుగుప్రయాణానికి ఏర్పాట్లు చేసిపెట్టండి. ఇంతవరకూ మా వల్ల మీకెంత ఖర్చయిందో చెపితే నేను పే చేస్తాను."

కళ్యాణి ఆంతర్యం ఏమిటో ఆర్థం కాకపోయినా ఆమె నిర్ణయం మాత్రం మరి మారదని గ్రహించిన దత్తు నిరాశగా నిట్టూర్చాడు.

ఆమె తన కూతురుతో తిరిగి అమెరికా వెళ్ళిపోతూంటే విమానాశ్రయంలో అడిగాడు దత్తు.

"కనీసం ఇప్పుడైనా మీరు ఎందుకిలాంటి నిర్ణయం తీసుకున్నారో చెపితే సంతోషిస్తాను" అని.

"నా గురించీ ఇప్పుడీ జరిగిన సంఘటన గురించీ మీ హీరో కుమార్‌కి చెప్పండి. నేను ఎందుకీ నిర్ణయం తీసుకున్నదీ అతను మీకు వివరంగా చెప్తాడు" అంటూ తన కూతురుతో విమానం ఎక్కేసింది కళ్యాణి.

## *వేషం కావాలంటే ఇదీ ఓ పద్ధతే!*

**'పట్టు పరిశ్రమ'** గురించి మీరు వినే వుంటారు.

ఈ పరిశ్రమ చాలా లాభదాయకమైందనీ, ఎవరైనా సరే దీన్ని ప్రారంభించవచ్చుననీ, అధిక మొత్తాలు పెట్టుబడులు అవసరంలేదనీ, ఎటొచ్చీ ఈ పరిశ్రమను చేపట్టేవారికి కాస్తంత ఓపికా, నేర్పూ వుండాలనీ, ఆ రెండూ వుంటే ఎంతో లాబం వస్తుందనీ రేడియోలోనూ, టీవీలోనూ చెప్పగా మీరు విని వుంటారు వదిలెయ్యండి.

నేను చెప్పబోయేది 'మరో రకం పట్టు పరిశ్రమ' గురించి. ఈ పరిశ్రమలో మనకు వుపయోగపడే మనిషిని పదే పదే కలుసుకుంటూండాలి. ఆ మనిషి పుట్టినరోజెప్పుడో గుర్తుపెట్టుకుని ఆ రోజున ఫోన్లోనో పర్సనల్‌గానో శుభాకాంక్షలు చెప్పాలి. వీలైతే 'గుడ్ మార్నింగ్'ల దగ్గర్నించి 'గుడ్‌నైట్'ల వరకూ చెబుతూ మధ్య మధ్యలో వీలు కల్పించుకుని 'మీరు ఇంద్రుడు, మీరు చంద్రుడు' అని పొగడ్తల వర్షం కురిపించాలి. ఎప్పుడైనా ఆ మనిషి ఓ కుళ్ళు జోకువేసినా సరే మీరు పొట్టచెక్కలయ్యేలా భళ్ళున నవ్వాలి.

ఈ విధంగా 'కాకా' పట్టటం కూడా పట్టుపరిశ్రమగానే భావించబడుతుంది. మరీ నంబర్ వన్ - నంబర్ టూ స్థానాల్లో వున్నవారు మినహా - తక్కిన సినీతారలు చాలామంది ఈ పరిశ్రమను చేపట్టి - తమ స్థానాన్ని పదిలంగా కాపాడుకోవాలని తాపత్రయపడుతుంటారు. 'జీవితమంటే అంతులేని ఒక పోరాటం' అనే సినీగీతం పల్లవి - 'సినిమా జీవితానికే' అతికినట్లు వర్తిస్తుంది. సినిమాల్లో అడుగుపెట్టేదాకా ఒక ఆరాటం. ఆ తర్వాత అందులో నిలదొక్కుకునేదాకా ఒకటే పోరాటం.

పూర్వకాలంలో సినిమాల్లో నటించాలంటే అంతో ఇంతో రంగస్థల అనుభవం వుపయోగపడేది. చక్కటి వాచికాభినయంతోపాటు గాత్రంలో కూడా ప్రవేశం వుంటే ప్రాధాన్యత లభించేది. ఇవాళ పరిస్థితి అదికాదు. కొంచెం గ్లామరూ, మరికొంచెం చొరవా, ఇంకొంచం పరిచయాలూ వున్నాయంటే చాలు మీరు సినిమాల్లో చేరిపోవచ్చు.

వాచికాభినయం లేదంటారా? నో ప్రాబ్లం. మగాళ్ళ గొంతు ఆడవారి కంఠస్వరంలా వున్నా ఆడవారి గొంతు మగవారి కంఠస్వరంలా వున్నా ఇక్కడ నో ప్రాబ్లం. శుభ్రంగా చెల్లిపోతుంది. ఎందుకంటే అలాంటివారిని ఆదుకుని ఓ మెట్టుపైకి ఎక్కించటానికి రోజారమణులూ, సరితలూ, దుర్గలూ, సాయికుమార్లూ, రత్నకుమార్లూ - ఇంకా ఎందరెందరో డబ్బింగ్ కళాకారులు వుండనే వున్నారు.

వారి పుణ్యమా అని 'వాచికాభినయం' విషయంలో మీకు ఎలాంటి ఇబ్బందీ వుండదు. కెమేరాముందు నిలబడి 'యాక్షన్' అని డైరెక్టరుగారు చెప్పగానే మీరు 'ఓ నమః శివాయ' అంటూ మీకు వచ్చిన భాషలో నచ్చిన మంత్రాలు చదివేయండి చాలు. ఆనక అంతా డబ్బింగ్ కళాకారులు చూసుకుంటారు. మీ పాత్రకు మంచి డైలాగులు 'రైటరు' రాశాడనుకోండి వాటిని డబ్బింగ్ కళాకారులు అద్భుతంగా చెప్పారనుకోండి - అపుడు మీకు అవార్డులు కూడా రావచ్చు. ఆ డబ్బింగ్ కళాకారుల పేరైనా నా తెరమీద కనిపించదు కనుక అదంతా మీ ప్రతిభే అనుకుంటారు చాలామంది. ఇకపోతే అలా ఒకటి రెండు సినిమాల్లో నటించాక ఓ మంచిరోజు చూసుకుని పత్రికలవారిని పిలవండి. మంచి పార్టీ ఇవ్వండి. పార్టీ ఎందుకని అడిగితే మీ పుట్టినరోజని చెప్పండి. దట్సాల్. ఇక మీ గురించీ మీ నటనా కౌశలం గురించీ పత్రికలన్నీ రాస్తాయి.

పరిశ్రమలో పదికాలాలపాటు పదిలంగా వుండాలంటే పట్టుపరిశ్రమ ఒక్కటే మార్గమని నమ్మిన ఓ తారామణి ఇటీవల ఆ మార్గంలో మరో అడుగుముందుకు వేసింది. (ఉత్తరాదినో, దక్షిణాదినో అడక్కండి)

ఆ తారామణి పేరు గీర్వాణి. మంచి వయసులో వున్నపుడే పరిశ్రమలో కాలు పెట్టింది. కానీ కాలం కలసిరాలేదు. ఎప్పుడూ సెకండ్ హీరోయిన్ వేషమో, చెల్లెలు వేషమో లభిస్తుండేది. పట్టుపరిశ్రమలోని ప్రథమాధ్యాయాన్ని విజయవంతంగా ఆచరణలో పెట్టిన తర్వాత కాస్తంత ప్రాధాన్యత కలిగిన వేషాలు రావటం ప్రారంభించాయి.

ఆ సమయంలో ఓసారి ఓ పెద్ద హీరో పక్కన గీర్వాణికి హీరోయిన్‌గా నటించే అవకాశం లభించింది. షూటింగ్ జరుగుతోంది. ఆ చిత్రానికి డైలాగ్స్ రాసిన 'సుందర్ లాల్' కూడా ఆ రోజు షూటింగ్‌కి వచ్చాడు.

'డైలాగ్‌రైటర్‌గా' సుందర్ లాల్‌కి అప్పటికే ఇండస్ట్రీలో మంచి పేరుంది. ఎస్పీ బాలసుబ్రమణ్యం తమకు ప్లేబాక్ పాడాలని ఇవాల్టి హీరోలంతా ఎలా కోరుకుంటారో - తమ పాత్రకు 'సుందర్‌లాల్' డైలాగ్స్ రాయాలనికూడా నటీనటులందరూ ఆశపడుతుంటారు. షూటింగ్ అవుతున్నంతసేపూ షాట్‌కి, షాట్‌కీ మధ్య కాస్తంత సమయం దొరికినప్పుడల్లా ఆ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్న డైరెక్టరు సుందర్‌లాల్‌తో మాట్లాడుతూండటం గీర్వాణి గమనించింది. కానీ 'సుందర్‌లాల్'ని ఆమె ఎప్పుడూ చూడలేదు. అందుకే పక్కనున్న హీరోని అడిగింది. 'ఆయనెవరూ?' అని. "ఈ పిక్చర్‌కి స్టోరీ, డైలాగ్ రైటర్ ఆయనే" అని చెప్పాడు హీరో.

ఆ తర్వాత అయిదు నిమిషాలకే తన షాట్ అయిపోయాక గీర్వాణి సుందర్‌లాల్ దగ్గరకు వెళ్ళింది. 'హలో' అంటూ చిరునవ్వుతో పలకరించింది. అతను కూడా అరనవ్వుతో బదులు పలకరించి, పక్కనున్న కుర్చీ చూపించాడు. "మీ పేరు వినటమే కానీ - ఎప్పుడూ చూడలేదు మిమ్మల్ని ఇప్పుడే హీరోగారు చెప్పారు. మీకు థాంక్స్ చెప్పుకోవాలని వచ్చాను" అదే చిరునవ్వు కంటిన్యూ చేస్తూ చెప్పింది. అర్థంకాలేదు సుందర్ లాల్‌కి. "ఎందుకూ?" అన్నాడు అమాయకంగా.

"నా వేషానికి మంచి డైలాగ్స్ రాసినందుకు అసలు మీ డైలాగ్సంటే నాకు మహా ఇష్టం. ఇన్ని సినిమాల్లో నేను నటించినా ఇంతవరకూ మీరు డైలాగ్స్ రాసిన దాంట్లో నాకు అవకాశం రానందుకు అప్పుడప్పుడు చాలా వర్రీ అవుతూండేదాన్ని. ఇన్నాళ్ళకు నాకోరిక తీరింది" గలగలా ఆమె మాట్లాడేస్తుంటే గుడ్లప్పగించి చూస్తూండిపోయాడు సుందర్‌లాల్.

"మీరు రాత్రిళ్ళు కూడా బిజీగా వుంటారా?" షూటింగ్ అయిపోయిన తర్వాత కూల్‌డ్రింక్ తాగుతూ - సుందర్‌లాల్ దగ్గరకు మళ్ళీ వచ్చి అడిగింది గీర్వాణి.

"అంటే?" అర్థంకాలేదు. "మరేం లేదు. సాయంత్రం మీకేమీ ఎంగేజ్‌మెంట్ లేకపోతే - మా ఇంటికి రండి"

"ఏదైనా అకేషనా?" అడిగాడు సుందర్‌లాల్. "మీరు మా యింటికి రావటమే అకేషన్" ఒయ్యారాలు సగం అక్కడే వలకబోస్తూ చెప్పింది గీర్వాణి. సుందర్‌లాల్ రచయిత కనక రవి గాంచనిది కూడా కనుక 'పాయింటు' అర్థం చేసుకున్నాడు. ఆరయ్యేసరికి ఆ ఇంటి గుమ్మం హాజరై బజర్ నొక్కాడు.

"ఓ! వచ్చేశారా మీరు చాలా బిజీ రైటరు ఈ మామూలు ఆర్టిస్టు ఇంటికి వస్తారో రారో అని అనుమానించాను" లోపలకు ఆహ్వానిస్తూ అంది గీర్వాణి.

"నేను బిజీరైటర్ని అయితే. కానీ మీరు 'మామూలు ఆర్టిస్టు' అంటే మాత్రం నేనొప్పుకునేదిలేదు" ఓ తస్సావేశాడు సుందర్‌లాల్.

ఆమె తనను ఎందుకు ఆహ్వానించిందీ అతనికి తెలుసు. అతనెందుకు వచ్చిందీ ఆమెకూ తెలుసు. కానీ ఒకరికొకరు దొరక్కుండా కాసేపు దొంగాట ఆడుకున్నారు.

"అవునూ! ఇంట్లో మీరొక్కరే వున్నట్టున్నారు. మీ వారు!?" తాపీగా సిగరెట్ వెలిగించుకుంటూ అడిగాడు సుందర్‌లాల్. 'లేరులెండి' ధైర్యం చెప్తున్నట్టుగా అందామె. లేరని సుందర్‌లాల్‌కీ తెలుసు. అయినా అడగటం తన సంస్కారమనుకున్నాడు. అడిగి ఔననిపించుకున్నాడు.

"మీరేం తీసుకుంటారు?"

"మీరేం ఇచ్చినా సరే!"

"అబ్బా! చమత్కారులే ఎలా అయినా రైటర్లు కదా! డబల్ మీనింగ్ డైలాగులు రాసిరాసి" గలగలా నవ్వేసింది.

"ఇంతకీ ఏం ఇస్తారు?" వెంటనే అడిగాడు.

"మీరేం కావాలన్నా సరే" అదే నవ్వు.

"అమ్మో! మీరూ చతురులే" మెచ్చుకోలుగా అన్నాడు సుందర్‌లాల్. గీర్వాణి లేచి పక్క గదిలోకి వెళ్ళి మరో అయిదునిమిషాల్లో తిరిగివచ్చింది. ఇప్పుడామె చేతిలో ఓ అందమైన 'ట్రే' వుంది. ఆ ట్రేలో ఖరీదైన విస్కీబాటిల్ వుంది. దాని పక్కనే అయిస్ క్యూబ్స్ వున్న ప్లాస్టిక్ బకెట్ వుంది. "ఆ మధ్య మా ప్రొడ్యూసర్‌గారు సింగపూర్ వెళ్ళినపుడు ఈ బాటిల్ తెచ్చారు. నేను అట్టే తీసుకోను. ఎవరైనా ఆనరబుల్ గెస్ట్స్ వచ్చినప్పుడు 'సెర్వ్' చేయమని దాచాను. ఇవాళ ఇలా సద్వినియోగపడింది" అంటూ బాటిల్ ఓపెన్ చేసిందామె.

ఆ రాత్రి పదకొండుగంటలదాకా తాగిన తర్వాత ఇంటికి ఫోన్ చేసి "ఇవాళ నేను ఇంటికి రావటంలేదు" అని భార్యకు చెప్పాడు సుందర్‌లాల్. ఈ సంఘటన జరిగిన తర్వాత గీర్వాణికి సుందర్‌లాల్ కథ రాసిన చాలా చిత్రాల్లో చాలా మంచి వేషాలు వచ్చాయి. ఆమె రేటు కూడా బాగా పెరిగింది.

అయితే ఆమెకు వచ్చే పారితోషకంలో నాలుగోవంతు సుందర్‌లాల్ తీసుకుంటాడన్న నిజం చాలాకాలం ఎవరికీ తెలియలేదు. ఇది 'పట్టుపరిశ్రమ'లో ఒక 'నూతన అధ్యాయం' అని ఒప్పుకుంటారా లేదా?

## *"సినీతారగా స్థిరపడాలంటే బంధాల్ని తెంచుకోవాలి"*

**'పెళ్ళి'** అనేది రెండక్షరాల మాటే కావచ్చు. మూడుముళ్ళే కావచ్చు.

కానీ -

దానికో పవిత్రత వుంది. స్త్రీ పురుషులిద్దర్నీ జీవితాంతం కట్టిపారేసే గట్టి బంధం వుంది. 'మూడుముళ్ళ బంధం'తో మగవాడు ఓసారి ఒక స్త్రీని పెళ్ళిచేసుకున్నాడంటే ఇక జన్మంతా ఆ బంధానికి కట్టుబడి వుంటుంది స్త్రీ. ఇది ఇవాల్టి సెంటిమెంటు కాదు. 'సీత' 'సావిత్రి', 'అనసూయ'ల కాలం నించీ వస్తున్న అపూర్వ సంప్రదాయం.

ఏ 'స్త్రీ' అయినా, తన భర్త 'శ్రీరామచంద్రుడంతటివాడు కావాలని మనసారా కోరుకుంటుంది.

ఒకోసారి పెళ్ళికి ముందు శ్రీరామచంద్రుడిలా కనిపించిన ఆ మొగుడే పెళ్ళయిన తర్వాత తన 'విశ్వరూపాన్ని' చూపిస్తాడు. ఆయనగారు అప్పుడప్పుడు మందు కొడతాడు. మిత్రులందరితో కలిసి ఆదివారాల్లో పేకాడతాడు. పేకాటలో డబ్బులు బాగా వస్తే దాంతో రేసులకు వెడతాడు. అలా ఆయనగారి 'కృష్ణలీలల'న్నీ ఒకొటొకటిగా బయటపడతాయి. అప్పుడా ఇల్లాలు సాధ్యమైనంతవరకూ భర్తని తన త్రోవలో పెట్టుకోవాలని శతవిధాల ప్రయత్నిస్తుంది. కాదంటే కన్నీరు పెట్టుకుని ఆ 'టైపు' భర్తతోటీ, జీవితంతోటీ రాజీపడిపోతుంది. అంతే తప్ప ఆ మొగుణ్ణి 'డోంట్ కేర్' అంటూ తీసిపారెయ్యదు. పైగా అతని లీలా విలాసాల్ని కప్పిపుచ్చటానికి తాపత్రయపడుతుంది. "మీవారు రాత్రి చాలా ప్రొద్దుపోయి వచ్చినట్టున్నారే?" అని ఓ పక్కింటి పిన్నిగారడిగితే మా వారు 'పార్ట్ టైం జాబ్' చేస్తున్నారు, అందుకే లేటవుతూంది అంటూ, కట్టుకున్న భర్త పరువు 'మందులో' కొట్టుకుపోక్కుండా కాపాడుతుంది. అది సగటు ఇల్లాలి సైకాలజీ.

అయితే సినీతారలకు ఈ సైకాలజీ అంతగా వర్తించదు. 'పెళ్ళి' అనే పదానికి వీరు అంతగా ప్రాధాన్యతనూ, పవిత్రతనూ ఇవ్వరు. ఎందుకంటే ఎంతోమంది హీరోలు అనేక సినీమాల్లో అనేకమంది 'హీరోయిన్స్'ని పెళ్ళిచేసుకుంటారు. అనేక మందితో కాపురాలు చేస్తున్నట్టు నటించవలసి వుంటుంది. అలాంటి నట జీవితానికి అలవాటుపడిపోయి జీవితంలో కూడా నటించేయటం

అలవాటు చేసుకుంటారు. కొంతమంది అగ్నిసాక్షిగా తాళి కట్టి పెళ్ళాడిన ఇల్లాల్ని పక్కన పెట్టి మరోభార్యను కట్టుకోవటానికి సునాయాసంగా ప్రిపేరయిపోయిన హీరోలు చాలామందే వున్నారు.

ఆ మధ్యకాలంలో అరవయ్యో పడిలో పడిన ఓ సుప్రసిద్ధ 'హిందీ హీరో' దాదాపు ఇరవై ఏళ్ళకు పైగానే దాంపత్య జీవితాన్ని చవిచూశాక మరో పాతికేళ్ళ పడుచు పిల్లను అతి రహస్యంగా పెళ్ళిచేసుకున్న సంగతి మనం పేపర్లలో చదివాం. అలాగే సంప్రదాయ సిద్ధమైన కుటుంబానికి చెందిన ఓ ప్రముఖ 'తమిళ హీరో' నిక్షేపంలాంటి భార్యకు విడాకులిచ్చి ఓ హిందీ హీరోయిన్‌ని కట్టుకున్న విషయం కూడా మనకు తెలుసు.

పెద్దల సమక్షంలో శాస్త్రయుక్తంగా పెళ్ళిచేసుకున్న ఓ అమ్మాయి అదృష్టవశాత్తూ, సినీతారగా పేరు తెచ్చుకున్నాక కట్టుకున్న భర్తను చట్టరీత్యా వదిలేసి - మరో సినీ హీరోని పెళ్ళిచేసుకుని హాయిగా కాపురం చేసుకుంటున్న ఉదంతం కూడా మీకు గుర్తుండే వుంటుంది.

అయితే వీటన్నింటికి భిన్నంగా వుంటుంది సరస్వతి కథ. కథంటే కల్పించి చెప్పున్నది ఎంత మాత్రం కాదు. వాస్తవంగా జరిగిన సంఘటన.

రాయలసీమ ప్రాంతంలోని ఓ చిన్న టౌనులో వుండేది సరస్వతి. పిల్ల నలుపైనా కళ్ళల్లో ఆకర్షణ మాత్రం అద్వితీయంగా వుంటుంది. ఆ పిల్ల తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడు ఎస్.ఎస్.ఎల్.సి చదువుతున్న వెంకట్రావుతో పరిచయం అయింది. వెంకట్రావ్ తండ్రి చినరాయుడు ఓ ఫిలి డిస్ట్రిబ్యూషన్ సంస్థకు డబ్బు పెట్టుబడి పెడుతూండేవాడు. సరస్వతి తండ్రి రాఘవయ్యకి చినరాయుడికీ సంబంధబాంధవ్యాలుండేవి. వాటిని పురస్కరించుకుని ఓసారి రాఘవయ్య ఏదో డబ్బింగ్ సినిమా రైట్స్ కొనటానికి ఓ యాభైవేలు చినరాయుడి దగ్గర అప్పుగా తీసుకున్నాడు.

తర్వాత ఆ డబ్బిగ్ సినిమా దెబ్బ తినటంతో పెట్టుబడి కూడా నష్టపడిపోయాడు రాఘవయ్య. అయినా అప్పుతీర్చక తప్పదుకదా. అప్పు వసూలు కోసం తరచుగా వెంకట్రావ్ రాఘవయ్య ఇంటికి వచ్చేవాడు. అప్పుడు అతని సరస్వతితో పరిచయం ఏర్పడింది. వేడిమీద రుచీ వయసు మీద అందం అవసరంలేదన్న సామెతగా నల్లగా వున్న సరస్వతి వెంకట్రావ్‌కి రంభలా కనిపించింది. అప్పుడప్పుడే ఆమె వంటిమీదకు వస్తున్న దోర వయసు అతని ఆకల్నీ నిద్రనీ దూరం చేసేది. అప్పు వసూలు కోసం వచ్చి, సరస్వతితో సరసాలాడేవాడు. సరస్వతి కూడా అతనితో చనువుగా వుండేది.

ఆ విధంగా కొంతకాలం కొనసాగిన వాళ్ళ స్నేహం ప్రేమగా మారింది. ఒకర్ని చూడకుండా మరొకరు వుండలేకపోయేవారు. ఓ రోజున తాను సరస్వతిని ప్రేమిస్తున్నట్టూ, ఆమెనే పెళ్ళిచేసుకోవాలని అనుకుంటున్నట్టూ తన తల్లికి చెప్పాడు వెంకట్రావ్. ఒక్కగానొక్క కొడుకు ముచ్చట తీర్చటం తమ బాధ్యతగా భావించిన అతని తల్లిదండ్రులు 'చదువు పూర్తయిన తర్వాత పెళ్ళిచేస్తాం' అని మాటిచ్చారు. ఇక ఆ ప్రేమికుల ఆనందానికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి. సెలవు దొరికిదంటే ఇద్దరూ కలసి సినిమాలకూ షికార్లకూ చెక్కేసేవారు. 'ఎలాగా కాబోయే దంపతులు కదా' అని అటు పెద్దలూ ఇటు పెద్దలూ చూసీ చూడనట్లు వూరుకున్నారు. దాంతో వీళ్ళిద్దరూ మరికొంత అడ్వాన్సయ్యారు. సరస్వతికి నెలతప్పింది.

విషయం బయటపడకుండా వెంటనే ముహూర్తం పెట్టించి వాళ్ళిద్దరికీ ఘనంగా పెళ్ళి చేసేసి ఓ ఇంటి వాళ్ళను చేసేశారు పెద్దలు. అయిదారునెలలు ఇట్టే గడిచిపోయాయి.

కానీ ఈ అయిదారు నెలల కాలంలోనూ చాలా మార్పులు జరిగాయి. చినరాయుడికి వ్యాపారంలో చాలా నష్టం వచ్చింది. అప్పులు తీసుకున్న వాళ్ళంతా 'ఐపీ'లు పెట్టి అయిపులేకుండా పోయారు. ఆ దిగులుతో అతను మంచం పట్టాడు. సంసారం సాఫీగా గడపాలంటే వెంకట్రావ్ వుద్యోగం చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. కానీ ఎస్.ఎస్.ఎల్.సి చదివిన వాడికి వుద్యోగం ఎవరిస్తారు? అప్పుడు సరస్వతి ముందుకొచ్చింది.

"నేను సినిమాల్లో యాక్ట్‌చేస్తాను" అంది. వెంకట్రావ్ ఆశ్చర్యపోయాడు. "నీకెవరిస్తారు వేషాలు?" అన్నాడు "ప్రయత్నిస్తే ఎవరో ఒకరు ఇవ్వకపోరు. మా నాన్నకి తెలిసిన వాళ్ళు చాలామంది సినిమా ఫీల్డులో వున్నారు. వాళ్ళద్వారా ప్రయత్నం చేస్తాను. ఏదో ఒక వేషం దొరక్కపోదు. నేను స్కూల్లో చాలా నాటకాలు వేశాను కదా!" అతన్ని ఒప్పించే ప్రయత్నం చేసిందామె.

ఆమె మాట కాదనటం వెంకట్రావ్‌కి ఇష్టం లేకపోయింది. సరస్వతి నల్లగా వున్నా ఆమె కళ్ళల్లో చాలా ఆకర్షణ వుంటుంది. ఆమె నవ్వితే ఆ ఆకర్షణ పదిరెట్లవుతుంది. ఆమె గొంతు శ్రావ్యగా వుంటుంది. ఈ లక్షణాలన్నీ చూసే తానామెను వరించి పెళ్ళిచేసుకున్నాడు. నటించగల ధైర్యం ఆమెకున్నప్పుడు తాను ఎందుకు కాదనాలి? హీరోయిన్ వేషాలు రాకపోయినా ఏదో ఒక వేషం రావచ్చు. ఆర్థికపరమైన ఇబ్బందుల్ని ఎదుర్కోవచ్చు. అలా ఆలోచించిన వెంకట్రావ్ ఆమెకు 'లైన్ క్లియర్' ఇచ్చాడు. మర్నాడే తన మనసులోని కోరిక తండ్రికి చెప్పి భర్తతో మదరాసు చేరుకుంది సరస్వతి. అదృష్టదేవత వెంటనే ఆమెను వరించింది.

హీరోయిన్‌కి వదినగారిగా ఓ మంచి వేషం లభించింది. తిరుపతిలో పదిహేనురోజులు షూటింగు. రెండు వేలు రెమ్యునరేషను. అయిదువందలు అడ్వాన్సు. అడ్వాన్సు డబ్బు భర్తచేతిలో పెట్టింది సరస్వతి. దాన్ని తీసుకుని వెంకట్రావ్ తన వూరు వెళ్ళిపోయాడు. సరస్వతి 'యూనిట్'తో తిరుపతి షూటింగ్‌కి వెళ్ళిపోయింది.

పొద్దున్న ఆరుగంటలకు నిద్రలేస్తే గబగబా కార్యక్రమాలు ముగించుకుని ఏడున్నరకు 'మేకప్'కి రెడీ అయిపోవాలి. సాయంత్రం ఆరుగంటలదాకా లొకేషన్‌లోనే మకాం తిరిగి ఎనిమిదింటికి 'రూమ్'కి వచ్చి వేణ్ణీళ్ళ స్నానం చేసి, వేడివేడిగా భోజనం ముగించి పడుకుంటే ఒళ్ళు తెలియని నిద్రముంచుకొచ్చేది. ఆ విధమైన దినచర్యతో తన వాళ్ళనీ, తన ఇంటినీ మర్చిపోయింది సరస్వతి. అయితే ఆ దినచర్యలో ఓ రోజున ఓ విచిత్రమైన సంఘటన చోటు చేసుకుంది.

ఆ చిత్రం షూటింగ్ అవుతూండగా ప్రముఖ దర్శకుడు 'చంద్రన్' తన తదుపరి చిత్రం షూటింగ్ సందర్భంగా 'లొకేషన్స్' చూసుకునేందుకు తిరుపతి వచ్చి మిత్రుల్ని పలకరించటానికి ఆ షూటింగ్‌కి వచ్చాడు. షూటింగ్‌లో 'సరస్వతి' నటనను చూశాడు. ఆమె వివరాలు తన మిత్రులద్వారా తెలుసుకున్నాడు. 'మా పిక్చర్‌లో యాక్ట్ చేస్తావా?' అని అడిగాడు తమిళంలో.

తనకు తమిళం అంతగా రాదని చెప్పిందామె. "అదంతా మేం చూసుకుంటాం. అవసరమైతే టామిల్ నేర్పిస్తాం. లేదంటే వేరే ఎవరిచేతనైనా నీకు డబ్బింగ్ చెప్పిస్తాం." చెప్పాడు చంద్రన్. సరస్వతి తన అంగీకారాన్ని తెలియచేసింది. "అయితే ఈ పిక్చర్ షూటింగ్ పూర్తికాగానే నువ్ మద్రాస్ వచ్చి నన్ను కలుసుకో" అంటూ తన విజిటింగ్ కార్డ్ ఆమెకు అందించి వెళ్ళిపోయాడు చంద్రన్.

సరస్వతి ఒకవైపు ఆనందంతో మరోవైపు ఆరాటంతో ఉక్కిరి బిక్కిరైంది. ఒక సినిమా అందులోనూ తాను నటిస్తున్న మొట్టమొదటి సినిమా ఇంకా విడుదల కాకుండానే మరో చిత్రంలో అవకాశం వచ్చినందుకు ఆనందం షూటింగ్ అయిపోగానే ఇంటికెళ్ళి భర్తవడిలో వాలిపోవాలనుకున్న తను అలాకాక మద్రాసు వెళ్ళవలసి వస్తున్నందుకు ఆరాటం. ఆ రెండు అనుభూతుల మధ్యా సతమవుతూనే భర్తకు వుత్తరం రాసింది. తనకు మరో చిత్రంలో అవకాశం వచ్చిన కారణంగా షూటింగ్ పూర్తయిన తర్వాత తిరుపతి నుంచి ఇంటికి తిరిగి రాలేకపోతున్నందుకు ఏమీ అనుకోవద్దంటూ వుత్తరంలో తన భర్తను కోరింది.

అయితే వెంకట్రావ్‌కు ఆ వుత్తరం సంతృప్తిని ఇవ్వలేదు. తననుంచి తన భార్య దూరమైపోతోందేమోనన్న భయం తొలిసారిగా అతని వూహల్లో మెదిలింది. వెంటనే సరస్వతికి టెలిగ్రాం ఇచ్చాడు. "నువ్ మరో చిత్రంలో యాక్ట్ చేయవలసిన అవసరంలేదు. తిరుపతి షూటింగ్ పూర్తవగానే ఇంటికి వచ్చేయ్" అదీ టెలిగ్రాం సారాంశం.

అది చదువుకున్న సరస్వతి 'మూడ్' పాడైపోయింది. "టుబీ ఆర్ నాట్ టు బీ?" అనే సందిగ్ధంలో పడింది. కానీ అప్పటికే సెట్స్‌లో చాలామంది ఆమె నటనను మెచ్చుకోవటం వల్ల ఓ రకమైన ఆత్మవిశ్వాసం ఆమెలో ఏర్పడిపోయింది. "ఎలాగైనా 'మంచినటిగా'

నేను గుర్తింపు తెచ్చుకోవాలి" అనే కోరిక ఆమెలో వ్రేళ్ళూని పోయింది. అందుకే తిరుపతి షూటింగ్ అయిపోయిన తర్వాత ఆమె మద్రాసు వెళ్ళటానికే నిశ్చయించుకుంది.

మద్రాసు చేరుకోగానే సరస్వతి చంద్రన్‌ని కలుసుకుంది. షూటింగ్ పదిపదిహేను రోజుల్లో ప్రారంభం కాబోతుందనీ తమిళంలోనూ మలయాళంలోనూ కూడా ఒకేసారి చిత్ర నిర్మాణం జరుగుతుందనీ ఆమెకు చెప్పాడు చంద్రన్.

"రెండు వర్షన్స్‌లోనూ హీరోయిన్‌గా నువ్వే నటిస్తున్నావ్" అన్నాడు తర్వాత. సరస్వతి సంతోషానికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి. షూటింగ్ ఇంకా పదిహేను రోజుల వరకూ ప్రారంభం కావటంలేదు కనుక ఓసారి తన వూరు వెళ్ళి రావాలని నిశ్చయించుకుంది సరస్వతి. ఆమాటే చంద్రన్‌కి చెప్పింది.

"ఓయస్. ఇవాళ రాత్రి అగ్రిమెంట్ మీద సంతకం చేసి అడ్వాన్స్ తీసుకో. రేపు మీ వూరు వెళ్ళి మళ్ళీ పదిహేనో తారీఖు నాటికి వచ్చేయ్. షూటింగ్‌కి నాలుగు రోజుల ముందే ఇక్కడుండాలి. నీ వేషానికి తగిన కాస్ట్యూమ్స్ తీసుకోవాలి" అన్నాడు చంద్రన్. అన్నట్టుగానే ఆ రాత్రి మళ్ళీ అతని ఆఫీసుకి వెళ్ళింది సరస్వతి. రెండు సినిమా ల్లోనూ హీరోయిన్‌గా నటిస్తున్నందుకు మొత్తం పదివేలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. ఆ మేరకు అగ్రిమెంటు మీద సంతకాలయ్యాయి.

ఆ మర్నాడు పొద్దున్నే బజారుకి వెళ్ళి తన భర్తకోసం బట్టలు కొంది సరస్వతి. వాటిని తీసుకుని రాత్రికి తన వూరు చేరుకుంది. మద్రాసులో జరిగిన విషయమంతా భర్తకు చెప్పింది.

"నువ్వింక సినిమాల్లో నటించటానికి వీల్లేదు" అన్నాడు వెంకట్రావు. సరస్వతి దిగ్భ్రాంతిగా చూసింది.

"నేనే ఎలాగో కష్టపడి సంపాదిస్తాను. నీకు ఎలాంటి లోటూ రాకుండా చూసుకుంటాను. ఇంక నువ్వు సినిమాల సంగతి మర్చిపో. నువ్ తీసుకున్న అడ్వాన్స్ వాళ్ళకి తిరిగిచ్చేయ్" అన్నాడు.

"అగ్రిమెంటు మీద సంతకం చేశాక ఇప్పుడు నటించనంటే వాళ్ళు వూరుకోరు?" చెప్పిందామె.

"మన ఇంటి పరిస్థితులు చెప్పి నేను వాళ్ళను ఒప్పిస్తాను. ఆ సంగతి నువ్వింక మర్చిపో." అంటూ మరో మాటకు అవకాశం ఇవ్వకుండా అక్కణ్ణించి వెళ్ళిపోయాడు వెంకట్రావ్.

ఆ రాత్రి సరస్వతికి నిద్రపట్టలేదు. ఒక చిత్రంలో నటించి అనవసరంగా సినీతార ముద్రవేయించుకుంది. ఇంతలోనే బంగారంలాంటి అవకాశం కూడా వచ్చింది. ఒకవైపు పేరు మరో వైపు డబ్బూ.

మర్నాడు భోజనం చేస్తూంటే మరోసారి భర్తకు నచ్చచెప్పాలన్న ఆశతో ఆ ప్రస్తావన తెచ్చింది సరస్వతి.

"ఆ సంగతి మర్చిపొమ్మన్నాను" అన్నాడు వెంకట్రావ్ కటువుగా.

"మరి మొట్టమొదట ఎందుకు ఒప్పుకున్నారు? తీరా ఇప్పుడు మంచి అవకాశం వదిలేసి రమ్మంటున్నారు. నాకెంత అవమానంగా వుంటుందో తెలుసా?" పౌరుషంగా అడిగింది సరస్వతి.

"నాకు మాత్రం అవమానంగా లేదనుకుంటున్నావా? సినిమా షూటింగుల పేరుతో వాళ్ళావిడ ఎక్కడెక్కడో ఎవరెవరితోనో తిరుగుతూంటే ఈ మొగుడికి చీమకుట్టినట్టయినా అనిపించటంలేదు అని వూళ్ళోవారు చెవులు కొరుక్కుంటున్నారు" ఆవేశం కట్టలు తెంచుకుంది వెంకట్రావులో.

ఆ మాట విన్న సరస్వతి ఆశ్చర్యపోయింది.

"అంటే మీకు మీకు నా మీద నమ్మకం లేదా?" భయంగా భర్తవైపు చూస్తూ అడిగింది. "నాకు నమ్మకం వుంటే సరిపోతుందా? ఊళ్ళోవాళ్ళకి వుండద్దూ? పైగా మా అమ్మకీ నాన్నకీ కూడా ఇష్టంలేదు నువ్వు సినిమాల్లో నటించటం."

"సరే అయితే ఇప్పుడు ఒప్పుకున్న ఈ సినిమా ఒక్కటీ చేస్తాను. తర్వాత ఇక మానేస్తాను" తలవంచుకుని చెప్పింది.

"ఓసారి చెపితే వినాలి. నాకిష్టంలేదు. నీకు నేను కావాలో సినీమాలు కావాలో ఆలోచించుకో" అంటూ భోజనం పూర్తికాకుండానే కంచంలో చేయికడుక్కుని లేచిపోయాడు వెంకట్రావు.

సరస్వతికి అన్నం సహించలేదు. ఒకవైపు సినీమా నటిగా తన భవిష్యత్తు మరోవైపు ఎంతగానో ప్రేమించిన భర్తతో దాంపత్య జీవితం. ఆ రెండు అనుభూతులకూ సంబంధించిన ఆలోచనలతో ఆమె సతమతమైపోయింది. చివరకు భర్తతో కాపురానికే ఆమె ప్రాధాన్యతనిచ్చింది. అగ్రిమెంట్ రద్దుచేసుకుని, తీసుకున్న అడ్వాన్స్ తిరిగి ఇచ్చేయాలనుకుంది. ఆ విషయాన్ని భర్తకు చెప్పి మర్నాడు మద్రాసు చేరుకుంది.

చంద్రన్ మ్యూజిక్ సిట్టింగ్‌లో వున్నాడనీ, సాయంత్రానికి వస్తాడనీ చెప్పాడు అసిస్టెంటు. సాయంత్రం ఆరింటికి ఆఫీసు చేరుకుంది సరస్వతి. ఎనిమిదింటికి చంద్రన్ వచ్చాడు. ఇంటి దగ్గర జరిగిన సంగతి యావత్తూ చెప్పిందామె. చంద్రన్ ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకోపోగా తేలిగ్గా నవ్వేశాడు.

"నువ్వొట్టి పిచ్చిదానివి" అన్నాడు.

అతనివైపు పిచ్చిదానిలాగే చూసింది సరస్వతి.

"కాళ్ళ ముందుకొచ్చిన అదృష్టదేవతను కాదు పొమ్మంటున్నావ్" అన్నాడు మళ్ళీ.

"నిజమే సార్. నాకా అదృష్టంలేదు" దిగులు నిండిన స్వరంతో చెప్పిందామె.

"అని నువ్వనుకుంటున్నావ్. కానీ నిన్ను మాత్రం అదృష్టదేవత వదిలి పెట్టదు."

అర్థం కానట్టు చూసింది ఆమె.

"నిన్ను హీరోయిన్‌గా బుక్ చేసుకున్నట్టు అప్పుడే అన్ని పత్రికల్లోనూ న్యూస్ వచ్చేసింది. పైగా నేను తొలి అవకాశం ఇచ్చిన వాళ్ళందరూ గొప్ప స్టార్స్‌గా పేరు తెచ్చుకున్నారు. నీక్కూడా ఎంతో ఫ్యూచర్ వుంది. నామాట విని నీ ఆలోచనలు మార్చుకో. మొగుడూ, సంసారం అనేవి జీవితాంతం వుండేవే పేరు ప్రఖ్యాతులే ఒక్కసారి వస్తాయి. వాటిని సొంతం చేసుకుని పదికాలాలపాటు కాపాడుకోవాలి. వాటిని ఆధారం చేసుకుని పదిరూపాయలు వెనకేసుకోవాలి. రేపు నువ్ పెద్ద స్టార్‌గా పేరు తెచ్చుకుని లక్షలు సంపాదిస్తే నీ మొగుడు, ఇప్పుడు నిన్ను కాదన్నవాడే వెతుక్కుంటూ వస్తాడు. నీ బంగళా ముందు గూర్ఖాలా కాపలా కాస్తాడు. అయినా తనతో నేను స్వయంగా మాట్లాడి నచ్చచెప్తాను. నీకేం భయంలేదు" అన్నాడు చంద్రన్.

ఏదో ఒకనాటికి నటిగా మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్న కోరికేదో అంతర్లీనంగా ఆమె మనసు పొరల్లో ఏనాడో నాటుకు పోవటంవల్ల చంద్రన్ మాటల్ని కాదనలేకపోయింది. 'నిజమే రోజులెప్పుడూ ఒక్కలా వుండవు. ఆలోచన్లు కూడా ఎప్పుడూ ఒకే రీతిలో సాగవు. ఇవాళ కాదు పొమ్మన్నా రేపు ఏదో ఒకనాడు తన భర్త తన దగ్గరకు రాకపోడు. తను సినీమా రంగంలో స్థిరపడి ఇల్లూ, కారూ కొనుక్కుంటే తన భర్తకూడా వచ్చి తనతోటే వుండచ్చు.' అట్లా మనసు సరిపెట్టుకుంది సరస్వతి.

వెంటనే భర్తకు ఉత్తరం రాసింది.

"తప్పనిసరి పరిస్థితుల్లో ఇక్కడ వుండిపోవాల్సి వచ్చింది. చంద్రన్ గారి సినీమా పూర్తయ్యాక వస్తాను. మీకు పనిలేకపోతే మీరుకూడా నాతో వచ్చి వుంటే సంతోషిస్తాను" అని ఆ వుత్తరానికి వెంటనే జవాబు రాశాడు వెంకట్రావ్.

"మొగుడనేవాడు బతికి వున్నాడన్న సంగతి మర్చిపో. ఇక నీదారి నీదే" అని రెండే రెండు వాక్యాలు రాశాడు.

ఆ క్షణం నుంచీ కష్టసుఖాలు కలసి పంచుకోవాల్సిన ఆ భార్యాభర్తల మధ్య కలతలు చోటుచేసుకున్నాయి. ఆ కలతలు మనసును కలచి వేస్తూండగానే షూటింగ్ పూర్తయ్యాక ఆ చిత్రంలో హీరోగా నటిస్తున్న సుందరం ఆమె రూమ్‌కి వచ్చాడు.

"నీ గురించి చంద్రన్ చెప్పాడు" అన్నాడు.

"ఔను సుందరంగారూ నేను చాలా వర్రీడ్ గా వున్నాను. నా భర్తమాట కాదని పొరపాటు చేశానేమోనని అప్పుడప్పుడు అనుకుని బాధపడుతున్నాను" చెప్పింది సరస్వతి.

"అదే పొరపాటు నువ్ కరెక్ట్ డెషిషన్ తీసుకున్నావ్ సినీమా తారగా నీకు అద్భుతమైన ఫ్యూచరుంది. కావాలంటే నేను రాసిస్తాను. వచ్చే నెలలో నీకు మరో రెండు ఆఫర్స్ రాబోతున్నాయి. ఆ రెండింటిలోనూ నేనే హీరోగా చేస్తున్నాను. నీ పేరు వాళ్ళకి చెప్పాను. వాళ్ళు చంద్రన్ గారిని అడిగారు. చంద్రన్ గారు కూడా నీ గురించి మంచి రిపోర్ట్ ఇచ్చారు" భవిష్యత్తు గురించి బంగారు ఆశలు చూపించాడు సుందర్.

నెమ్మదిగా గతాన్ని మర్చిపోసాగిందామె.

కానీ ఆమె కడుపులో పెరుగుతున్న శిశువు, ఆ గతాన్ని క్షణం క్షణం గుర్తుకు తెస్తూనే వుంది. ఇప్పుడేం చేయాలి. తనకు మానసికంగా దగ్గరయిన సుందరానికి ఆ విషయం చెప్పి సలహా అడిగింది సరస్వతి.

"ఇంత చిన్న విషయానికి అంత బుర్రబద్దలు కొట్టుకోవటం దేనికి? సాయంత్రం డాక్టరు దగ్గరికు వెడదాం" అన్నాడు.

లేడీ డాక్టరు ఆమెను పరీక్ష చేసింది. అబార్షన్ చేస్తే ప్రమాదం వుండదని హామీ ఇచ్చింది. కానీ సరస్వతి మనసొప్పలేదు.

"తప్పదు. సినీమా తారగా ఒక్కో మెట్టూ పైకి ఎక్కాలంటే ఇలాంటి బంధాల్ని తెంచుకోవాలి. విషయం మూడో కంటికి తెలియకుండా అబార్షన్ చేయిచుకో. అసలు నీకు పెళ్ళయిన సంగతే మర్చిపో" సలహా ఇచ్చాడు సుందరం.

తాను ప్రయాణం చేస్తున్న ఒంటరి జీవితంలో సుందరం ఒక శ్రేయోభిలాషిగా కనిపించాడు. ఆ క్షణంలో సరస్వతి అతన్నే తన గైడ్‌గా భావించింది. అతని ప్రాపకంలో పలుకుబడిలో ఆమె ఒక్కొక్క మెట్టూ పైకి ఎక్కాలంటే ఇలాంటి బంధాల్ని తెంచుకోవాలి. విషయం మూడోకంటికి తెలియకుండా అబార్షన్ చేయించుకో. అసలు నీకు పెళ్ళయిన సంగతే మర్చిపో" సలహా ఇచ్చాడు సుందరం.

తాను ప్రయాణం చేస్తున్న ఒంటరి జీవితంలో సుందరం ఒక శ్రేయోభిలాషిగా కనిపించాడు. ఆ క్షణంలో సరస్వతి అతన్నే తన గైడ్‌గా భావించింది. అతని ప్రాపకంలో పలుకుబడిలో ఆమె ఒక్కొక్క మెట్టే పైకి చేరుకుంది. మూడు భాషల్లో ప్రముఖ నటిగా గుర్తింపు తెచ్చుకుంది. అనేకసార్లు అత్యుత్తమ నటి పురస్కారాలు పొందకలిగింది. కేవలం అయిదేళ్ళ వ్యవధిలో అయిదు లక్షల పారితోషికం తీసుకునే స్థాయికి చేరుకుంది. అప్పుడు అనుకోకుండా ఒకరోజు వెంకట్రావ్ ఆమె ఇంటిముందు ప్రత్యక్షమయ్యాడు.

"మనిద్దరం కలసివుందాం" అన్నాడు. మళ్ళీ ఆలోచనలో పడింది సరస్వతి. కలసి వుంటే తనకు పెళ్ళయిన సంగతి ప్రపంచానికి తెలుస్తుంది. సినీమాల్లో అవకాశాలు తగ్గిపోతాయి. అందుకే ఆమె ఒక నిర్ణయానికి వచ్చింది.

"నాకు నీతో కాపురం చేయటం ఇష్టంలేదు" అంటూ నిర్దయగా చెప్పేసింది. అతను కోర్టుకి అప్పీలు చేసుకున్నాడు.

కోర్టుకూడా గ్లామర్‌కీ, డబ్బుకీ, పలుకుబడికీ తలవంచింది.

ఫలితం -

వెంకట్రావ్ పిచ్చివాడయ్యాడు. సరస్వతి మాత్రం నటిగా గొప్ప పేరు తెచ్చుకుని ఓ మంచి మొగుడు కోసం ఇప్పుడు నిరీక్షిస్తోంది.

ఊఊఊ